ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
ఆదివారం 22 డిసెంబరు 2024



పంటల బీమా ప్రీమియం గడువు పెంపు

ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. పంటల బీమాకు చెల్లించే ప్రీమియం గడువును ఈ నెలాఖరు వరకు పెంచుతూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. రైతులు, రైతు సంఘాల విజ్ఞప్తి మేరకు రాష్ట్ర ప్రభుత్వం రాసిన లేఖపై కేంద్రం స్పందించింది. రుణం తీసుకున్న రైతులకు వారి తరఫున బ్యాంకులే ప్రీమియం చెల్లిస్తాయి. మిగిలిన రైతులు ప్రీమియాన్ని ఈ నెలాఖరులోపు చెల్లించాల్సి ఉంది. మొదటి పంటల బీమా కోసం ప్రీమియం చెల్లించేందుకు వరికి మాత్రమే ఈ నెల 31 వరకు ఉండగా, మిగిలిన పంటలకు 15 వరకు గడువు విధించారు. ఈ గడువును నెలాఖరు వరకు పొడిగించడంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

వీఎస్‌యూకి రూ.20 కోట్ల మంజూరు

వెంకటాచలం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కాకుటూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయానికి రూ.20 కోట్లు మంజూరైనట్లు ఆ వర్సిటీ ఉపకులపతి విజయభాస్కర్ రావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ, ఉన్నత విద్య విభాగం నుంచి పీఎం ఉషా పథకం కింద ఈ నిధులు మంజూరైనట్లు చెప్పారు. కొత్త భవన నిర్మాణాలు, భవనాల పునరుద్ధరణ, పరిశోధన పరికరాలు, ఇతర అభివృద్ధి పనులకు ఈ నిధులు వినియోగించనున్నట్లు చెప్పారు. అంతేగాక ఆన్‌లైన్ కోర్సుల అభివృద్ధి, ఇంటర్న్‌షిప్‌లు, పారిశ్రామిక సహకారం, వృత్తిపరమైన కోర్సులు తదితర వాటిల్లోనూ పురోగతి సాధిస్తామన్నారు. వర్సిటీ చరిత్రలో తొలిసారిగా ఇంత భారీ మొత్తంలో నిధులు రావడం సంతోషంగా ఉందన్నారు.

వీఏఏల ఆకస్మిక బదిలీలు

ఉదయగిరి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ శాఖలో గ్రామ వ్యవసాయ సహాయకులను (వీఏఏ) ఆకస్మికంగా డిప్యూటేషన్‌పై బదిలీ చేయడంతో వారు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో 48 మంది వీఏఏలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. వీరిలో 28 మంది మహిళా వీఏఏలు ఉండటం గమనార్హం. ఉదయగిరి సబ్ డివిజన్‌లోని సీతారామపురం, వరికుంటపాడు, దుత్తలూరు, ఉదయగిరి, మర్రిపాడు మండలాల్లో 61 మంది వీఏఏలు ఉండగా 24 మందిని బదిలీ చేశారు. ఇతర మండలాల్లో వీఏఏల కొరత కారణంగా ఉన్నతాధికారులు ఈ చర్యలు తీసుకొన్నట్లు సమాచారం. అయితే విద్యాసంవత్సరం మధ్యలో ఇలా బదిలీ చేయడం దారుణమని పలువురు వీఏఏలు వాపోతున్నారు.

ఎన్‌డీసీసీబీ, ఎన్‌డీసీఎంఎస్‌లకు ప్రత్యేకాధికారి పాలన పొడిగింపు

నెల్లూరు (హరనాథపురం), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (ఎన్‌డీసీసీబీ), నెల్లూరు జిల్లా కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (ఎన్‌డీసీఎంఎస్)లకు ప్రత్యేకాధికారి పాలనా కాలాన్ని మరో ఆరు నెలలు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి. రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు ఎన్నికలు జరిగితే వాటి అధ్యక్షులే ఎన్‌డీసీసీబీకు, ఎన్‌డీసీఎంఎస్‌లో సభ్యులుగా ఉంటారు. వారిలో ఒకరిని ఎన్‌డీసీసీబీ, ఎన్‌డీసీఎంఎస్‌కు చైర్మన్‌గా ఎన్నుకుంటారు. ప్రభుత్వ నిర్ణయం ప్రకారం డైరెక్టర్లను ఎన్నుకుంటారు. అయితే, సహకార సంఘాలకు ఎన్నికలు జరగక పోవటంతో ఎన్‌డీసీసీబీ, ఎన్‌డీఎంఎస్‌లకు ప్రత్యేకాధికారి పదవీ కాలాన్ని పొడిగించారు. ప్రస్తుతం ప్రత్యేక అధికారిగా ఉన్న జాయింట్ కలెక్టర్ కార్తీక్ మరో ఆరునెలలపాటు కొనసాగనున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత పీఏసీఎస్‌లకు ఎన్నికలు జరుగుతాయని నాయకులు ఆశించారు. కానీ పీఏసీఎస్‌లకు ఎన్నికలు నిర్వహించకపోవటంతో వారి ఆశలు అడియాశలయ్యాయి.

అరుదైన దృశ్యం..

అవిష్కృతం



- శనివారం నాటి పగలు 11.30 గంటలు, రాత్రి 12.30 గంటలు
- సైన్స్ కేంద్రంలో ఖగోళ దర్పణం ద్వారా వీక్షణ
- క్యూరేటర్ సుబ్రహ్మణ్యం ప్రయోగ పూర్వక వివరణ

- వివరాలు 6లో..

నీరు అందేనా..

వరి పండేనా!?



సీతారామపురం గ్రామ సమీపంలో ఎండిన దుక్కులు

రాళ్లపాడు రిజర్వాయరు ఆయకట్టు రైతుల పరిస్థితి త్రిశంకుస్వర్గంలో పడింది. రిజర్వాయరు స్టాప్‌లాక్ గేటు విరిగిపోయి రెండువారాలు గడిచినా సమస్య పరిష్కారానికి ప్రణాళికాబద్ధ కృషి జరగడం లేదని, మొక్కుబడి చర్యలతో కాలం వెళ్లబుచ్చుతున్నారన్న ఆందోళన వ్యక్తమవుతోంది. కుడికాలువకు ప్రస్తుతం 140 క్యూసెక్కుల నీరు వెళుతోందని అధికారులు చెబుతున్నా వాస్తవానికి 70 క్యూసెక్కులు కూడా రావటం లేదని దుక్కులు, నాట్ల సమయంలో 200 క్యూసెక్కులను తగ్గకుండా వస్తేనే నాట్లు వేయగలం కానీ ఇలా నీరిస్తే ఏమాత్రం ఫలితం ఉండదని రైతులు వాపోతున్నారు.

6

యాంటీబయోటిక్స్ మోతాదుకు

మించితే అనర్థమే!



- వ్యాధుల నివారణకు ముందస్తు టీకాలే బెటర్
- 'గోకులం' షెడ్ల నిర్మాణానికి రాయితీలు
- జునోటిక్ వ్యాధులపై అవగాహన అవసరం
- 'ఆంధ్రజ్యోతి'తో పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల ఏడీ చైతన్యకిశోర్

6

కేంద్ర పథకాలతో

జిల్లా సమగ్రాభివృద్ధి

- పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులదే!

త్వరలో గుజరాత్‌లో పర్యటిస్తాం

'దిశ' సమీక్షలో చైర్మన్, ఎంపీ వేమిరెడ్డి

ఎమ్మెల్యేలు, ఎంపీపీల గైర్హాజరుపై అసంతృప్తి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ వేమిరెడ్డి పక్కన కలెక్టర్ ఆనంద్, జడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ



పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

నెల్లూరురూరల్, డిసెంబరు 21, (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాలలో పేదలు, నిరుపేదలకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాల ద్వారా ప్రత్యక్ష, పరోక్ష లబ్ధిని అందిపుచ్చుకుని జిల్లాను సమగ్ర అభివృద్ధి వైపు తీసుకెళ్లాలని నెల్లూరు ఎంపీ, జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) చైర్మన్ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం నెల్లూరులోని జడ్పీ సమావేశ మందిరంలో జరిగిన దిశ సమావేశంలో కలెక్టర్ ఆనంద్‌తో కలిసి ఎంపీ పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 67 పథకాల ద్వారా ప్రజలకు ఆర్థిక ప్రయోజనాన్ని అందిస్తోందని, వీటిని ప్రజలకు చేరవేసే బాధ్యత ప్రజాప్రతినిధులు తీసుకోవాలని పిలుపునిచ్చారు. అన్ని ప్రభుత్వ శాఖల్లో కేంద్ర పథకాలు, వాటి ప్రయోజనాలు ఉన్నా వాటిని సక్రమంగా ఉపయోగించుకోవడం లేదన్నారు. గుజరాత్‌లో కేంద్ర పథకాల ద్వారా గణనీయమైన అభివృద్ధి సాధించారని, ఒకసారి ఆ రాష్ట్రానికి వెళ్లి పర్యటించమని ప్రధాని మోదీ తనకు సలహా ఇచ్చారన్నారు. వీలైనంత తొందరలో అధికారులు, ప్రజాప్రతినిధుల బృందంతో గుజరాత్‌లో అధ్యయనం చేయనున్నట్లు తెలిపారు. ఏ పథకం కింద కేంద్ర ప్రభుత్వ నిధులను అదనంగా రాబట్టుకోవచ్చో తన దృష్టికి తీసుకురావాలని అధికారులను కోరారు. తన శక్తిమేరకే జిల్లాను అభివృద్ధి చేయాలనే ఆలోచనతోనే తాను రాజకీయాల్లోకి వచ్చానని, ఎంపీ అనే రెండు అక్షరాల కోసం రాలేదన్నారు. కేంద్ర పథకాలు, నిధుల పట్ల అవగాహన లేక అందరం రాష్ట్ర ప్రభుత్వం మీదే ఆధారపడుతున్నామని, ఇకనైనా కేంద్రం నుంచి ఏ రూపంగా నిధులు జిల్లాకు తీసుకురావచ్చో ఆలోచించాలన్నారు.

గైర్హాజరుపై అసంతృప్తి

కేంద్ర ప్రభుత్వ పథకాలపై సమీక్షించుకునేందుకు తొలిసారిగా మొదలుపెట్టిన ఈ సమావేశానికి ఎమ్మెల్యేలు, ఎంపీపీలు గైర్హాజరుకావడం కొంతబాధ కలిగించిందని వేమిరెడ్డి అన్నారు. ఉదయగిరి, కావలి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ కల్యాణ చక్రవర్తి, జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మలైన హాజరైనందుకు సంతోషంగా ఉందని తెలిపారు. 37 మంది ఎంపీపీలకు 8 మం దే హాజరవడం తృప్తినివ్వడం లేదన్నారు. ఈసారి జరిగే సమావేశానికైనా ప్రజాప్రతినిధులంతా రావాలని కోరారు. ప్రజలకు ప్రయోజనాలు చేకూర్చే ఇలాంటి సమావేశాలకు కూడా రాకపోతే ఎలా అంటూ సున్నితంగా ప్రశ్నించారు.

అక్కడ చెప్పేది ఇక్కడ జరగడం లేదు

ఢిల్లీలో ఎంపీలకు కేంద్రం చెప్పేది క్షేత్ర స్థాయిలో జరగడం లేదని ఎంపీ వీపీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. పార్లమెంట్‌లో తాము అడిగిన ప్రశ్నలకు గొప్పగా సమాధానాలు వస్తున్నాయని తీరా ఇక్కడ చూస్తే ఏమీ లేదన్నారు. ఇలాగైతే ఎలా అంటూ

- మిగతా 6లో

ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు ఏకగ్రీవం



చేజర్ల : సోమశిల ప్రాజెక్టు చైర్మన్‌గా ప్రత్యేక అధికారి నుంచి ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న వేలూరు కేశవచౌదరి

నెల్లూరురూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సాగునీటి సంఘాలకు జరుగుతున్న ఎన్నికల క్రతువు ముగిసింది. క్షేత్రస్థాయిలో ఇటీవల నిర్వహించిన సాగునీటి వినియోగదారుల సంఘాలన్నీ కూటమి ఖాతాలోనే జమ అయ్యాయి. అనంతరం జరిగిన డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికలు సైతం టీడీపీ చేజిక్కించుకుంది. ఆఖరి ఘట్టంగా శనివారం జరిగిన ఎన్నికల్లో మేజర్, మీడియం ప్రాజెక్టులకు టీడీపీ అభ్యర్థులే చైర్మన్లుగా ఎన్నికయ్యారు. ఈ తంతు జిల్లాలోని వివిధ ప్రాంతాలలో ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలో సాగునీటి మేజర్ ప్రాజెక్టులుగా ఉన్న పెన్నా డెల్టా కమిటీకి చైర్మన్‌గా జెట్టి రాజగోపాల్ రెడ్డి, వైస్ చైర్మన్‌గా బీద గిరిధర్, సోమశిల ప్రాజెక్టు చైర్మన్‌గా వేలూరు కేశవ చౌదరి, వైఎస్ చైర్మన్‌గా పులుగుంట మధుమోహన్‌రెడ్డి ఎన్నికయ్యారు. మీడియం ప్రాజెక్టులుగా ఉన్న కనుపూరు కాలువ కమిటీకి చైర్మన్, వైఎస్ చైర్మన్‌లుగా వద్దినేని చిన్న మస్తానయ్య, టీ రామయ్యలు, గండిపాళెం ప్రాజెక్టు కమిటీకి చైర్మన్, వైస్ చైర్మన్లుగా అడుసుమల్లి వెంకటసుబ్బయ్య, కే రమణారెడ్డి, రాళ్ళపాడు పీసీ చైర్మన్, వైస్‌చైర్మన్లుగా ఏలూరు వెంకటేశ్వర్లు, నరాల మాలకొండారెడ్డి, వీరరాఘవునికోట (వీఆర్‌కోట) ఆనకట్టు సిస్టమ్ పీసీ చైర్మన్, వైస్ చైర్మన్లుగా తాళ్లపనేని వెంకటరవీంద్రబాబు, టీ మాల్యాద్రి ఎన్నికైనట్లు జలవనరుల శాఖ ఉన్నతాధికారులు అధికారికంగా ప్రకటించారు.

ఏపీఐఐసీ జడ్ఎంగా అనీల్‌కుమార్

నెల్లూరు (వెంకటేశ్వరపురం) డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపీఐఐసీ) జోనల్ మేనేజర్(జడ్ఎం)గా జీ.అనీల్‌కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు ఏపీఐఐసీ ఇంజనీరింగ్ విభాగంలో డీజడ్ఎంగా ఉన్న వీరశేఖర్ రెడ్డి జెడ్ఎంగా బాధ్యతలు నిర్వహిస్తూ వచ్చారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్నది. ఈ నేపథ్యంలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఈడీగా విధులు నిర్వహిస్తున్న అనీల్‌కుమార్‌ను నెల్లూరు జడ్ఎంగా ప్రభుత్వ నియమించింది.

డీఎంహెచ్‌వోగా సుజాత

- రంపచోడవరానికి పెంచలయ్య బదిలీ
- పలు ఆరోపణల నేపథ్యంలో డి ప్రమోషన్
- వైద్య ఆరోగ్య శాఖలో విస్తృత చర్చ



నెల్లూరు (వైద్యం), (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా (డీఎంహెచ్‌వో) డాక్టర్ సుజాత నియమితులయ్యారు. ఇక్కడున్న పెంచలయ్యను అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం అదనపు డీఎంహెచ్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం రూరల్ హెల్త్ అధికారిగా ఉంటున్న డాక్టర్ సుజాత డీఎంహెచ్‌వోగా త్వరలో బాధ్యతలు చేపట్టనున్నారు. కాగా, ప్రస్తుత డీఎంహెచ్‌వో పెంచలయ్యకు డీ ప్రమోషన్‌పై ఆ శాఖలో విస్తృత చర్చ నడుస్తోంది. ఈయనపై అనేక ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలోనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. 2022, మే నెలలో ప్రమోషన్‌పై డీఎంహెచ్‌వోగా తిరుపతి నుంచి వచ్చిన పెంచలయ్య జిల్లాలో రెండేళ్ల ఏడు నెలలు పనిచేశారు. మరో ఏడాది మాత్రమే సర్వీసు ఉంది. అయితే వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్న అనుమానంతో ప్రభుత్వం ఆయనపై కఠినంగా వ్యవరించినట్లు సమాచారం.

ఇంటర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజనం

- పునరుద్ధరణకు చర్యలు చేపట్టిన అధికారులు

నెల్లూరు(విద్య)/ఆత్మకూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల ఆకలి చదువులకు కూటమి ప్రభుత్వం మంగళం పాడనుంది. కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేయాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాలు జారీ చేశారు. 2019లో అప్పటి టీడీపీ ప్రభుత్వమే ఇంటర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజనం అమలుచేసింది. అయితే, అధికారంలోకి వచ్చిన వైసీపీ ఈ పథకాన్ని తొలగించింది. ప్రస్తుతం జిల్లాలో 23 ప్రభుత్వ, మున్సిపల్, ఎయిడెడ్ జూనియర్ కాలేజీలు ఉండగా, 6074 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రాంగణంలో ఉన్న కాలేజీలకు ఆ పాఠశాలల్లోని వంటవారి

- మిగతా 6లో

ఇదేం శిక్షణ!

కూటమి ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ చేస్తామని ప్రకటించడంతోపాటు నోటిఫికేషన్లు జారీ చేస్తుండటంతో ప్రైవేట్ కోచింగ్ సెంటర్ల నిర్వాహకుల పంట పండుతోంది. ఉద్యోగాల మాటేమోగానీ శిక్షణకు వస్తున్న అభ్యర్థుల నుంచి మాత్రం భారీగా ఫీజులు వసూలు చేస్తున్నారు. అనుమతులు, కనీస వసతులు లేకుండా దుకాణాలు, ఇళ్లు బాడుగలకు తీసుకుని వాటిల్లో శిక్షణ ఇస్తున్నారు. వీరిపై అధికారుల పర్యవేక్షణ కూడా లేకపోవడంతో ఇష్టానుసారంగా కోచింగ్‌ల పేరుతో జిల్లాలో దోపిడీ జరుగుతోంది.

- మరుగుదొడ్లు, ఫ్యాన్లు ఉండవు!
- అనుభవ ఫ్యాకల్టీ కూడా అంతంతే
- కోచింగ్ సెంటర్ల పేరుతో నిలువు దోపిడీ
- భారీగా ఫీజులు వసూలు చేస్తున్న నిర్వాహకులు
- అన్నీ తెలిసి కునుకు వహిస్తున్న యంత్రాంగం



నెల్లూరు : సోమశేఖరపురంలో ఓ దుకాణంలో టీఈడీ కోచింగ్‌కు హాజరైన అభ్యర్థులు

నెల్లూరు (విద్య), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గత కొన్నేళ్లుగా నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న తరుణంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పలు విభాగాల్లో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో వేలాది మంది నిరుద్యోగ యువత ఇప్పుడు ఈ అవకాశాన్ని చేజార్చుకుంటే తమకు ఉద్యోగం రాదని భావిస్తూ ఎలాగైనా ఉద్యోగం సాధించాలన్న కసితో ఉన్నారు. అందులో భాగంగానే పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేందుకు కోచింగ్ సెంటర్లను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు భారీగా ఫీజులు వసూలు చేస్తున్నారు. జిల్లాలోని అన్ని ప్రాంతాలకు చెందిన యువత తమ సమీపంలోని పట్టణం, నగర ప్రాంతాలకు చేరి కోచింగ్ సెంటర్లలో చేరడంతోపాటు సమీప హాస్టళ్లలో ఉంటున్నారు. కోచింగ్ సెంటర్లు, హాస్టల్స్ గతంలో రూ.15వేల నుంచి రూ.20వేలు వసూలు చేయగా ప్రస్తుతం రూ.20వలే నుంచి 30వేల వరకు ఫీజులు వసూలు చేస్తున్నట్లు సమాచారం. తమ భవిష్యత్‌కు సంబంధించిన అంశం కావడంతో ఏమీ మాట్లాడలేని పరిస్థితి తమదని, ఎలాగైనా సరే ఉద్యోగం వస్తుందన్న ఆశతో వారు అడిగినంత ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని అభ్యర్థులు చెబుతున్నారు.

ఫ్యాకల్టీ అర్హతలు ఏమిటి!?

జిల్లా కేంద్రంలోనే కాకుడా పలు పట్టణాల్లోకోచింగ్ సెంటర్లు వెలిశాయి. ఇవన్నీ ప్రభుత్వ నిబంధనలు పాటిస్తున్నాయా!? అసలు అనుమతులు ఉన్నాయా లేదా, తమ వద్ద ఎలాంటి వసతులున్నాయన్న అంశాలను కూడా తెలియకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. నేరుగా అభ్యర్థులకే తమ కోచింగ్ సెంటర్ గురించి తెలిసేలా చేస్తున్నారు. తమ వద్ద అనుభవజ్ఞులైన సీనియర్ ఫ్యాకల్టీ ఉందని, నిపుణులతో తయారు చేయించిన స్టడీ మెటీరియల్ ఉండి అధిక మార్కులు సాధించడానికి తోడ్పడతామని చెబుతూ ఆకర్షిస్తున్నారు. అయితే, ఎక్కడా ఫ్యాకల్టీలు, వారి అర్హతల వివరాలు మాత్రం రహస్యంగానే ఉంచుతున్నారు. ఇప్పటికే డీఎస్సీకి, పోలీస్ రిక్రూట్‌మెంట్‌కు సంబంధించి ఆయా శాఖలకు చెందిన ఉద్యోగులే దీర్ఘకాలిక సెలవులు పెట్టి అనధికారికంగా కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేసి లక్షలాది రూపాయలను దండుకుంటున్నారు. త్వరలో మరికొన్ని నోటిఫికేషన్లు కూడా విడుదల కానుండటంతో ఈ దోపిడీ మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రభుత్వ ఆధ్వర్యంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ స్టడీ సర్కిల్స్ ఏర్పాటు చేస్తున్నా, వీటిలో పరిమిత సంఖ్యలోనే అభ్యర్థులను చేర్చుకుంటున్నారు. దీంతో అత్యధిక శాతం మంది ప్రైవేట్ కోచింగ్ సెంటర్లను ఆశ్రయించక తప్పడం లేదు.

నిబంధనల ఉల్లంఘన

అత్యధిక శాతం కోచింగ్ సెంటర్లకు అనుమతులు లేకపోగా కనీస నిబంధనలు కూడా పాటించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఫంక్షన్ హాళ్లు, స్కూళ్లు, కళాశాలలు, ఆడిటోరియాలు, పాత షాపింగ్ మాల్స్‌ను అద్దెకు తీసుకుని కోచింగ్ సెంటర్లు నిర్వహిస్తున్నారు. వీటిలో అత్యధికంగా ప్రభుత్వ ఉపాధ్యాయులే కోచింగ్ సెంటర్‌లు నిర్వహిస్తున్నారని, కొన్ని కోచింగ్ సెంటర్లలో వారే ఫ్యాకల్టీలుగా వ్యవహరిస్తున్నారని తెలిసినా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రతి కోచింగ్ సెంటర్‌లో భారీగా యువత చేరుతుండటంతో వీరిని నాలుగైదు బ్యాచ్‌లుగా విభజించి శిక్షణ ఇస్తున్నారు. కనీసం మరుగుదొడ్లు, ఫ్యాన్‌లు లేకుండా శిక్షణ ఇస్తున్నారని అభ్యర్థులు వాపోతున్నారు. ఇటీవల కేంద్రప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసి కోచింగ్ సెంటర్లలో జరిగే మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రకటించింది. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం దీనిపై దృష్టి సారించి అనధికార కోచింగ్ సెంటర్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

ఇంటర్ కళాశాలల్లోనూ
మధ్యాహ్న భోజనం

(5వ పేజీ తరువాయి)

ద్వారానే విద్యార్థులకు భోజనం అందిస్తారు. మిగిలిన కాలేజీలకు సమీప పాఠశాలల నుంచి భోజనం సరఫరా చేస్తారు. ఇందుకుగాను వంటవారికి, రవాణా ఖర్చులు ఇవ్వనున్నారు. ఈ పథకం పునరుద్ధరణతో మేలు జరుగుతుందని అధ్యా పకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నిర్వహణకు అన్ని చర్యలు

జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలుకు చర్యలు తీసుకుంటున్నాం. వంట ఏజెన్సీలు నియామకం, వసతులు, ఇతర అంశాలను పరిశీలిస్తున్నాము. జనవరి నుంచి తాత్కాలిక ఏర్పాట్లు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించేలా రంగం సిద్ధం చేస్తున్నాము. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఎంతో ఉపయుక్తమైన ఈ కార్యక్రమాన్ని ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా నిర్వహిస్తాం.

- ఆదూరు శ్రీనివాసులు, ఆర్ఐవో

31లోగా ఓపెన్ స్కూల్ పరీక్ష
ఫీజు చెల్లించాలి

నెల్లూరు(విద్య), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఏపీ సార్వత్రిక విద్యాపీఠం(ఓపెన్‌స్కూల్) టెన్త్, ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు ఈనెల 31వతేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించాలని డీఈవో డాక్టర్ ఆర్.బాలాజీరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలస్యమైతే జనవరి 1 నుంచి 4 లోపల రూ.25, జనవరి 5 నుంచి 8లోగా రూ.50 అపరాధ రుసుము, జనవరి 9 నుంచి 10వతేదీ లోగా తత్కాల్ రుసుముతో ఫీజు చెల్లించవచ్చన్నారు. టెన్త్ అభ్యాసకులు థియరీ సబ్జెక్టుకు రూ.100లు, ఇంటర్ అభ్యాసకులు థియరీ సబ్జెక్టుకు రూ.150లు, ప్రాక్టికల్స్‌కు రూ.100ల చొప్పున ఫీజు చెల్లించాలన్నారు. అలాగే బెటర్‌మెంట్ రాసుకునే అవకాశం కూడా ఉందని, అభ్యాసకులు సమీపంలోని ఓపెన్ స్కూల్ కేంద్రాల్లోకానీ, నగరంలోని దర్గామిట్ట జిల్లా పరీక్షల విభాగంలో కానీ సంప్రదించాలని ఆయన తెలిపారు.

అరుదైన దృశ్యం..
ఆవిష్కృతం



ఆకాశంలో శనివారం అరుదైన దృశ్యం చోటుచేసుకుంది. సాధారణంగా రోజుకు 24 గంటల్లో ఉంటే అందులో సగం పగలు, సగం రాత్రి ఉంటుంది. అయితే, శనివారం మాత్రం 11.30 గంటల పగలు, 12.30 గంటల రాత్రి ఉండటం విశేషం. మండలంలోని చెముడు గుంట వద్ద ఉన్న జిల్లా సైన్స్ కేంద్రంలో ఖగోళ దర్పణం ద్వారా ఆకాశంలో ఏర్పడిన ఆ అద్భుతాన్ని పలువురు వీక్షించారు. జిల్లా సైన్స్ సెంటర్ క్యూరేటర్ ఎన్ సుబ్రహ్మణ్యం ఖగోళ దర్పణం ద్వారా మకరరేఖ మీద సూర్యుడి గమనమార్గాన్ని ప్రయోగ పూర్వకంగా వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి తన 23.5 డిగ్రీల వంపుతో అక్షంపై తిరుగుతున్నందువల్ల శనివారం సూర్యకిరణాలు మకరరేఖ మీద నిలువుగా పడతాయన్నారు. ఇది ఎంతో అరుదైన రోజుగా పరిగణిస్తారని, జిల్లాలో దాదాపు 12.30 గంటలపాటు రాత్రి, మిగిలిన 11.30 గంటలు పగలు కనిపిస్తుందన్నారు. సాధారణంగా ఇలా జరగడాన్ని అయనాంతం అని అంటారని, ఈ రోజున సూర్యుడికి, భూమికి మధ్యలో దూరం ఎక్కువగా ఉంటుందన్నారు. దీంతో దక్షిణార్ధగోళంలో రోజు పొడవు ఎక్కువగా ఉండి ఉత్తరార్ధగోళంలో రాత్రి సుదీర్ఘంగా ఉంటుందన్నారు. ఈ కారణంగా ఉత్తరార్ధగోళం సూర్యుడికి ఎక్కువ దూరం వెళుతుందని, ఆ సమయంలో చంద్రకాంతి భూమిపై చాలా సమయం ఉంటుందన్నారు. ఈ అరుదైన రోజున భూమికి సూర్యుడికి గరిష్ఠ దూరం ఉండటం వల్ల సూర్యకిరణాలు ఆలస్యంగా భూమిపైకి చేరుతాయని, ఈ సహజమార్పు కారణంగా అత్యంత తక్కువ కాలం పగలు.. ఎక్కువకాలం రాత్రి ఉంటుందని తెలిపారు. ఉష్ణోగ్రతలో కూడా స్వల్ప మార్పులు ఉంటాయన్నారు.

- వెంకటాచలం, (ఆంధ్రజ్యోతి)

- శనివారం నాటి పగలు 11.30 గంటలు, రాత్రి 12.30 గంటలు
- సైన్స్ కేంద్రంలో ఖగోళ దర్పణం ద్వారా వీక్షణ

యాంటీబయాటిక్స్ మోతాదుకు
మించితే అనర్థమే!

- వ్యాధుల నివారణకు ముందస్తు టీకాలే బెటర్
- 'గోకులం' షెడ్ల నిర్మాణానికి రాయితీలు
- పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల ఏడీ చైతన్యకిషోర్

పశువులు వ్యాధుల బారిన పడితే మన సొంత జ్ఞానం, మందుల దుకాణ నిర్వాహకుల సలహాలతో యాంటీబయాటిక్స్ వినియోగిస్తుంటాం. ఆసుపత్రికి తీసుకెళితే ఎక్కువ ఖర్చులు అవుతాయని అక్కడ ఏవేవో మందులు రాస్తారని పాడిరైతుల ఉద్దేశం. అదేవిధంగా పశువులు, మేకలు, గొర్రెలకు వ్యాధినిరోధక టీకాలు వేస్తుంటే కొంతమంది రైతులు వద్దంటున్నారు. పాల దిగుబడి తగ్గుతుందని, జ్వరం వస్తుందని వారి వాదన. ఇవన్నీ కేవలం అపోహలేనని, డాక్టర్ సలహాలు తీసుకోకుండా విచక్షణారహితంగా యాంటిబయోటిక్స్ వాడకం వల్ల కలిగే నష్టాలు, ముందస్తు టీకాలు తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు, వర్షాకాలం పశువులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను నెల్లూరు పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల సహాయ సంచాలకుడు డాక్టర్ జానా చైతన్యకిషోర్ 'ఆంధ్రజ్యోతి' ద్వారా రైతులకు తెలియ జేశారు. పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ రమేష్ నాయక్ ఆధ్వర్యంలో జిల్లాలో అనేక సంక్షేమ కార్యక్రమాలు జరుగుతు న్నాయని, ఉచితంగా వ్యాధి నిరోధక టీకాలు వేయడం, గోకులాలు వంటి ఎన్నో కార్యక్రమాలు జరుగుతున్నాయని చెప్పారు. పరిశుభ్రత పాటిస్తూ, ముందస్తు టీకాలు వేయించుకోవడం, యాజమాన్య పద్ధతులను పాటిస్తూ పాడిరైతులు ఆర్థికంగా బలోపేతం కావాలని ఆకాంక్షించారు.

- నెల్లూరు (వ్యవసాయం, ఆంధ్రజ్యోతి)



? యాంటిబయోటిక్స్ వాడకం వల్ల కలిగే అనర్థాలు

! యాంటిబయోటిక్స్ వల్ల పశువులకు ఎంత మంచి జరుగుతుంతో అంతే నష్టం కలుగుతుంది. విచక్షణారహితంగా వినియోగించడం వల్ల యాంటి మైక్రోబియల్ నిరోధకత బారిన పడతాయి. ఇది అత్యంత ప్రమాదకరం. అత్యవసర పరిస్థితుల్లో పశువులకు ఎలాంటి మందులు పని చేయవు. కాబట్టి రైతులు వైద్యుల సలహాలు తీసుకోకుండా ఎలాంటి యాంటీబయోటిక్స్ వాడకూడదు. దీనిపై ఇటీవల జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాము. వైద్యులు సూచించిన కోర్సు తప్పనిసరిగా పూర్తి చేయాలి. ఎలాంటి పరిస్థితుల్లోనూ మధ్యలో ఆపకూడదని సూచించాము.

? వర్షాకాలంలో పశువులకు వచ్చే వ్యాధులు

! వర్షాకాలం వచ్చిందంటే పశువులు అధికంగా పచ్చికదొమ్మ అనే వ్యాధిన పడతాయి. వర్షం వల్ల మట్టిలోని బ్యాక్టీరియా గడ్డిపైకి వచ్చి చేరుతుంది. దీన్ని తిన్న పశువులు, మేకలు, గొర్రెలు ఆ వ్యాధి బారిన పడతాయి. గురక, తీవ్ర జ్వరం, చొంగ, చీమిడి కారడం దీని ముఖ్యలక్షణం. పశువులు ఒత్తిడికి గురైనప్పుడు కూడా ఈ వ్యాధిన బారిన పడతాయి. అంటే సరైన షెడ్డు, పాకలు లేకపోవడంతో ఎండ, వర్షాల కారణంగా పశువులు, తీవ్ర ఒత్తిడికి గురవుతాయి. ఆ సమయంలో పశువుల్లో ఉండే బ్యాక్టీరియా రెట్టింపు అవుతుంది. 24 గంటల్లో మృత్యువాత కూడా పడొచ్చు.



డాక్టర్ చైతన్యకిషోర్

? వ్యాధుల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి

! పశువులను వ్యాధుల బారి నుంచి కాపాడుకోవాలంటే ముఖ్యంగా పరిశుభ్రత పాటించాలి. పాకలు, షెడ్లు శుభ్రంగా ఉంచాలి. ముందస్తు టీకాలు వేయించాలి. పశువులను ఎండ, వానల నుంచి కాపాడుకునేందుకు ప్రభుత్వం గోకులం పేరుతో షెడ్లను మంజూరు చేస్తోంది. 90 శాతం సబ్సిడీ కూడా అందిస్తోంది. 2 పశువులకు రూ.1.15 లక్షలు, 4 పశువులకు రూ.1.85 లక్షలు, 6 పశువులకు రూ.2.3 లక్షలతో షెడ్లను మంజూరు చేస్తోంది. అవసరమైన వారు పశువైద్యుడిని సంప్రదించాలి.

? టీకాలపై పాడిరైతులకు కొన్ని అపోహలున్నాయి

! కొంత మంది రైతులకు ఇంకా ఎన్నో అపోహలున్నాయి. పశువులు వ్యాధుల బారిన పడకుండా ఉచితంగా టీకాలు వేస్తున్నాం. అయితే టీకాలు వేయించు కుంటే పాల దిగుబడులు తగ్గుతాయని అంతేగాక జ్వరం వస్తుందని కొంతమంది అనుకుంటున్నారు. ఇది కేవలం అపోహ మాత్రమే. టీకాలతో ఎంతో ప్రయోజనం కలుగుతుంది.

? జునోటిక్ వ్యాధుల గురించి

! పెంపుడు జంతువుల నుంచి మనుషులకు సోకే వ్యాధులే జునోటిక్ వ్యాధులు. ఆంథ్రాక్స్, బ్రూసెల్లోసిస్, ప్లేగు, క్షయ, మైక్రోప్లాస్మా న్యూమోనియా, రేబిస్, ఎబోలా, బర్డ్‌ఫ్లూ, నిపా వంటి వైరస్, బ్యాక్టీరియా జునోటిక్ వ్యాధులు ఇలా చాలా ఉన్నాయి. వీటిపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరం. ప్రస్తుతం బ్రూసెల్లోసిక్ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం జరుగుతోంది. 4 నుంచి 8నెలల వయసున్న ఆడ దూడలకు ఉచితంగా వేస్తున్నాము. ఇది ఒక్కసారి వేయడం వల్ల జీవిత కాలంలో ఎప్పుడూ బ్రూసెల్లోసిస్ వ్యాధి బారిన పడవు. పాలు, పాల పదార్థాల కారణంగా ఈ వ్యాధి మనుషులకు వ్యాప్తి చెందుతోంది. అదేవిధంగా ఈ వ్యాధి కలిగిన పశువులు ఈనే సమయంలో వచ్చే ఉమ్మనీరు గాయాలైన చేతులు, కాళ్లకు తగిలినా వ్యాధిబారిన పడతారు.

కేంద్ర పథకాలతో
జిల్లా సమగ్రాభివృద్ధి

(5వ పేజీ తరువాయి)

అధికారులను ప్రశ్నించారు. నూటికి నూరు శాతం వ్యాక్సినేషన్, మందులు పశువులకు అందచేస్తే పాలఉత్పత్తి, జంతు ఉత్పత్తి ఎందుకు పెరగడం లేదని పశుసంవర్ధక శాఖ జేడీని ప్రశ్నించారు. అందుకు ఆయన వద్ద సమాధానం లేదు. ప్రతి ఇంటికి మంచినీటి కొళాయి ఉండాలన్న కేంద్రం నిర్ణయం అది ఎందుకు జరగడం లేదని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ప్రశ్నించారు. మధ్యాహ్న భోజన పథకంలో ఎన్జీవోల భాగస్వామ్యాన్ని ఎందుకు తీసుకోవడం లేదని ఎస్ఎస్ఏ అధికారులను అడిగారు. అనంతరం శాఖల వారీగా కేంద్ర పథకాలపై సమీక్షించారు.

తీర్మానాలకే మమ్మల్ని వాడుకుంటారా? : ఎంపీపీలు

మండల పరిషత్ అధ్యక్షులుగా ఉన్న మాకు ప్రభుత్వ పథకాలపై కనీసం సమాచారం కూడా ఇవ్వరా? అల్లూరు మండలంలో ఇదే జరుగుతోందని ఎంపీపీ శశిరేఖ తెలిపారు. తీర్మానాలు అవసరమైనప్పుడు మాత్రమే తమ వద్దకు వస్తున్నారంటూ అసహనం వ్యక్తం చేశారు. పథకాలు నిర్వహణ, వాటి లబ్ధి, ప్రజలకు ఉపయోగం వంటి విషయాలేవీ తమతో చర్చించడం లేదన్నారు. అనంతరం చేజర్ల ఎంపీపీ విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్న లేఅవుట్లకు లెవలింగ్ పనులు చేశామని, ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా బిల్లులు రాలేదన్నారు. ఎప్పుడొస్తాయి? ఎవరిస్తారో? చెప్పాలని కోరారు. డ్వామా పీడీతోపాటు కలెక్టర్ కూడా తమకు తెలియదని చెప్పడంతో సమావేశంలో విస్మయం నెలకొంది. అవెన్యూ ప్లాంటేషన్ జరగడం లేదని, ఇది ఎవరి పరిధిలోకి వస్తుందని ఏఎస్‌పేట ఎంపీపీ ప్రస్తావించగా డ్వామా పీడీ తనకు తెలియదని, కనుక్కొని చెప్తానని చెప్పడం ఆశ్చర్యానికి గురి చేసింది.

కాగితాలలో లెక్కలొద్దు

గురుకుల పాఠశాలలో అంతా బాగుందని కాగితాల్లో లెక్కలొద్దు. వాస్తవంగా ఏం జరుగుతోందో అందరూ తెలుసుకోవాలి. తరగతి గదులు లేక గురుకులాల్లోని పిల్లలు అవస్థలుపడుతున్నారు. ఒకేగదిలో వసతి, అదే గదిలో తరగతులు నిర్వహిస్తున్న పాఠశాలలు జిల్లాలో ఉన్నాయి. వాటిని నేనే స్వయంగా చూశాను. అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలి.

- బల్లి కల్యాణ్ చక్రవర్తి, ఎమ్మెల్సీ

'దిశ' సమాచారం ఇవ్వరా?

ఎంపీ అధ్యక్షతన తొలిసారిగా దిశ సమీక్ష సమావేశం నిర్వహించేటప్పుడు ఎమ్మెల్యేలకు స్వయంగా ఫోన్ చేసి సమాచారం ఇవ్వరా!? మా పీఏలకు మాత్రమే చెబుతారా!? అటువంటప్పుడు సమీక్షలు, సమావేశాలకు మా పీఏలనే పంపిస్తాం సరిపోతుంది. అధికారుల పద్ధతి బాగోలేదు. జిల్లాలో అంగన్‌వాడీలు, ప్రభుత్వ పాఠశాలలకు అత్యవసరంగా మట్టితో లెవలింగ్ చేయాల్సి ఉంది. ఎస్ఎస్ఏ ప్రాజెక్టు నుంచి ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీలు నిర్మించాలి.

- కావ్య కృష్ణారెడ్డి, కావలి ఎమ్మెల్యే

పారదర్శకంగా మందులు, టీకాల వినియోగం

నెల్లూరు (వ్యవసాయం, ఆంధ్రజ్యోతి): పశువులకు అందిస్తున్న మందులు, టీకాల వినియోగంలో పారదర్శకత ఉండాలని, తప్పనిసరిగా రికార్డుల్లో నమోదు చేయాలని పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కే రమేష్‌నాయక్ ఒక ప్రకట నలో పేర్కొన్నారు. పశువులకు వచ్చే వ్యాధులను నియంత్రించడానికి తమశాఖ సమవర్ధ వంతమైన చర్యలు చేపడుతున్నదని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలోని నాలుగో త్రైమాసికంలో చేపట్టాల్సిన వైద్య సేవలు, టీకాల కార్యక్రమాలు, ఇతర పశు వైద్యసేవ లపై క్షేత్రస్థాయి సిబ్బందికి ఉత్తర్వులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో కొక్కెర తెగులు, కోళ్ల మశూచి, డక్ ప్లేగు వ్యాధినివారణకు కోళ్ల, బాతులకు ఉచితంగా టీకా లు వేయనున్నట్లు పేర్కొన్నారు. జనవరిలో గొర్రెలు, మేకలు, గేదెలు, ఆవులు, దూడలకు నట్టల నివారణ మందుల పంపిణీ చేయ నున్నట్లు తెలిపారు. ఫిబ్రవరిలో 4నుంచి 8నెలల వయసు కలిగిన గేదె, పెయ్య దూడలకు బ్రూసెల్లా వ్యాధి నిరోధక టీకాలు, మార్చిలో గేదెలు, ఆవులు, పంది లకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల వేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకా శాన్ని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

జనవరి, ఫిబ్రవరి నెలల్లో వ్యాధి నివారణ టీకాలు

పశుసంవర్ధకశాఖ జేడీ రమేష్‌నాయక్



వివరాలు సేకరిస్తున్న బ్యాంక్ డీపీఎం శ్రీనివాసులు, ఏసీ సింహాద్రిరావు

లోపభూయిష్టంగా సమాఖ్య సంఘం నిర్వహణ

ప్రతి పనికి లంచం.. సభ్యుల ఆరోపణలు నిజమే • స్పష్టం చేసిన విచారణ అధికారి శ్రీనివాసులు

ఉలవపాడు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 18న ఆంధ్రజ్యోతిలో ప్రచురించబడిన 'లంచం ఇస్తేనే రుణం మంజూరు' శీర్షికపై శనివారం బ్యాంక్ లంకేజీ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాసులు, కందుకూరు వెలుగు ఏసీ సింహాద్రి రావుతో కలిసి విచారణ చేపట్టారు. వినాయక సమాఖ్య వీఏవో కల్యాణిపై సమాఖ్య సంఘంలోని 14 పొదుపు సంఘాల సభ్యులతో ఆయన ఉలవపాడు వడ్డెర పాలెం కమ్యూనిటీహాల్‌లో విచారణ చేపట్టారు. ధనలక్ష్మి గ్రూపుకు సీఐఎఫ్ చెక్కు మంజూరై మూడు వారాలు కావస్తున్నా సభ్యులకు ఇవ్వకుండా లంచం కోసం కాలయా పన చేస్తుందని, అలాగే అనీషా గ్రూపు సభ్యులు వీవోఏ చేష్టలను వివరించారు. పొదుపు గ్రూపు సంఘాల వారీగా ఆరోరపణలు రాసుకున్నారు. డీఆర్‌డీఏ పీడీ ఆదేశాలతో విచారణకు వచ్చామన్నారు. వినాయక సమాఖ్య సంఘంలో అనేక రకాల లోపభూయిష్ట అంశాలు కనుగొ న్నట్లు చెప్పారు. ప్రతిదానికి డబ్బులు వసూళ్లు చేసినట్లు, గడిచిన 5ఏళ్లలో సమాఖ్య సంఘం సమావేశాలు, వీవో సమావేశాలు జరిగిన దాఖలాలు లేవన్నారు. వీవోఏకు సంబంధించిన పుస్తక నిర్వహణ కూడా చేపట్ట లేదని విచారణలో తేలినట్లు ఆయన స్పష్టం చేశారు. విచారణ నివేదికను పీడీకి నివేదించి వారి అనుమతితో వీవోఏపై చర్యలు తీసుకుంటామన్నారు.

టీబీ రోగులకు మెరుగైన వైద్యం అవసరం

టీబీ బాధితులకు ఇక్కడ అందిస్తున్న వైద్యం మెరుగ్గా కనిపించడం లేదు. అభివృద్ధి చెందిన దేశాలలో ఇలాంటి రోగులకు ఐసోలేషన్ ఏర్పాటు చేసి వ్యాధి అదుపులోకి వచ్చేవరకు మెరుగైన వైద్యం అందిస్తారు. వారిని ప్రజల్లో తిరగనివ్వరు. కానీ ఇక్కడ టీబీ వ్యాధిగ్రస్థులు యథేచ్ఛగా బయట తిరిగేస్తున్నారు. ఇది ఆందోళనకరమైన అంశం.

- కాకర్ల సురేష్, ఉదయగిరి ఎమ్మెల్యే

లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు ప్రాజెక్టు కుడి కాలువలో మరి కొన్ని మోటార్లు ఏర్పాటు చేస్తామని ప్రకాశం జిల్లా ఇరిగేషన్ ఎస్ఈ పీ వరలక్ష్మి తెలిపారు. రాళ్లపాడు ప్రాజెక్టును, కుడి కాలువ తూము వద్ద జరుగుతున్న పనులను శనివారం ఆమె పరిశీలించారు. తెలంగాణలోని కరీంనగర్ నుంచి మెగా కంపెనీ ద్వారా మూడు మోటార్లను తెప్పించనున్నట్లు చెప్పారు. మూడు రోజుల్లో కుడి కాలువకు ఎక్కువ పరిమాణంలో నీటి సరఫరా చేయిస్తామని తెలిపారు.

మరో 3 మోటార్లతో
నీటి సరఫరా పెంచుతాం

- ప్రకాశం జిల్లా ఇరిగేషన్ ఎస్ఈ వరలక్ష్మి

• నీటిని తోడేయద్దు : సబ్‌కలెక్టర్

కుడి కాలువలో ప్రవ హిస్తున్న నీటిని అక్రమ పద్ధతుల్లో మోటార్ల ద్వారా తోడేయకుండా రెవెన్యూ, పోలీస్ అధికారులు చర్యలు తీసుకోవాలని కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ ఆదేశించారు. శనివారం రాత్రి కుడి కాలువ తూమును సందర్శిం చి నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీపూజ మాట్లాడుతూ కుడి కాలువ లోని నీళ్లు దిగువకు వెళ్లకుండా మోటార్లు తోడేస్తుంటే చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి రైతుకు నీరు అందేలా మిగిలిన రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఈ వరలక్ష్మి, డీఈ వెంకటేశ్వర్లు, తహసీల్దారు సీతామహాలక్ష్మి, ఎస్సై మహబూబ్ సుభాని పాల్గొన్నారు.

నీరు అందేనా..
వరి పండేనా!?

'రాళ్లపాడు' ఆయకట్టుదారుల్లో ఆందోళన

- కొలిక్కిరాని స్టాప్‌లాక్ గేటు ప్రక్రియ
- విరిగి రెండువారాలైనా పరిష్కారం కాని సమస్య
- దిగువకు రాని నీటితో అన్నదాతల కలవరం

కందుకూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 7న రాళ్లపాడు రిజర్వాయరు కుడికాలువకు నీరు విడుదల చేస్తుండగా, స్టాప్‌లాక్ గేటు విరిగి పడిపోయిన విషయం తెలిసిందే. ఆ వెంటనే అధికారులు రిజర్వాయర్ల గేట్లు మరమ్మతులు, నిర్వహణలో విశేష అనుభవం ఉన్న నరసరావుపేటకు చెందిన మెకా నిక్ బాషాను రప్పించి పడిపోయిన గేటును లేపేందుకు మూడురోజులు ప్రయత్నించి విఫలమయ్యారు. ఆ వెంటనే నీళ్ల లోపలికి వెళ్లి గేటు మరమ్మతులు చేయటంలో అనుభవం కలిగిన ఓ బృందాన్ని వైజాగ్ నుంచి రప్పించారు. వారు రెండురోజులు ప్రయత్నించి మూడు అంగుళాల మేర గేటును పైకి లేపి తమ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. ఆ తర్వాత నాలుగు రోజులకు పోలవరం గేట్లు ఏర్పాటులో క్రియాశీలంగా పనిచేస్తున్న దిగ్గజ సంస్థ బెకాం నుంచి నిపుణులు కుడికాలువ గేటు సమస్య పరిష్కారం కోసం రంగంలోకి దిగారు. బెకాం ప్రతినిధి పరుశురామిరెడ్డి నేతృత్వంలో గత సోమవారం వచ్చిన ప్రతినిధులు రెండు రోజుల పాటు శ్రమించి, జీరో రిజల్ట్‌తో వెళ్లిపోయారు. వారు వెళ్లిపోయాక మేఘా సంస్థ ప్రతినిధులు రంగంలోకి దిగారు. వారు కూడా అదెంతపని అన్నట్లు మాట్లాడారే తప్ప చివరికి రెండు మోటార్లు పెట్టి నీటిని కాలువలోకి లిఫ్ట్ చేయటంతో తమ పని అయిపోయిందనిపించుకున్నారు. ఈ మొత్తం ప్రక్రియలో ఏ ఒక్కరూ స్థిరంగా తమ ప్రయత్నాన్ని కొనసాగించక పోవటం, ప్రణాళికాబద్ధ కృషి జరగటం లేదన్న అభిప్రాయం రైతుల్లో వ్యక్తమవుతోంది. ఇటీవల తుంగభద్ర ప్రాజెక్టు వద్ద, ప్రకాశం బ్యారేజీ వద్ద ఇంతకంటే సమస్యాత్మక పనులు పూర్తి చేయగలిగిన నిపుణులు ఈ చిన్న గేటు సమస్యను పరిష్కరించక పోవటం ఏమిటన్న ప్రశ్నలు ఉదయిస్తున్నాయి.



ముదిరిపోతున్న వరినార్లు

మొక్కుబడి చర్యలతో...

కాగా మోటార్ల ద్వారా నీటిని లిఫ్ట్ చేయడం, స్టాప్‌లాగ్ గేటువద్ద బఫర్‌వాల్ పగలగొట్టడం ద్వారా నీరివ్వటం వంటి తాత్కాలిక మొక్కుబడి చర్యలతో ఫలితం లభించేనా అన్న సందేహాలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయి. పడిపోయిన గేటును మూడు అంగుళాల మేర లేపటం ద్వారా 30 క్యూసెక్కులు, వాల్ పగలగొట్టడం, మోటార్ల ద్వారా పంప్‌చేయటం వంటి చర్యలతో మరో 40 క్యూసెక్కుల నీరు కుడికాలువకు వెళ్తోంది. అయితే పగలగొట్టిన బఫర్‌వాల్ నుంచే అగ్రభాగం నీరు బయటకు వెళ్తుండగా రిజర్వాయరు లో నీటిమట్టం తగ్గేకొద్దీ ఈ ప్రవాహం తగ్గటమే గాక నీటిమట్టం 16 అడుగు లకు చేరాక పూర్తిగా నిలిచిపోతుంది. అలాగే దిగువన ఉన్న 3 అంగుళాల ఖాళీకి వ్యర్థాలు అడ్డుపడితే ఆ ప్రవాహం కూడా నిలిచిపోయే అవకాశాలు ఉన్నాయి. ఈ స్థితిలో ఇలాంటి మొక్కుబడి చర్యలతో ఫలితం ఉండదని ఉన్నతస్థాయిలో స్పందించి పడిపోయిన గేటును బయటకు తీయగలిగి తేనే ఆయకట్టులో వరి సాగవుతుంది తప్ప లేనిపక్షంలో రైతులు రెండువిధాలా మునుగు తారన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రస్తుతం దుక్కులకే నీరందక ఎగువగ్రామాల ప్రజలు దిగువకు నీటిని పంపించక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. వారం రోజుల నుంచి ఎగువన ఉన్న ఇసుకపాలెం, శాయిపేట, మేదరమిట్లపాలెం గ్రామాల వారు అడ్డుకట్టలు వేస్తూ దిగువక నీరు పోనివ్వటం లేదు. కాలువపై నీటిని పర్యవేక్షించేందుకు లష్కర్లు కూడా లేకపోవటంతో రైతుల ఇష్టారాజ్యమైంది. దీంతో రైతుల మధ్య ముష్టిముద్ధాలు కూడా జరుగుతున్నాయి. దిగువ గ్రామాల ప్రజలు దుక్కులు ఎండిపోతున్నాయన్న ఆందోళనతో కాలువ వెంట వస్తే ఎగువ గ్రామాల రైతులు కర్రలు పట్టుకుని తిరుగుతుండటంతో చేసేదిలేక వెనుదిరిగి పోతున్న పరిస్థితులు నెలకొన్నాయి. గురువారం రాత్రి మేదరమిట్లపాలెంలో ఆ గ్రామ రైతులే తమ పొలాలకు నీళ్లకట్టుకునే విషయంలో గొడవపడి చివరికి ఘర్షణకు దిగినట్లు తెలిసింది. ఇదే పరిస్థితి మరో వారం జరిగితే గ్రామాల మధ్య కూడా ఘర్షణలు తలెత్తే పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

ముదురుతున్న నార్లు

మరోవైపు రాళ్లపాడు ఆయకట్టులో పోసిన వరినార్లు ముదిరిపోతుండగా గేటు సమస్య రాకముందు దుక్కులు దున్నిన భూములు ఎండిపోయి నెర్రెలు వారుతున్నాయి. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే అధికారులు ఎలాగోలా తంటాలుపడి నాట్లు అయితే వేయించగలరు కానీ పంట చివరివరకు నీరివ్వగలరా అన్న సందేహాలతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. చివరి ఆయకట్టు రైతులు వరికి ప్రత్యామ్నాయంగా పత్తి సాగుచేస్తారని అధికారులు భావిస్తుండగా పత్తికి కూడా నీరు అవసరమే కనుక వరినాట్లు వేసిన వారు ఇబ్బందిపడక తప్పదు. ఒక ఎకరంలో వరినాటు వేయాలంటే రూ. 40వేలు వరకు ఖర్చవుతుందని తీరా నాట్లువేశాక నీరందకపోతే తమ పరిస్థితి ఏమిటన్న ఆవేదన రైతుల్లో తీవ్రంగా ఉంది. ఈ పరిస్థితుల్లో జిల్లా కలెక్టరు, ఇతర ఉన్నతాధికారులు స్పందించి నిపుణులను రప్పించటం ద్వారా పడిపోయిన గేటు బయటకు తీయించేందుకు నిర్మాణాత్మక కృషి జరిగేలా చూడాలని రైతులు కోరుతున్నారు.



రాళ్లపాడు కుడికాలువకు నీటి కోసం అమర్చిన మోటార్లు







క్రిస్మస్ సమీపిస్తున్న నేపథ్యంలో చర్చిలు విద్యుత్‌శోభను సంతరించుకుంటున్నాయి. నగరంలోని వీఆర్సీ కూడలిలోని డానీహాలు, పొదలకూరురోడ్డులోని చర్చిలను విద్యుద్దీపాలతో శోభాయమానంగా తీర్చి దిద్దారు. అలాగే అన్ని దుకాణాలలో క్రిస్మస్ సామగ్రి విక్రయాలు జోరందుకుంటున్నాయి.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్



సమస్యను పరిష్కరించాలని కోరుతున్న కాలనీవాసులు



కాలువ కాదండోయ్.. ఉత్తర పల్లెపాళెం రోడ్డు



దీన్ని రోడ్డు అంటారా!?.. అధ్వానంగా పాటూరు-యల్లాయపాళెం రహదారి

ప్రగతికి పల్లెటూళ్లు పట్టుగొమ్మలు అంటారు. మరి ఈ చిత్రాలను చూసి అధికారులు, ప్రజాప్రతి నిధులు ఏమంటారో వారికే తెలియాలి. కోవూరు మండలం పాటూరు మజరా ఉత్తర పల్లెపాళెంలో పారిశుధ్యం, రోడ్లు మరీ అధ్వానంగా ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు మురుగు పేరుకు పోవ డంతో పారిశుధ్యం లోపించి, దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో కాలనీవాసులు జ్వరాల బారిన పడుతున్నారు. పాటూరు- ఎల్లాయపాళెం రోడ్డు గుంతలమయమైంది. మురుగు ఎక్కువగా చేరడంతో మలిదేవి వాగు నుంచి విషపురుగులు కాలనీలోకి వస్తున్నాయి. మురుగునీటిని వెంటనే తొలగించాలని, వైద్యశిబిరం ఏర్పాటు చేసి జ్వరపీడితులకు వైద్యం అందించాలని కాలనీవాసులు మొరపెట్టుకుంటున్నారు.

- కోవూరు, (ఆంధ్రజ్యోతి)



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీధర్, పక్కన సీఐ రాజేశ్వరరావు, ఎస్‌ఐలు

వైజాగ్‌లో తీసుకుని బెంగళూరులో అమ్మేందుకు..

- గంజాయి విక్రయదారుడి అరెస్టు
- 10కిలోల గంజాయి, సెల్ ఫోన్ స్వాధీనం
- కావలి డీఎస్పీ శ్రీధర్



స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు, సెల్‌ఫోన్

కావలి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వైజాగ్ ప్రాంతం నుంచి బెంగుళూరుకు లారీలో అక్రమంగా గంజాయిని తీసుకు వెళుతున్న బెంగుళూరు శివాజీనగర్‌కు చెందిన వేలుతంఢ్రి సెల్వమణిని అరెస్ట్ చేసి ఆయన వద్ద నుంచి 6ప్యాకెట్లలోని రూ.1.75 లక్షల విలువ చేసే 10కిలోల 045 గ్రాముల గంజాయి, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు కావలి డీఎస్పీ పీ.శ్రీధర్ తెలిపారు. శనివారం స్థానిక కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో రూరల్ సీఐ రాజేశ్వరరావు, ఎస్‌ఐలు సీహెచ్ తిరుమలరెడ్డి, ఎం. బాజీ బాబు, బాలక్రిష్ణలతో కలిసి డీఎస్పీ కేసు వివరాలను వెల్లడించారు. అనేక కేసులో నిందితుడైన సెల్వమణి అక్రమ సంపాదన కోసం ఇలా చేశాడు. వైజాగ్ ప్రాంతంలోని రాజు అనే వ్యక్తి వద్ద గంజా యిని కొనుగోలు చేసి బెంగుళూరుకు తీసుకెళ్లి రైల్వేస్టేషన్, బస్టాండ్‌లలో కూలీలకు విక్రయిస్తుంటారు. జాతీయ రహదారి మీదుగా గంజాయి అక్రమ రవాణా జరుగుతోందన్న సమాచారం మేరకు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రూరల్ సీఐ, ఎస్‌ఐలు నిఘా ఉంచారు. అందులో భాగంగా రాబడిన సమా చారం మేరకు శుక్రవారం మధ్యాహ్నం రూరల్ సీఐ రాజేశ్వరరావు, ఎస్‌ఐలు సీహెచ్ తిరుమల రెడ్డి, ఎం.బాజీబాబులు సిబ్బందితో జాతీయ రహదారిపై వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలో ముసునూరు టోల్‌గేట్‌కు 100 మీటర్ల దూరంలో ఒక వ్యక్తి ట్రావెలింగ్ బ్యాగు పట్టుకుని నిలబడి పోలీస్ వాహనం చూసి కంగారు పడి పారిపోయేందుకు ప్రయత్నించాడు. పోలీస్‌లు అతన్ని అదుపులోకి తీసుకుని పట్టుకుని విచారించారు. బెంగుళూరుకు గంజాయి తీసుకువెళుతూ ఒక లారీ నుంచి మరొక లారీలోకి మారేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. అనంతరం తహసీల్దార్‌కు తెలియ పరచి కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. ఈ సందర్భంగా కేసును చేధించిన సీఐ, ఎస్‌ఐలతో పాటు పోలీస్ సిబ్బంది రాధయ్య, ప్రసాద్, రాజేష్, సురేష్‌లను డీఎస్పీ అభినందించారు.

యువకుడు అనుమానాస్పద మృతి

అల్లూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక పేటసత్రంకు చెందిన శిఖరం ద్వారక అలియాస్ ఆర్య (29) శుక్రవారం రాత్రి అనుమానాస్పదంగా మరణించాడు. అల్లూరు వాటర్ ట్యాంక్ సెంటరులోని మద్యం షాపుకు చేరుకుని సమీపంలో ఉన్న ఓ మిద్దెను ఎక్కి కిందికి దిగిరాలేదు. శనివారం ఉదయం ద్వారక కదలకుండా పడి ఉండడాన్ని గమనించిన కొందరు ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు హుటాహుటిన అక్కడికి వచ్చి చూడగా విగతజీవుడై పడి ఉన్నాడు. మృతికి గల కారణాలు తెలియరాలేదు. కుమారుడి మృతితో తల్లి, మృతుడి భార్య రోదన స్థానికులను కలచి వేసింది. మృతుడికి భార్య, 6నెలల పాప ఉన్నది. మృతుడు విక్రమ సింహపురి యూనివర్శిటీలో చిరుద్యోగిగా పనిచేస్తున్నాడు. పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ కిషోర్‌బాబు తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయండి : ఆర్‌ఐవో



మాట్లాడుతున్న ఆర్‌ఐవో శ్రీనివాసులు

నెల్లూరు(విద్య), డిసెంబరు 21 (ఆంధ్ర జ్యోతి): వచ్చే ఫిబ్రవరి, మార్చిలో జరగనున్న ఇంటర్ ప్రాక్టికల్, థియరీ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని ఇంటర్‌బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణా ధికారి (ఆర్‌ఐవో) డాక్టర్ ఆదూరు శ్రీనివాసు లు తెలిపారు. నెల్లూరులోని డీకే ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శని వారం జరిగిన ప్రిన్సిపాళ్ల సమావే శంలో ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 1న నైతిక, మానవీయ విలువలు, 3న పర్యావరణ విద్యలపై జరగనున్న పరీక్షలకు ప్రాజెక్ట్ రిపోర్టులను తయారు చేసుకునేలా విద్యార్థులకు శిక్షణ నివ్వాలన్నారు. ఫిబ్రవరి 5 నుంచి ఒకేషనల్ పరీక్షలు, 10 నుంచి జరిగే జనరల్ ప్రాక్టి కల్‌కు అధ్యాప కులు తగిన చర్యలు చేపట్టాలన్నారు. మార్చి 1న జరిగే థియరీ పరీక్షలకు అన్నీ ఏర్పాట్లు చేసుకోవాలని తెలి పారు. పరీక్ష కేంద్రాల ప్రక్రియ త్వరలోనే పూర్తవుతుందని, అన్నీ వివరాలతో సిద్ధంగా ఉండాలన్నారు. ఆపార్ కార్డుల జారీలో జూనియర్ కళాశాలల పురోగతి సంతృప్తిలేదని, ఈ విషయమై ప్రత్యేక శ్రద్ధ వహించారు. అనంతరం సంకల్ప్, మిడ్ డే మీల్స్ తదితర అంశాలపై ప్రిన్సిపాళ్లతో చర్చించారు. ఈ కార్యక్రమంలో డీవీఈవో ... పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	100
లేయర్ లైవ్	100
స్కిన్ చికెన్	186
స్కిన్‌లెస్	206
లేయర్	170

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7313
వెండి కిలో ధర	రూ. 89,700
వెండి ఒక గ్రాము	రూ.92.70

ఎరువుల కొరతపై కిసాన్ మోర్చా నిరసన

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) :ఎరువుల కొరతపై బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు చేవూరు వినయ్‌నారాయణ ఆధ్వర్యంలో నెల్లూరులోని వ్యవసాయ శాఖ జేడీ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కార్యాలయ ఏవోకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలం పనులు ఆపుకుని యూరియా కోసం సాయంత్రం వరకు దుకాణాల వద్ద నిరీక్షించినా దొరక్క రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఎరువుల కొరత తీర్చడంతోపాటు సబ్సిడీ పరికరాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు సురేంద్రరెడ్డి, హనుమాన్‌రెడ్డి, అమరనాథరెడ్డి, వై.సాయి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేపు హైటీ

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): క్రిస్టమస్ సందర్భంగా సోమవారం సాయంత్రం 4 గంటలకు క్రిస్టియన్ మైనారిటీ ఆర్థిక సంస్థ, మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో హైటీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి ఎం. శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని పాస్టర్లు, క్రైస్తవ మత పెద్దలు, క్రైస్తవ సోదరులంతా కార్యక్రమానికి హాజరు కావాలని పేర్కొన్నారు.

24న మైనార్టీ వ్యవహారాల సలహాదారు రాక

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఈనెల 24న రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ వ్యవహారాల సలహాదారు ఎంఏ షరీఫ్ జిల్లాలో పర్యటిస్తారని ఐ,పీఆర్ డీడీ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9.30 గంటలకు జిల్లా మైనార్టీశాఖాధికారులతో సమీక్ష నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం నగరంలోని మైనార్టీ రెసిడెన్షియల్ స్కూలును తనిఖీ చేస్తారని తెలిపారు.

'సూర్య ఘర్'ను ఎస్సీ, ఎస్టీలు సద్వినియోగం చేసుకోవాలి

- ఎస్‌ఈ విజయన్

నెల్లూరు (జడ్పీ), డిసెంబరు 21(ఆంధ్ర జ్యోతి): ప్రధానమంత్రి సూర్యఘర్ మఫ్తీ బిజిలీ పథకాన్ని జిల్లాలోని ఎస్సీలు, ఎస్టీలు సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్‌శాఖ ఎస్‌ఈ విజయన్ కోరారు. విద్యుత్‌భవన్‌లోని ఆయన కార్యాలయంలో శనివారం విలేకర్లతో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సౌర విద్యుత్‌ను ప్రోత్సహించేందుకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. కాలనీల్లో 200యూనిట్లు వినియోగిస్తున్న గృహాలను గుర్తించి, వారంతా సౌరవిద్యుత్‌ను ఏర్పాటు చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇళ్లపై సౌరవిద్యుత్ పలకలు ఏర్పాటుకు అనువుగా స్థలాలు లేకపోతే సమీపంలో ఉన్న ఖాళీస్థలాల్లో ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో దాదాపు 1.25లక్షలమంది ఎస్సీ, ఎస్టీ వినియోగదారులు ఉచిత విద్యుత్‌ను పొందుతున్నారని, వారందరికీ సూర్యఘర్ పథకం ద్వారా ఉచిత విద్యుత్‌ను అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. వినియోగదారులు ఫోన్‌నంబర్, ఆధార్, కరెంటు బిల్లులు అందించి సోలార్ పలకలకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునన్నారు. పథకాన్ని ఎస్సీ, ఎస్టీలంతా సద్వినియోగం చేసుకునేలా అధికారులకు ఆయన అవగాహన కల్పించారు.

అందుబాటులో అగ్నిమాపక పరికరాలు

- జీజీహెచ్‌లో ఐదేళ్ల తరువాత వినియోగంలోకి..
- మరమ్మతులకు రూ.19 లక్షల విడుదల
- అధికారుల పర్యవేక్షణలో పనులు

నెల్లూరు (వైద్యం) డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని జీజీహెచ్‌లో ఐదేళ్ల తరువాత అగ్నిమాపక యంత్రాలు అందుబాటులోకి రానున్నాయి. వీటి మరమ్మతులకు ప్రభుత్వం గత అక్టోబరులో రూ. 19 లక్షలు విడుదల చేసింది. దీంతో ఏపీఎంఎస్ఐడీసీ టెండర్ పిలిచి ముంగమూరు శ్రీహరికి పనులు అప్పగించారు. ఆ పనులు ప్రారంభమయ్యాయి. జనవరి నాటికి అగ్నిమాపక పరికరాలు అందుబాటులోకి రానున్నాయి. ఈ పనులను అధికారులు పర్యవేక్షిస్తున్నారు.



మరమ్మతులను పరిశీలిస్తున్న అధికారులు

2013లో అందుబాటులోకి ..

వేసవిలోనే కాకుండా విద్యుత్ ప్రమాదాల కారణంగా అగ్నిప్రమాదం సంభవిస్తే వెంటనే నివా రణ చర్యలు తీసుకోలేని పరిస్థితి జీజీహెచ్‌లో నెలకొంది. ఐదేళ్లుగా జీజీహెచ్‌లో అగ్నిమాపక పరికరాల మరమ్మతులకు గురైనా ప్రభుత్వం నిధులు విడుదల చేయక పోవటంతో అవి నిరుపయోగమయ్యాయి. దీంతో రోగులతోపాటు వైద్యులు, సిబ్బంది ఆందోళన వ్యక్తం చేశారు. 2013లో అందుబాటులోకి వచ్చిన ప్రభుత్వ వైద్య కళాశాలకు అనుబంధంగా జీజీహెచ్ రూపుదిద్దుకుంది. అప్పట్లో వచ్చిన కొత్త భవనాల నిర్మాణాలకు అనుగుణంగా అగ్ని ప్రమాదాల నివారణకు అన్ని విధాలుగా ఫైర్ సేఫ్టీ పరికారాలు ఏర్పాటు చేశారు. ఐదేళ్లుగా మరమ్మతులు లేక పైపులు, వాటికి ఉన్న ట్యూబులు దెబ్బతిన్నాయి. కొన్ని తుప్పుపట్టాయి.

గతంలో ఎన్నో ప్రమాదాలు..

గతంలో రాష్ట్రంలోని ఎన్నో ఆసుపత్రుల్లో అగ్ని ప్రమాదాలు జరిగి ఎందరో వైద్యులు, రోగుల ప్రాణాలు పోయాయి. అయితే నగరంలోని జీజీహెచ్‌లో మాత్రం అగ్ని ప్రమాదం జరిగితే సమర్థవంతంగా ఎదుర్కొనే పరిస్థితి లేదు. ప్రత్యేకంగా మెటర్నిటీ వార్డులో ఎక్కువగా గర్భిణీలు ఉంటారు. ఇక్కడికి ప్రతిరోజూ 200 మంది గర్భిణీలు, బాలింతలు వస్తుంటారు. అలాగే ఇక్కడ పైఅంతస్తులో చిన్నపిల్లల విభాగం ఉంటుంది. ఇక్కడ 50 మంది వరకు పిల్లలు ఉంటారు. అలాగే ఐపీ బిల్డింగ్‌లోనూ నాలుగు ఫ్లోర్లలో రోగుల వార్డులు ఉన్నాయి. వీటితోపాటు 10 ఆపరేషన్ థియేటర్లు ఉన్నాయి ఈ పరిస్థితిలో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే వాటి నివారణకు ఎలాంటి చర్యలు తీసుకునే వీలులేదు. అగ్నిమాపక పరికరాలు అందుబాటులోకి వస్తే వీరందరికీ ప్రయోజనం ఉంటుంది.

పనుల ప్రారంభం



జీజీహెచ్‌లో ఫైర్ సేఫ్టీ పరికరాల మరమ్మతు పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ పనులకు ప్రభుత్వం రూ.19లక్షలు మంజూరు చేసింది. ఇవి అందుబాటులోకి వస్తే అగ్నిప్రమాదాల నుంచి ఆసుపత్రిని కాపాడే వీలుంటుంది. రోగులకు రక్షణ ఉంటుంది.

- డాక్టర్ సిద్దానాయక్, జీజీహెచ్ సూపరింటెండెంట్

న్యూరాలజీలో ఆధునిక విధానాలను అనుసరించాలి

- వైద్యనిపుణుల వెల్లడి



జ్యోతి ప్రజ్వలనలో పాల్గొన్న వైద్య నిపుణులు

నెల్లూరు (వైద్యం) డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): న్యూరాలజీ విభాగంలో వస్తున్న ఆధునిక వైద్య విధానాలను ప్రతీ వైద్యుడు అవగాహన పెంచుకుని, వాటిని అమలు చేయాలని న్యూరాలజీ వైద్యనిపుణులు వెల్లడిం చారు. నెల్లూరులోని ఓ హో టల్‌లో శనివారం అంతర్జా తీయ న్యూరాలజీ సదస్సు జరిగింది. నూతన వైద్య విధానంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా, రోగులకు వైద్య చికిత్సలు అందించాలని సదస్సులో వైద్య నిపుణులు తెలియ చేశారు. నూతన ఆవిష్కరణలపై పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ బిందు మీనన్ మాట్లాడుతూ 10 ఏళ్లుగా పెరల్స్ ఇన్ క్లినిక్ న్యూరాలజీపై ఇలాంటి సదస్సులు నిర్వహిస్తూ వైద్యు లకు ఎంతో ప్రోత్సాహనిస్తున్నదని అన్నారు. ఈ సదస్సు ఆదివారం కూడా కొనసాగుతుందని నిర్వాహకులు తెలియచేశారు. ఈ సందర్భంగా నూతన వైద్య విధానాలపై రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. సదస్సులో అపోలో ఆసుపత్రి సీఈవో నవీన్‌రెడ్డి, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరాం సతీష్, మెడికల్ సర్వీసెస్ చీఫ్ డాక్టర్ రోహిణి, ఏపీ మెడికల్ కౌన్సిల్ ప్రతినిధి డాక్టర్ అశోక్ పాల్గొన్నారు.



ఆకర్షణీయంగా సైకిల్ నమూనా

అనంతసాగరం మండలంలోని చిలకలమర్రి ఉన్నత పాఠశాల విద్యార్థులు గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మంద స్తు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా 9వ తరగతికి చెందిన వైష్ణవి, నిహారికలు జామెట్రీ బాక్స్‌లోని పరికరాలు స్కేల్, రబ్బరు, వృత్తలేఖిని, పెన్సిల్, కోణమానిని, విభాగిని, షార్ప్‌నర్, కత్తెరను వినియోగించి సైకిల్ నమూన తయారు చేసి తమ ప్రతిభను చాటారు. దీంతో హెచ్ఎం సురేష్, ఉపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, మహేష్‌లు ఆ విద్యార్థులను అభినందించారు.

- అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి)

డీమార్టులో డ్యామేజీ సరుకులు

- అమ్మకానికి పాడైపోయిన ఖర్జూరం
- నేటితో గడువు ముగుస్తున్న బ్రెడ్లు విక్రయం



డీమార్టులో ఖర్జూరం డబ్బాలను పరిశీలిస్తున్న అధికారులు

నెల్లూరు(సిటీ),డిసెంబరు21,(ఆంధ్రజ్యోతి): డీమార్టులో పాడైన ఆహార పదార్థాలు ఉన్నట్లు శనివారం నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో అధికారులు గుర్తించారు. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను పరిగణలోకి తీసుకుని ఆహార భద్రత అధికారి వెంకటేశ్వరరావు, ఎంహెచ్‌వో డాక్టర్ చైతన్య ఈ తనిఖీలు నిర్వహించారు. లైన్ కంపెనీకి చెందిన ఖర్జూరం గడువు తేదీ ఉన్నప్పటికీ పాడైనట్లు ప్రాథమికంగా గుర్తించామని వారు పేర్కొన్నారు. ఇవి తినేందుకు ఏ మాత్రం ఆరోగ్యకరం కాదని తెలిపారు. వీటిని పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపుతున్నామని, అక్కడ్నుంచి నివేదిక అందిన వెంటనే తదుపరి చర్యలు తీసుకుంటామని వివరించారు. కాగా బ్రెడ్ ప్యాకెట్లు ఆదివారంతో గడువు తేదీ పూర్తవుతున్నా ఇంకా అమ్మకాలు చేస్తున్నట్లు గుర్తించామని చెప్పారు. వీటిపైనా చర్యలు తీసుకునేందుకు నోటీసులు జారీ చేస్తామన్నారు. కార్యక్రమంలో శానిటరీ అధికారులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఎంపిక

నెల్లూరు(విద్య), (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని యూటీఎఫ్ కార్యాలయంలో జరుగుతున్న 46వ జిల్లా మహా సభల్లో భాగంగా శనివారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీని ఎంపిక చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు కే ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎంపికలో జిల్లా అధ్యక్షుడిగా వీ.నరేంద్ర, కార్యదర్శిగా ఎం.శ్రీహర్ష, ఉపాధ్యక్షుడిగా మౌలీన్, సహాయ కార్యదర్శులుగా జీవన్, విష్ణులతో పాటు మొత్తం 13 మందిని కమిటీగా నియమించారు. అనంతరం సభ్యులు ప్రమాణం చేస్తూ జిల్లాలో విద్యా రంగ సమస్యలు పరిష్కారానికి కృషి చేయడంతో పాటు నగరంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసేలా పోరాటం చేస్తామని తెలిపారు.

సమగ్ర శిక్ష ఏపీసీగా వెంకటసుబ్బయ్య



వెంకటసుబ్బయ్య

నెల్లూరు(విద్య), డిసెంబరు 21 (ఆంధ్ర జ్యోతి) : సమగ్రశిక్ష అద నపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్(ఏపీసీ)గా ఉదయగిరి ఎంఆర్ఆర్ డిగ్రీ కళాశాల ఎకనా మిక్స్ లెక్చరర్ డీ వెంకటసుబ్బయ్యను నియమిస్తూ ప్రభుత్వ కార్యదర్శి కోన శశిధర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏడాది పాటు ఫారెన్ సర్వీస్ కింద డిప్యుటేషన్‌పై ఏపీసీగా ఆయన విధులు నిర్వహిస్తారని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం ఏపీసీగా పనిచేస్తున్న సీహెచ్. ఉషారాణి 2021 డిసెంబరులో జిల్లాలో బాధ్యతలు చేపట్టారు. దాదాపు మూడేళ్ల పాటు సేవలందించిన ఆమె తిరిగి డిగ్రీ కళాశాల అధ్యాపకురాలిగా పంపిస్తూ కొత్త ఏపీసీ నియామకం చేపట్టారు. నూతన ఏపీసీ రెండు రోజుల్లో బాధ్యతలు చేపడతారని ఎస్ఎస్ఏ సిబ్బంది తెలిపారు.

24న జిల్లా బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక

కోవూరు, (ఆంధ్రజ్యోతి): కర్నూలులో జనవరి 3నుంచి జరగనున్న 50వ అంతర్ జిల్లాల బాలబాలికల కబడ్డీ పోటీల్లో పాల్గొనేందుకు ఉమ్మడి నెల్లూరు జిల్లా జట్టును ఈనెల 24వ తేదీన (మంగళవారం) స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఎంపిక చేస్తామని జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు లవకుమార్, కార్యదర్శి జే విజయానందం, ఉపాధ్యక్షుడు పూండ్ల జాన్సన్ ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. 2005 జనవరి 12వ తేదీ తరువాత జన్మించిన వారు, బాలలు 70 కిలోల లోపు, బాలికలు 65 కిలోల లోపు బరువున్న వారు మాత్రమే పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నా రు. ఆసక్తి కల్గిన క్రీడాకారులు కోవూరులోని జడ్పీ బాలికల పాఠశాలకు ఆధార్‌కార్డులు తీసుకునిరావాలని తెలిపారు.

సోమశిలలో 72.492 టీఎంసీల నిల్వ

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి 2,935 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. డ్యాంలో ప్రస్తుతం 72.492 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, దిగువ డెల్టాకు 1,550, కండలేరుకు 1,200, ఉత్తర కాలువకు 600, దక్షిణ కాలువ 350 క్యూసెక్కులు సరఫరా జరుగుతోంది.

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ఉదయగిరి: డిక్లరేషన్ ఫారం అందుకుంటున్న వెంకటసుబ్బయ్య



అల్లూరు: ధ్రువీకరణ అందుకుంటున్న బీద గిరిధర్

ఉదయగిరి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం అని పొన్నెబోయిన చెంచురామయ్య (గండిపాళెం) జలాశయ చైర్మన్ అడుసుమల్లి వెంకటసుబ్బయ్య అన్నారు. శనివారం జలాశయ ఆవరణలో ఆత్మకూరు ఆర్డీవో పావని, జలవనరుల శాఖ ఈఈ వెంకటేశ్వర్లుల ఆధ్వర్యంలో ప్రాజెక్టు కమిటీ ఎన్నిక జరిగింది. జలాశయం పరిధిలోని 17 డిస్ట్రిబ్యూటరీల అధ్యక్షులు చైర్మన్‌గా అడుసుమల్లి వెంకటసుబ్బయ్య వైస్ చైర్మన్‌గా కుమ్మిత రమణారెడ్డిలను ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. వారికి ఆర్డీవో, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెంచలబాబుయాదవ్‌లు నియామ కపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్లు బయ్యన్న, మధు, అడుసుమల్లి వెంకటేశ్వర్లు, రెడ్డిబత్తిన వెంకటేశ్వర్లు, ఐటీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఉమాసాయిరాం, బొజ్జా నరసింహులు పాల్గొన్నారు.

● పెన్నా డెల్టా ప్రాజెక్ట్ వైస్ చైర్మన్‌గా బీద గిరిధర్

అల్లూరు: నెల్లూరులో నిర్వహించిన పెన్నా డెల్టా ప్రాజెక్ట్ కమిటీ ఎన్నికల్లో మండల సీనియర్ టీడీపీ నేత పైడేరు ఎస్కేప్-2 అధ్యక్షుడు బీద గిరిధర్‌ను ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడారు. అవకాశాన్ని కల్పించిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రలకు కృతజ్ఞతలు తెలిపారు.

● 'రాళ్లపాడు' ప్రెసిడెంట్‌గా ఏలూరి వెంకటేశ్వర్లు

కందుకూరు: రాళ్లపాడు రిజర్వాయరు ఆయకట్టుదారుల సంఘం ప్రెసిడెంట్‌గా లింగసముద్రం మండలం చినపవని ఏలూరి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా గుడ్లూరు మండలం బసిరెడ్డిపాలెం నరాల మాలకొండారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికలో ప్రాజెక్టు పరిధిలోని ఆరు నీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు హాజరైయ్యారు. ఎన్నికైన వారికి సబ్‌కలెక్టరు తిరుమణి శ్రీపూజ నియామక ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డీఈఈ మధుబాబు, ఇతర టీసీ మెంబర్లు పాల్గొన్నారు. అలాగే వీఆర్‌కోట ఆనకట్ట సిస్టమ్ కింద ఉన్న మాచవరం, మోపాడు చెరువుల ఆయకట్టు కమిటీ ప్రెసిడెంట్‌గా కందుకూరు మున్సిపాలిటీ పరిధిలోని ఆనందపురం తల్లపనేని రవీంద్ర చైర్మన్‌గా, ఉపాధ్యక్షుడిగా మోపాడు తోకల మాల్యాద్రిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కావలి ఆర్డీఓ వంశీకృష్ణ వీరికి ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈఈ హాజరత్తయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా తల్లపనేని రవీంద్రలు మాట్లాడారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రోత్సాహంతో రైతులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు.

● సోమశిల ప్రాజెక్టు చైర్మన్‌గా కేశవచౌదరి

చేజర్ల: సోమశిల ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా నాగులవెల్లటూరు టీడీపీ సీనియర్ నేత వేలూరు కేశవచౌదరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలోని ఇరిగేషన్ కార్యాలయంలో ఎన్నికలు అధికారి కె.వెంటకరెడ్డి సమక్షంలో నిర్వహించిన ఎన్నికల్లో వేలూరు కేశవచౌదరిని చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి, కిమ్స్ హాస్పిటల్ ఈడీ తాళ్లూరు గిరినాయుడుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం చైర్మన్‌ను పలువురు అభినందించారు. నాగులవెల్లటూరులో కార్యకర్తలు సంబరాలు నిర్వహించుకున్నారు.

● ఉపాధ్యక్షుడిగా మధు మోహన్‌రెడ్డి

జలదంకి: మండల టీడీపీ అధ్యక్షుడు మధు మోహన్‌రెడ్డి సోమశిల ప్రాజెక్ట్ కమిటీ ఎన్నికలో వైస్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నెల్లూరు ఇరిగేషన్ కార్యాలయంలో జరిగిన ఎన్నికలో ఆయనకు ఈ పదవి వరించింది. తనపై నమ్మకం ఉంచి పదవి వచ్చేందుకు కృషి చేసిన ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు ధన్యవాదాలు తెలిపారు.

ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించాలి

దుత్తలూరు (ఉదయగిరి), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎరువులు, పురుగు మందులను ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని, అధికధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి ఎస్.వెంకట సుబ్బారెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి అమ్మకం, నిల్వ రికార్డులతో పాటు గోదాంల్లోని ఎరువుల నిల్వలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈవో భోగ్యం సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

డీలర్ల సమావేశం

దుత్తలూరు (ఉదయగిరి), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయంలో శనివారం మండల చౌక దుకాణాల డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో తహసీల్దారు వై.నాగరాజు సమీక్షా సమావేశం నిర్వహించారు. డీలర్లు సకాలంలో డీడీలు చెల్లించాలన్నారు. పండుగల దృష్ట్యా ప్రతి కార్డుదారుడికి నిత్యావసర వస్తువులు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సరుకుల పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉపకరణాలకు అర్హుల ఎంపిక

ఆత్మకూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ సంస్థ సంయుక్త ప్రాంతీయ కేంద్రం ఆధ్వర్యంలో శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో దివ్యాంగులు, వృద్ధులకు ప్రత్యేక క్యాంప్ నిర్వహించి ఉపకరణాలు మంజూరుకు అర్హులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా వేణుగోపారెడ్డి, ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్, టీడీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి పులిమి శైలజారెడ్డి, సంస్థ ప్రతినిధులు రఘు, దామోదర్ ఉన్నారు.

రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ

ఆత్మకూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక మేకపాటి క్యాంపు కార్యాలయంలో వైసీపీ నియోజకవర్గ నాయకులు రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి బర్త్ డే కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

సీవీ రామానుజన్ సేవలు మరువలేనివి

● ఘనంగా జాతీయ గణిత దినోత్సవం
● నివాళులర్పించిన ఉపాధ్యాయులు



బిట్రగుంట: నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, ఏవోలు



ఉదయగిరి: నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

ఉలవపాడు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజిలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, గణితశాస్త్రం అధ్యాపకులు మల్లికార్జున ఆధ్వర్యంలో శనివారం గణితశాస్త్ర కోవిదులు శ్రీనివాస రామానుజన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు గారపాటి గోపీచంద్ ప్రకాష్, జ్యోతి, సుబ్బాచారి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, వల్లూరయ్య, మాధవరెడ్డి, సుభాషిణి, హనుమంత రావు పాల్గొన్నారు.

● బిట్రగుంట: కడనూతల ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో గణిత విభాగ అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ పీవీఎన్ రెడ్డి శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏవో ఆర్వీ రమణారెడ్డి, హెచ్అండ్ఎస్ హెచ్‌వోడి డాక్టర్ లక్ష్మీ, అధ్యాపకులు, బీటెక్, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఉన్నారు.

● ఏఎస్ పేట: స్థానిక ఠాగూర్ పాఠశాలలో గణిత ఫార్ములతో రంగవల్లులను వేశారు. 1 నుంచి 5వ తరగతి వరకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. శ్రీనివాస రాయానుజన్ జీవిత చరిత్ర గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రమణారెడ్డి, హెచ్ఎం దొరస్వామిరెడ్డి పాల్గొన్నారు.

● దుత్తలూరు (ఉదయగిరి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శ్రీనివాసరామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివిధ పోటీల్లోని విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలు నాగలక్ష్మి, గణిత ఉపాధ్యాయుడు కండ్లగుంట కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాల్యం నుంచే సామాజిక స్పృహ అవసరం: డీఎస్పీ

కావలి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు వివిధ అంశాలపై బాల్యం నుంచే సామాజిక స్పృహ, సృజనాత్మక కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కావలి డీఎస్పీ వీ. శ్రీధర్ తెలిపారు. పట్టణ ముసునూరు రెడ్‌ఫీల్డ్ పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన కిడ్స్ ఫెయిర్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో రెడ్‌ఫీల్డ్ కరస్పాండెంట్ సాయి అభినవ్, అకడమిక్ హెడ్ నిహారిక, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

● కావలి టౌన్: విద్యార్థులు చెడువ్యసనాలు, ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిసలైతే కుటుంబ ఆర్థిక, సామాజిక పతనానికి దారి తీస్తుందని డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. విట్స్ ఇంజనీరింగ్ కళాశాల యాంటి ర్యాగింగ్ సెల్ ఆధ్వర్యంలో యాంటి ర్యాగింగ్ డ్రగ్ అబ్యూజ్ అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. విట్స్ చైర్మన్ దొడ్ల విద్యాధర్‌కుమార్ రెడ్డి అధ్యక్షత జరిగిన సీఐ గిరిబాబు ప్రిన్సిపాల్ శేషయ్య, అకడమిక్ డైరెక్టర్ ప్రత్యూషారెడ్డి, లిఖిత్ రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా గంగాభవానీ తిరునాళ్ల



పూలంకరణలో అమ్మవారు

వింజమూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గంగమిట్ట ప్రాంతంలో వెలిసిన గంగాభవానీ తిరునాల ఉత్సవాలు శుక్రవారం మొదలైయ్యాయి. యాదవ వీరుల వీర్రాజుల వంశస్థులు అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని జల్దిలో నింపి పట్టణంలో భాజాభజంత్రీలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం నియోజకవర్గ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దర్శించుని దివ్య చెట్టు కింద ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ఆదివారం అమ్మవారికి పొంగళ్లు సమర్పిస్తారు. ఈ సందర్భంగా నిర్వాహకులు భక్తులకు భారీ అన్నదానం చేయనున్నారు. సాయంత్రం అమ్మవారికి పండ్లతో అలంకరణ చేసి గుడి చుట్టూ ఊరేగింపు చేపట్టనున్నారు. మొదట ఎద్దుల బండిని గుండ్లపల్లి వంశస్థులు ఆచారబండిగా అమ్మవారి గుడి చూటూట ప్రదక్షిణలు చేస్తారు. కార్యక్రమంలో అత్యధి సంఖ్యలో భక్తులు పాల్గొంటారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కాజ్‌వే నిర్మాణానికి రూ.20 లక్షల మంజూరు



రామన్నగారిపల్లె వాగును పరిశీలిస్తున్న పీఆర్ డీఈ ఏడుకొండలు, ఏఈ జయరామిరెడ్డి

కలువాయి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): రామన్నగారిపల్లె ఎస్టీ కాలనీ నుంచి చింతలపాళెంకు సుమారు రూ.1.5కిలో మీటరు మెటల్ రోడ్డు నిర్మాణంతో పాటు వాగుపై కాజ్‌వే నిర్మాణంకు ఐటీడీఏ నిధులు రూ.20లక్షలు ప్రభుత్వం మంజూరు చేసినట్లు పంచాయతీరాజ్ డీఈ ఏడుకొండలు తెలిపారు. కాజ్‌వేకు రూ.8లక్షలు, రోడ్డుకు రూ.12లక్షలకు పరిపాలనా అనుమతి వచ్చిందని తెలిపారు. శనివారం ఈ రోడ్డును, కాజ్‌వే నిర్మించాల్సిన వాగును ఆయన పరిశీలించారు.

రూ.79 లక్షలతో సీసీ రోడ్ల మంజూరు

పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా తాజాగా మరో రూ.79 లక్షలతో 15 సిమెంటు రోడ్లు మంజూరైనట్లు పంచాయతీరాజ్ ఏఈ జయరామిరెడ్డి తెలిపారు. ఇప్పటికే ఈ కార్యక్రమం కింద మండలంలో సుమారు రూ.2కోట్లతో 38 రోడ్ల పనులు జరుగుతున్నాయని చెప్పారు. చింతలపాళెంలో 3రోడ్లు రూ.24లక్షలు, మాదన్నగారిపల్లెలో 4రోడ్లు రూ.21లక్షలు, కలువాయి మేజర్ పంచాయతీలో 8రోడ్లు రూ.34లక్షలు మంజూరైనట్లు వివరించారు. ఇవి కూడా త్వరలో పనులు ప్రారంభించి సంక్రాంతి నాటికి సీసీ రోడ్లు పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి సత్యవాణి

చేజర్ల, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆదురుపల్లి ఎరువుల దుకాణాన్ని జిల్లా వ్యవసాయశాఖ అధికారి సత్యవాణి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఎరువులను అధిక ధరలకు విక్రయించినా, వేరే ఎరువులతో లింక్ పెట్టి అమ్మిన చర్యలు తీసుకుంటామన్నారు. అదే విధంగా కృత్రిమ కొరత సృష్టించి రైతులను మోసం చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఏడీఏ శ్రీదేవి, వ్యవసాయ శాఖ అధికారి వి.శశిదర్ పాల్గొన్నారు.

● ఏఎస్ పేట: హసనపురంలో ఉన్న ఎరువుల దుకాణాన్ని మండల వ్యవసాయ అధికారి నీరజని తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. ఎంఆర్‌పీకే విక్రయించాలని, రైతులకు అవసరమైన వాటిని మాత్రమే ఇవ్వాలని తెలిపారు. అవసరం లేకున్న ఇతర ఎరువులను అంటగట్టే ప్రయత్నం చేయరాదని సూచించారు. షాపులో స్టాక్ వివరాలు, ధరల పట్టికను రాసి ఉంచాలని తెలిపారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

సంగం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని దువ్వూరులో జనసేనపార్టీ ఆధ్వర్యంలో నాలుగు నిరుపేద కుటుంబాలకు శనివారం నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్ఫూర్తిగా తీసుకుని ఆత్మకూరు నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు ప్రతినెలా కొందరు పేదలకు నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్నారు. అందులో భాగంగా ఎన్ఆర్ఐ చదలవాడ హరీష్ కుమార్, తోకల శ్రీధర్, పులిపాటి అనిల్ కుమార్‌ల సహకారంతో గ్రామానికి చెందిన పలు కుటుంబాలకు నెలరోజులకు సరిపడ బియ్యం, పప్పులు, నూనె, యర్రగడ్డలు, సబ్బులు, సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆత్మకూరు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి నలిశెట్టి శ్రీధర్, ఎన్ఆర్ఐ హరీష్ కుమార్, భాను కిరణ్ పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థులకు ఉపకార వేతనాల అందజేత

కందుకూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): చెన్నైకు చెందిన ఉల్లాస్ ట్రస్ట్ సభ్యులు శనివారం స్థానిక బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలోని 9,10 తరగతుల మెరిట్ విద్యార్థులకు శనివారం ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. ఇంటెలెక్ట్ డిజైన్ అండ్ సాఫ్ట్‌వేర్ కంపెనీ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమాల్లో భాగంగా 20మంది మెరిట్ విద్యార్థులకు రూ.20వేల ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉల్లాస్ ట్రస్ట్ ప్రతినిధి దింటకుర్తి బాలకృష్ణ, హెచ్ఎంలు నరసింహమూర్తి, పార్వతి, న్యాయవాది పంతగాని వెంకటేశ్వర్లు, సంస్థ సీనియర్ కన్సల్టెంట్ డి. శిరీష పాల్గొన్నారు.

అనివేటి మండపం నిర్మాణానికి విరాళాలు

కందుకూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రామదేవత అంకమ్మ అమ్మవారి ఆలయ మండప నిర్మాణానికి శనివారం దాతలు విరాళాలు అందజేశారు. కాళిదాసు శ్రీనివాసమూర్తి కుమారుడు ఆదిత్యదత్త చరణ్ రూ.50వేలు, పొటికెలపూడి వెంకటసుబ్బ సుందరరామారావు, మహాలక్ష్మి దంపతుల కుమారుడు నరసింహసాయి కౌశిక్ రూ.40,516లను ఆలయ పునర్నిర్మాణ కమిటీసభ్యులు గాండ్ల శ్రీనివాసులు, ఆవుల మాధవరావులకు అందజేశారు.

కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనం పట్టివేత

సంగం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): సంగంలో శనివారం మత్స్యశాఖ అధికారులు దాడి చేసి కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనాన్ని పట్టుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పటించారు. వివరాల మేరకు.. చిత్తూరు నుంచి ఆది కేశవులు అనే డ్రైవర్ కోళ్ల వ్యర్థాలను డ్రమ్ముల్లో తీసుకొస్తుండగా సంగం-ముంబై రోడ్డుపై అధికారులు పట్టుకున్నారు. పోలీసులు వ్యర్థాలను కొండ వద్ద గుంతలు తీసి పూడ్చి పెట్టి కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారులు సుప్రజ, ఖలీల్ పాల్గొన్నారు.

అధిక ధరకు యూరియా విక్రయిస్తే కఠిన చర్యలు

కలువాయి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): యూరియా అధిక ధరకు విక్రయించినా, కాంప్లెక్స్ ఎరువులతో లింక్‌పెట్టినా వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి వీ.ప్రతాప్ హెచ్చరించారు. ఎరువులు కొనుగోలు చేసిన రైతులు వ్యాపారులను అడిగి బిల్లులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. రైతులు నిల్వ చేసుకో కుండా అవసరాల మేరకే తీసుకోవాలన్నారు.

ఘనంగా వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు



కావలి: మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డికి కేక్ తినిపిస్తున్న నేతలు



ఉదయగిరిలో కేక్ కట్ చేస్తున్న నేతలు

ఉదయగిరి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం ఉదయగిరిలో ఘనంగా నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ ఓబులరెడ్డి, గౌస్‌మొహిద్దీన్, అక్కి భాస్కర్‌రెడ్డి, ముర్తుజా, శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

● దుత్తలూరు: స్థానిక జేఎస్ఆర్ ఫౌండేషన్ కార్యాలయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడకలు నిర్వహించారు. కార్య క్రమంలో మండల వైసీపీ కన్వీనర్ దొంతిరెడ్డి వాసు దేవరెడ్డి, సర్పంచులు కొండారెడ్డి పాల్గొన్నారు.

● సీతారామపురం: స్థానిక బస్టాండ్ సెంటర్లో వైసీపీ మండల కన్వీనర్ చింతంరెడ్డి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పాలగిరి అల్లూరురాజు, మాబయ్య, గుర్రం సుబ్బయ్య, ఓబులేస్ పాల్గొన్నారు.

● జలదంకి: స్థానిక బస్టాండ్ కూడలిలో జలదంకి మాజీసర్పంచ్ తిప్పారెడ్డి ఇందిరమ్మ కేక్ కట్ చేసి సీనియర్ నాయకుడు ఇస్కా మదన్ మోహన్‌రెడ్డికి తినిపించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ పాలవల్లి మాలకొండారెడ్డి, దేవరపల్లి మధురెడ్డి, దండా అనిల్‌రెడ్డి, కోర్శిపాటి రామిరెడ్డి, సుబ్బారావు పాల్గొన్నారు.

● బిట్రగుంట: బోగోలు వైసీపీ పార్టీ కార్యాలయంలో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు పార్టీ మండల కన్వీనర్ వీర రఘు ఆధ్వర్యంలో చేపట్టారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి హాజరై య్యారు. కార్యక్రమంలో ఎంపీపీ సుజాత, జడ్పీ టీసీ కీర్తన, ఎంపీటీసీలు, సర్పంచులు ఉన్నారు.

● కావలి టౌన్: ముసునూరులోని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి నివాసంలోని కార్యాలయంలో వేడుకలు జరిగాయి. పార్టీ పట్టణ అధ్యక్షులు కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి పాల్గొన్నారు.

దేశ ప్రజలకు అమిత్‌షా క్షమాపణ చెప్పాలి

ఆత్మకూరు, డిసెంబరు 21(ఆంధ్రప్రదేశ్): పార్లమెంట్‌లో అంబేడ్కర్‌ను కించపరిచే విధంగా వాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పట్టణ మున్సిపల్ బస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాజ్యాంగాలను మార్చి వేయాలని, అంబేడ్కర్ సిద్ధాంతాలను రూపుమాపాలని, మనుధర్మాన్ని దేశంలో ప్రచారం చేయాలని కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి కె డేవిడ్‌రాజు, నాయకులు జి లక్ష్మీపతి, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ షేక్ సందాని, నాగేంద్ర, సాలారుద్దీన్, అవాజ్ కమిటీ రాష్ట్ర నాయకుడు యస్దానీ, ఐద్వా మహిళా నాయకురాలు గుల్జార్‌బేగం పాల్గొన్నారు.

● బిట్రగుంట: కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాజ్యసభలో చేసిన ప్రసంగానికి క్షమాపణ చెప్పాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి డిమాండ్ చేశారు. బోగోలు బజారు కూడలిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం, ఎంఆర్‌పీఎస్, దళిత సంఘాల నేతలతో కలిసి ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు వెంకయ్య, ఇజ్రాయిల్, నరసయ్య, షేక్.నూరుదీన్, బత్తుల రవిచంద్ర ఉన్నారు.

● కందుకూరు:అంబేడ్కర్‌ను అవమాన కరంగా మాట్లాడిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని.. ఆయన్ను తక్షణం మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ, ఐఎఫ్‌టీయూ ప్రజాసంఘాల సభ్యులు శనివారం సాయంత్రం కందుకూరులో నిరసన చేపట్టారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో పీడీఎస్ యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రాజశేఖర్, ఆర్.మోహన్, హరి బాబు, న్యాయవాది లింగాబత్తిన బ్రహ్మయ్య, నాంచార్లు, బాలకోటయ్య, నాగేశ్వరరావు, వెంకట రావు, చంద్ర, సునీల్ పాల్గొన్నారు.

25న నెల్లూరులో నవయాన బౌద్ధధర్మ స్వీకారం

కలువాయి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ధర్మ పోరాట సమితి ఆధ్వర్యంలో ఈనెల 25న నెల్లూరులో నవయాన బౌద్ధధర్మ స్వీకార మహోత్సవం జరుగుతుందని, ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏడీపీఎస్ వ్యవస్థాపకుడు ఇంగిలాల రామచంద్రయ్య పిలుపు నిచ్చారు. స్థానిక ఏడీపీఎస్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు నవయాన బౌద్ధ ధర్మాన్ని స్వీకరించకుండా ఉన్నటువంటి డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ అనుయాయులందరినీ కార్యక్రమానికి ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పాల్గొని నవయాన బౌద్ధధర్మాన్ని మీ జీవన ధర్మంగా స్వీకరించాలని కోరారు. ఇప్పటికే స్వీకరించి ఆచరిస్తున్న బౌద్ధ కుటుంబీకులందరూ కుటుంబ సమేతంగా హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో ఏడీపీఎస్ నేత నిజమాల ప్రసాద్ పాల్గొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



వైస్ చైర్మన్, డైరెక్టర్లను సన్మానించిన జనసేన నేత నలిశెట్టి శ్రీధర్

ఆత్మకూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన జనసేనకు చెందిన వైస్‌చైర్మన్లు, డైరెక్టర్లు నిబద్ధతతో రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి నలిశెట్టి శ్రీధర్ తెలిపారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం సాగునీటి సంఘం వైస్‌చైర్మన్ కరివేటి తిరుపతి, డైరెక్టర్లు లక్ష్మీశెట్టి సుమలత, దొరస్వామి శెట్టిలను ఆయన సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు జెపి ప్రసాద్, మావిళ్ల ఆనంద్, బత్తల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని వెంకటాద్రిపాలెం ఫీడర్, మండలంలోని మాచవరంలో లైన్‌వర్క్ ఉన్నందున ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ టీవీ నరసింహ్మం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటాద్రిపాలెం ఫీడర్ పరిధిలోని తానికొండవారి కొష్టాలు, రామానాయుడు నగర్, వెంకటాద్రిపాలెం, కనిగిరి రోడ్డు షా మిల్లులు ఏరియా, లంబాడిడొంక, దూబగుంటలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా ఉండన్నారు. మాచవరం గ్రామంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామన్నారు. ప్రజలు ఈ అసౌకర్యాన్ని గుర్తించి తమకు సహకరించాలని కోరారు.

విద్యుత్ చార్జీలు తగ్గించకపోతే ఉద్యమిస్తాం

బిట్రగుంట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పేదవాడికి పెనుభారంగా మారిన విద్యుత్ చార్జీలు తగ్గించకపోతే ఉద్యమిస్తామని సీపీఎం సీనియర్ నాయకులు టీ.మాల్యాద్రి తెలిపారు. బోగోలు మండలం చెంచులక్ష్మీపురంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ఆయన సీపీఎం నేతలతో కలిసి శనివారం నిరసన చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు తుమ్మల వెంకయ్య, ఎం.రాధాకృష్ణ, యు.యానాదయ్య, షేక్.బాదుల్లా, కుమారి, శ్రీనివాసులు, మాల్యాద్రి, బ్రహ్మయ్య ఉన్నారు.

వైసీపీ డాక్టర్స్ విభాగం జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ ప్రణీత్

ఆత్మకూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): వైసీపీ డాక్టర్స్ విభాగం జిల్లా అధ్యక్షుడుగా ఆత్మకూరు పట్టణానికి చెందిన డాక్టర్ ప్రణీత్‌చౌదరి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పలువురు వైసీపీ నాయకులు, అభిమానులు ఆయనను సన్మానించి అభినందించారు. శనివారం ఆయన నెల్లూరులోని క్యాంపు కార్యాలయంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ధన్యవాదాలు తెలిపారు. ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి నేతృత్వంలో పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బూత్ కమిటీ విభాగాల జిల్లా అధ్యక్షుడుగా ఎంపికైన బాలిరెడ్డి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా కళ్లజోళ్ల పంపిణీ

కావలి రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ముసునూరు జాతీయ రహదారి టోల్ ప్లాజా వద్ద శనివారం వాహనదారులకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. సింహపురి ఎక్స్‌ప్రెస్ వే ఎన్‌హెచ్-16 ప్రాజెక్ట్ హెడ్ శివకుమార్ ఆధ్వర్యంలో జరిగిన శిబిరానికి ముఖ్య అతిథిగా రూరల్ సీఐ రాజేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం ఎల్‌వి కంటి ఆసుపత్రి వైద్యులు 94 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా అద్దాలు అవసరమైన వారికి సీఐ చేతులు మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఐ తిరుమల రెడ్డి, టోల్‌ప్లాజా మేనేజర్ గణేష్, రూట్ ఆపరేషన్ హెడ్ నరశింహరావు పాల్గొన్నారు.

రాళ్లపాడు గేటును బాగు చేయించండి

లింగసముద్రం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టు కుడి కాలువ తూము స్టాప్ లాక్ గేటును బాగు చేయించి ఆయకట్టు పరిధిలోని వరినార్లు, నాట్లకు నీరిచ్చి ఆదుకోవాలని చినపవని రైతులు పోకూరి రవీంద్ర, మరికొందరు శనివారం అమరావతిలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును కలిసి విజ్ఞప్తి చేశారు. వివిధమార్గాలతో అధికారులు కొంతమేరకు నీరు ఇస్తున్నా ఆ నీరు చాలక వరిపైర్లు ఎండిపోతున్నాయని చెప్పారు. సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చినట్లు రైతులు చెప్పారు.

సారా తయారీ స్థావరాలపై దాడులు

● 200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

బిట్రగుంట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కావలి ఎక్సైజ్ ఎస్ఐ ఎం.దేవిక సిబ్బందితో శనివారం మండలంలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా చెంచులక్ష్మీపురం శివారులోని కప్పరాళ్ల తిప్పకు చెందిన వల్లాకి యోహాన్ నాటు సారా అక్రమంగా కాస్తున్నట్లు గుర్తించారు. సిబ్బందితో దాడి చేసి నాటు సారా తయారీకి నిల్వ ఉంచిన 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వసం చేయించారు. అతని వద్ద విక్రయానికి ఉంచిన 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు తెలిపారు.

లుమీనా డేటా మ్యాట్రిక్స్‌కు విద్యార్థుల ఎంపిక

కందుకూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): లుమీనా డేటా మ్యాట్రిక్స్ కంపెనీకి 10మంది ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల టెక్నికల్ డైరెక్టర్ డాక్టరు విజయ్‌శ్రీనివాస్ తెలిపారు. శనివారం కంపెనీ హెచ్ఆర్‌లు మెక్సిల్, పెట్రిక్స్‌లు కళాశాల ప్రాంగణంలో చేపట్టిన కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థులకు నియామక పత్రాలు అందజేశారు. ప్రముఖ కార్పొరేట్ కంపెనీకి 10మంది విద్యార్థులు ఎంపిక కావడంపై కరస్పాండెంట్ కంచర్ల రామయ్య హర్షం వ్యక్తం చేశారు.

నెల్లూరు సిటీ

రూరల్, కోవూరు, సర్వేపల్లి

వన్యప్రాణులను వేటాడితే కేసులు

● రాపూరు అటవీ శాఖ రేంజ్ అధికారి పందిళ్ల రవీంద్రబాబు



రాపూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): చట్టాన్ని అతిక్రమించి వన్య ప్రాణులను వేటాడితే కఠినమైన కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందని రాపూరు అటవీశాఖ రేంజ్ అధికారి పందిళ్ల రవీంద్రబాబు తెలిపారు.

? వన్య ప్రాణుల వేటగాళ్లపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

! అటవీ ప్రాంతాన్ని పెనుశిల అభయారణ్యం కింద డిక్లర్ చేసి ఉంది. ఇక్కడ సహజంగా వన్యప్రాణులు స్వేచ్ఛగా జీవిస్తుంటాయి. అడవి జంతువులను వేటాడడం, కాల్చడం, ఉచ్చులు వేయడం నేరం. ఇలాంటి పనులకు పాల్పడితే 1972 వన్యప్రాణి సంరక్షణ చట్టం ద్వారా నాన్ బెయిల్‌బుల్ కేసులు నమోదు చేస్తాం.

? వీఎస్ఎస్ సభ్యులకు వచ్చే ఆదాయ వనరులు ఏమిటి.

! వన సంరక్షణ సమితి ద్వారా జామాయిల్ చెట్లు పెంచి విక్రయించడం ద్వారా వచ్చే ఆదాయం ఖర్చులు పోను సగభాగం వన్య సంరక్షణ సమితి సభ్యుల అభివృద్ధికి, వారి గ్రామాల అభివృద్ధికి ఉమ్మడిగా తీర్మానించుకున్న పనులకు ఉపయోగిస్తాం. మరో సగభాగం రిజర్వ్ ఫారెస్టులో మొక్కలు నాటి సంరక్షణ చర్యలకు వినియోగిస్తాం.

? ఎర్రచందనం సంరక్షణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు.

! రాపూరు రేంజ్ పరిధిలోని చిట్వేల్ ఘాట్ నుంచి సోమశిల డ్యామ్ వరకు ఉన్న కొండ ప్రాంతం వరకు వెలుగొండ రిజర్వ్ ఫారెస్టుగా విస్తరించి ఉంది. ఇక్కడ సహజసిద్ధంగా పెరుగుతున్న ఎర్రచందనం వృక్ష సంపదను కాపాడేందుకు అటవీశాఖ తరపున రెండు బేస్ క్యాంపులు ఏర్పాటు చేసి నిరంతరం సంరక్షణ చర్యలు తీసుకుంటున్నాం. రాత్రి పగలు రాపూరు అటవీశాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు.

? ఎర్రచందనం నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు.

! ఎర్రచందనం కేసులో పట్టుబడ్డ నిందితులకు తిరుపతిలోని ఎర్రచందనం స్పెషల్ కోర్టు ఐదేళ్ల జైలు శిక్ష, ఐదు లక్షల జరిమానా విధించింది. ప్రభుత్వం ఎర్రచందనం సంరక్షణకు నిఘాను కఠినతరం చేసింది.

ఎరువుల కొరత ఉండదు : ఏడీఏ

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): రైతులకు ఇక ఎరువుల కొరత ఉండదని కోవూరు సహాయ వ్యవసాయ సంచాలకులు సుజాత తెలిపారు. శనివారం ఆమె బుచ్చిలోని వవ్వేరు బ్యాంకులో ఎరువుల పంపిణీని పరిశీలించారు. అనంతరం బుచ్చిలోని మన గ్రోమోర్, పలు ప్రైవేటు ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని వవ్వేరు బ్యాంకుకు ఇతర మండలాల నుంచి కూడా రైతులు వచ్చి యూరియా తీసుకుంటుండడంతో కొంత కొరత ఉందన్నారు. ప్రస్తుతం వవ్వేరు బ్యాంకు, రెడ్డిపాళెం సొసైటీలో 30 టన్నులకుపైగా ఉందన్నారు. ఆది, సోమవారాల్లో మరో 30 టన్నులు వస్తుందన్నారు. ఆమె వెంట ఏవో సురేంద్రరెడ్డి ఉన్నారు.

క్రికెట్‌లో అవకాశాలు అందిపుచ్చుకోవాలి

● ఏసీఏ ప్రతినిధి విజయ్‌కుమార్

నెల్లూరు(విద్య), డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): క్రికెట్‌లో యువత అవకాశాలను అందిపుచ్చుకుని రాణించాలని ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) ప్రతినిధి బీ విజయ్‌కుమార్ అన్నారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుజబుజనెల్లూరులోని సీఏబి క్రికెట్ అకాడమీ మైదానంలో శనివారం టీ-20 లీగ్ క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ క్రీడాకారులకు అన్ని విభాగాల్లో పోటీల నిర్వహణ జరుగుతోందని, ఎక్కువ అవకాశాలు కల్పించేలా ఏసీఏ చర్యలు తీసుకుంటున్నదన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు సీవీఎస్.మూర్తి, కార్యదర్శి డీ నిఖిలేశ్వర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి కే మునిగిరీష్, కోశాధికారి ఎస్‌కే అబూబకర్, ఎన్‌డీసీఏ కేర్‌టేకర్ డీ శ్రీనివాసరెడ్డి, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

● **ఉత్సాహంగా పోటీలు**

టీ-20 లీగ్ పోటీల్లో మొత్తం 46 జట్లు రిజిస్టర్ చేసుకోగా, తొలిరోజు ఉదయం ఫ్యూచర్ స్టార్స్ క్రికెట్ అకాడమీ, బ్లాక్ పాంథర్స్ క్రికెట్ క్లబ్‌లు తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసిన ఎఫ్ఎస్‌సీఏ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 182 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన బీపీసీసీ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 107 పరుగులు మాత్రమే చేయడంతో ఎఫ్ఎస్‌సీఏ 75 పరుగుల తేడాతో విజయం సాధించింది. మధ్యాహ్నం జరిగిన మ్యాచ్‌లో నారాయణరావుపేట క్రికెట్‌క్లబ్, సీడై స్ట్రైకర్స్ క్రికెట్‌క్లబ్‌లు తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసిన ఎస్ఎస్‌సీసీ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 121 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన ఎన్ఆర్‌పీ సీసీ జట్టు 18 ఓవర్లలో 5 వికెట్లుకోల్పోయి 125 పరుగులు సాధించి 5 వికెట్ల తేడాతో గెలుపొందింది.



క్రీడాకారులతో మాట్లాడుతున్న ఏసీఏ ప్రతినిధులు

'కనుపూరు కెనాల్' ఛైర్మన్‌గా మస్తాన్‌నాయుడు

మనుబోలు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కనుపూరు కెనాల్ ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్‌గా వద్దినేని మస్తాన్‌నాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం నెల్లూరురూరల్ మండల పరిషత్ కార్యాలయంలో కనుపూరు కెనాల్ ప్రాజెక్టు కమిటీ ఎన్నిక నిర్వహించారు. ముద్దమూడి సాగునీటి సంఘం అధ్యక్షుడు వద్దినేని మస్తాన్‌నాయుడును ఛైర్మన్‌గా ఎన్నుకున్నారు. వైస్‌ఛైర్మన్‌గా నెల్లూరు రూరల్‌కు చెందిన తుళ్లూరు రామయ్యను ఎన్నుకున్నారు. అనంతరం నెల్లూరు ఆర్డీవో నాగసంతోష అనూష ఛైర్మన్, వైస్‌ఛైర్మన్‌లకు నియమాక పత్రాలు అందజేశారు. అనంతరం వద్దినేని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని కలిసి తనకు పదవి వచ్చేందుకు సహకరించినందుకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు గాలి రామకృష్ణారెడ్డి, నాయకులు రామకృష్ణయ్య, రామయ్య నాయుడు, నాగేశ్వరరావు, రామానాయుడు, వెందోటి భాస్కర్‌రెడ్డి, కోదండరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీవో నాగసంతోష అనూష నుంచి నియామకపత్రం అందుకుంటున్న వద్దినేని మస్తాన్‌నాయుడు

గిరిధర్‌రెడ్డి అభినందన

నెల్లూరురూరల్,(ఆంధ్రజ్యోతి): నెల్లూరు రూరల్ ఎంపీఈవో కార్యాలయంలో శనివారం జరిగిన కనుపూరు కాలువ ప్రాజెక్టు కమిటీ ఎన్నికలో ఛైర్మన్‌గా సర్వేపల్లి నియోజకవర్గానికి చెందిన మస్తాన్‌నాయుడు, వైస్ ఛైర్మన్‌గా సౌత్‌మోపూరుకు చెందిన తుళ్లూరు రామయ్య ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. వీరిద్దరిని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రూరల్‌లో రూ.50 కోట్లతో అభివృద్ధి

● పనుల శంకుస్థాపనలో ఎంపీ వేమిరెడ్డి

నెల్లూరురూరల్, డిసెంబరు 21, (ఆంధ్రజ్యోతి): నెల్లూరు రూరల్‌లో రూ. 50 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ఇప్పుడున్న ఆర్థిక లోటులో ఈ స్థాయిలో పనులు నిర్వహించడం కోటంరెడ్డి సోదరుల సామర్థ్యానికి ప్రతీక అని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం కల్లూరుపల్లిలో రూ. 5 కోట్లతో తలపెట్టిన వివిధ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నదన్నారు. ఇలాంటి ప్రతికూల సమయంలోనూ రూ. 50 కోట్లను సమీకరించి పనులు నిర్వహించడమంటే సామాన్యమైన విషయం కాదన్నారు. ప్రజల కోర్కెలు తీర్చుతున్నారు కాబట్టే కోటంరెడ్డి సోదరులపై నమ్మకం ఉందన్నారు. ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన మాట కోసం ఎంపీ వేమిరెడ్డి కట్టుబడి ఉన్నాడన్నారు. 24వ డివిజన్‌ను ఆయన దత్తత తీసుకోవడం ఈప్రాంత ప్రజల అదృష్టమన్నారు. ముందుగా భారీ స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, కార్పొరేటర్ అరవ శాంతి, నాయకులు శ్రీను తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో అభివాదం చేస్తున్న ఎంపీ వేమిరెడ్డి, పక్కన ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

ఉచిత న్యాయసేవలను వినియోగించుకోండి

● జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి వాణి

వెంకటాచలం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఉచిత న్యాయ సేవలను ఖైదీలు వినియోగించుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి కె.వాణి సూచించారు. మండలంలోని చెముడుగుంట సమీపంలో ఉన్న జిల్లా కేంద్ర కారాగారంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి ఖైదీల యోగక్షేమాలు, వారి కేసుల వివరాలు, భోజన వసతి, వైద్య సదుపాయాలు, తదితర వాటిపై అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బయటకు వెళ్లిన తర్వాత గత పరిస్థితుల దృష్ట్యా జరిగిన నష్టాన్ని గుర్తుంచుకోవాలని, మంచిగా బతకాలని, కుటుంబ సభ్యులను సంతోషంగా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జైలు అధికారులు రాజారావు, బాలమహేష్, జీవీ సుబ్బమ్మ, తదితరులున్నారు.

మెట్టను డెల్టాగా మార్చిందే సోమిరెడ్డి

● తప్పుడు కథనాలు పెట్టినందుకు మాజీ మంత్రి కాకాణి సిగ్గుపడాలి : మస్తాన్‌బాబు

పొదలకూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంతమైన పొదలకూరు మండలాన్ని పూర్తిస్థాయిలో డెల్టాగా మార్చింది సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అని టీడీపీ మండలాధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు పేర్కొన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి కాకాణి పొదలకూరు మండలంలో రైతులకు నీరందడంలేదని తప్పుడు కథనాలు తమ పార్టీ పేపర్‌లో రాయించుకోవడం సిగ్గు చేటన్నారు. దమ్ము ధైర్యం ఉంటే చెన్నారెడ్డిపల్లి వస్తే మీడియా సమక్షంలో వాస్తవాలు నిగ్గు తేలుస్తామన్నారు. కనుపూరు కాలువలో పడవలో పైపైకి పూడికలు తీసి బిల్లులు తినేసింది వైసీపీ నాయకులని, తాము హిటాచ్ వాహనాలు పెట్టి పూర్తి స్థాయిలో కాలువల్లో పూడికలు తీయిస్తే తమపై నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. మాజీ మంత్రి కాకాణి అంతా అవినీతిపరుడు మరొకరు లేరన్నారు. రైతులు సంతోషంగా ఉండడం జీర్ణించుకోలేని కాకాణి తప్పుడు కథనాలతో కాలం వెళ్లదీస్తున్నా రన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోడూరు పెంచలభాస్కర్‌రెడ్డి, పులిపాటి వెంకట రత్నంనాయుడు, పల్లారపు కృష్ణ, కండే సురేష్, గంటా మల్లికార్జున్, తదతరులు పాల్గొన్నారు.

27న ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్స్ డే



నెల్లూరు(వైద్యం) డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్స్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపక దినోత్సవాన్ని ఈనెల 27న నిర్వహించనున్నామని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నారాయణ మెడికల్ గ్రూప్ ఏజీఎం చౌకచర్ల భాస్కర్‌రెడ్డి కోరారు. శనివారం నారాయణ డెంటల్ ఆసుపత్రిలోని ఏజీఎం చాంబర్‌లో పీఎంపీ డే కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని పేద,బడుగు వర్గాలకు పీఎంపీలు ఎన్నో వైద్యసేవలు అందిస్తున్నారన్నారు. పీఎంపీడేకు మున్సిపల్ కమిషనర్ సూర్యతేజ, రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు హాజరవుతారని చెప్పారు. కార్యక్రమంలో పీఎంపీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శు లు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, సభ్యులు దేవరకొండ శ్రీనివాసులు, నరసాపురం ప్రసాద్. చిట్లూరి వీరయ్య పాల్గొన్నారు.

ఎన్‌డీసీసీబీ క్యాలెండర్ ఆవిష్కరణ

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (ఎన్‌డీసీసీబీ) క్యాలెం డర్‌ను జేసీ కార్తీక్ శనవారం ఆయన చాంబర్‌లో ఆవిష్కరిం చారు. ఈ కార్యక్రమంలో డీసీ వో గురప్ప, సీఈవో శ్రీనివాస రావు, జీఎం సరిత తదితరులు పాల్గొన్నారు.

సోషల్ వెల్ఫేర్ డీడీకి సత్కారం



డీడీని అభినందిస్తున్న షేక్.ఖాసిం, తదితరులు

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సోషల్ వెల్ఫేర్ కార్యాలయంలో డిప్యూటీ డైరెక్టర్‌గా శనివారం బాధ్యతలు చేపట్టిన కే.శోభారాణిని భారత్ సేవా ఫౌండేషన్ సెక్రటరీ ఎస్‌కె. ఖాసిం, విశ్రాంత ఏఎస్‌డబ్ల్యూవో పరబ్రహ్మం, ఖాజా మొహిద్దీన్, తదితరులు శాలువాతో సత్కరించి పూలమొక్కను అందించారు. హాస్టళ్లలో కొరవడిన మౌలిక సదుపాయాలు సమకూర్చడంపై ఆమె పూర్తి కేంద్రీకరిచాలని, విద్యార్థుల ఉత్తీర్ణతా శాతాన్ని పెంపొందించాలని కోరారు. శోభారాణి మాట్లాడుతూ త్వరలోనే ఆదిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

రాష్ట్ర క్యారమ్స్ పోటీలకు 'వాణిశ్రీ' విద్యార్థులు

నెల్లూరురూరల్, డిసెంబరు21,(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ క్యారమ్స్ పోటీలకు మండలంలోని సౌత్‌మోపూరు వాణిశ్రీ జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ పోటీలు ప్రకాశం జిల్లా, సింగరాయకొండ మండలం పాకాల జడ్పీ హైస్కూల్లో ఆది, సోమవారాల్లో జరుగుతున్నాయని హెచ్‌ఎం అన్వర్‌బాషా, పీడీ నాగేంద్రరావ శనివారం తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాలలో అభినందించారు.

నేడు మహామృత్యుంజయ హోమం

నెల్లూరు(సాంస్కృతికం) డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): లోకకల్యాణం కోసం నగరంలోని అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం మహామృత్యుంజయ హోమం నిర్వ హించనున్నట్లు ఆలయ ఛైర్మన్ జీ శేషగిరిరావు, ప్రధాన కార్యదర్శి కేవీ.రత్నం తెలిపారు. శనివారం వారు ఆలయ ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడారు. ఆదివారం సాయంత్రం శతృభయం వీడేందు కు సుదర్శన హోమం జరుగుతుందన్నా రు. 23వతేదీ ఉదయం కలశ స్థాపన 24న కలశపూజ, 25న సహస్ర కలిశాభిషేకం, 26న విశేష కలశాభిషేకం, 27న నగరోత్సవం, 28న ఆరాట్టు ఉత్సవం జరుగుతుందని, దీంతో మండల పూజలు ముగుస్తాయని తెలిపారు. జనవరి 1న నెయ్యాభిషేకం, 14న ఉదయం నెయ్యాభి షేకం, రాత్రికి జ్యోతి దర్శనం ఉంటుందని వారు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యుడు కేజీ. శంకరన్, తదితరులు పాల్గొన్నారు.


● **కొనసాగుతున్న మండల పూజలు**

నగరంలోని అయ్యప్పగుడిలో మండల పూజలు శనివారం నాటికి 36వ రోజుకి చేరాయి. ఉదయం పాలభిషేకం, గణపతిహోమం, ఉషఃపూజ, శ్రీవేలి ఉత్సవం, కలశపూజ, నవకాభిషేకం, ఉచ్ఛపూజ, శ్రీవేలి ఉత్సవం జరిగాయి. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, సాయంత్రం పూలంగిసేవ, మహాదీపారాధన, భగవతిసేవ, అత్తాళం పూజ, శ్రీవేలి ఉత్సవం, పడికర్పూర దీపం, హరిహర వాసనం నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ఉభయకర్తలుగా బట్టేపాటి నరేంద్రరెడ్డి- విజయమ్మ, భక్తవత్సలరెడ్డి-లలితమ్మ ,చెన్నారెడ్డి రమేష్‌రెడ్డి-జ్యోతిర్మయి దంపతులు వ్యవహరించారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్తలు పర్యవేక్షించారు.



అయ్యప్పగుడిలో నిర్వహించిన శ్రీవేలి ఉత్సవం


టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకున్న నాగార్జునరెడ్డి



సోమిరెడ్డి నుంచి సభ్యత్వం తీసుకుంటున్న నాగార్జున్‌రెడ్డి

వెంకటాచలం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): సర్వేపల్లి కాలువ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు చల్లా నాగార్జున్‌రెడ్డి రూ.లక్ష చెల్లించి టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. శనివారం నెల్లూరులోని వేదాయపాళెంలోని సోమిరెడ్డి క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చేతులమీదుగా పార్టీ సభ్యత్వం గుర్తింపు కార్డును అందుకున్నారు.

ఘనంగా మ్యాథ్స్ డే



నమూనాలు ప్రదర్శించిన విద్యార్థినులు

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెంలోని గ్లోబల్ ఇంగ్లీష్ మీడియం స్కూలు, గోపాలకృష్ణయ్య స్కూల్‌లో శనివారం మ్యాథ్స్‌డే ఘనంగా నిర్వహించారు. పాఠశాలల కరస్పాండెంట్లు గౌసియా మగ్దుం, శ్రీధర్‌లు శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని గణిత దినోత్సవ ప్రత్యేకతను విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, గణితముకు సంబంధించి పలు రకాల ఫార్ములాలను చార్టుల ద్వారా ప్రదర్శన చేసి క్విజ్ పోటీలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

మాజీ సీఎం జగన్ జన్మదిన వేడుకలు

కోవూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైస్ జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు.

● తోటపల్లిగూడూరు,(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇసుకపాలెం, తోటపల్లి, ముంగలదొరువు గ్రామాల్లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

● బుచ్చిరెడ్డిపాళెం,(ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెంలోని వైసీపీ కార్యాలయంలో మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు.

● పొదలకూరు,(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా స్థానిక పంచాయతీ బస్టాండు ఆవరణంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ప్రభుత్వ ఆసు పత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు.

పెన్నా డెల్టా ఛైర్మన్‌కు అభినందనలు

నెల్లూరు'(హరనాథపురం), డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): పెన్నాడెల్టా ఛైర్మన్‌గా ఎన్నికైన సీనియర్ టీడీపీ నాయకులు జెట్టి రాజగోపాల్‌రెడ్డిని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నగరంలోని ఆమె నివాసంలో శనివారం అభినందించారు. ఈ సందర్భంగా కోవూరు టీడీపీ నాయకులు మిఠాయిలు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. అనంతరం ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ జెట్టి శేషారెడ్డి సర్పంచిగా లేగుంటపాడు గ్రామాన్ని అభివృద్ధికి రోల్‌మాడగా తీర్చిదిద్ది, జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకున్నారని పేర్కొన్నారు. ఆయన ఇంకా మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆమె ఆకాంక్షించారు.



రాజగోపాల్‌రెడ్డికి ధ్రువీకరణ పత్రం అందచేస్తున్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

● తోటపల్లిగూడూరు,(ఆంధ్రజ్యోతి): పెన్నా డెల్టా డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ జెట్టి రాజగోపాల్‌రెడ్డికి ఏపీ చాంబర్స్ పంచాయతీ రాష్ట్ర కార్యదర్శి గోపిరెడ్డి వెంకటేశ్వర్లు పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి సన్మానించారు.

డీకేడబ్ల్యూ కళాశాలలో వినియోగదారుల దినోత్సవం

నెల్లూరు(విద్య), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డీ గిరి మాట్లాడుతూ వినియోగదారులు రక్షణచట్టం, హక్కులు తెలుసుకోవాలన్నారు. అనంతరం పలు అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సెట్నల్ సీఈవో శ్రీనివాసులు, పర్యవేక్షకులు ఎండీ గయాజ్, కళాశాల కన్స్యూమర్ క్లబ్ కన్వీనర్ డాక్టర్ వీ చెంచురామయ్య వాణిజ్య విభాగాధిపతి డాక్టర్ ఆర్.విజయభాస్కర్ పాల్గొన్నారు.

నేత్రపర్వంగా శ్రీవారి కల్యాణం

రాపూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్య క్షేత్రమైన పెంచలకోనలో శనివారం స్వామివారికి అభిషేకం, కల్యాణోత్సవం నేత్ర పర్వంగా జరిగాయి. సాయంత్రం ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత నరసింహస్వామికి తిరుచ్చి పల్లకీసేవ ప్రధాన అర్చకులు, వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య వేడుకగా జరిగాయి. ఈ కార్యక్రమాలను ఆలయ ఈవో పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు (జడ్పీ), డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): నగరంలోని శెట్టిగుంటరోడ్డు సబ్ స్టేషన్ పరిధిలో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నందున,స్తంభాలు మార్చుకోసం ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని నగర ఈఈ ఎం. శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజీవ్‌గాంధీ కాలనీ, మధురానగర్, ప్రశాంతినగర్, పల్లిపాడు రోడ్డు, కిసాన్‌నగర్, జాకీర్‌హుస్సేన్ నగర్, మైపాడు రోడ్డు, వేణుగోపాల్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

25న బీసీ సమన్వయ కమిటీ సమావేశం

నెల్లూరు(వ్యవసాయం), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏపీ బీసీ సమన్వయ కమిటీ జిల్లా సమావేశం ఈ నెల 25న నిర్వహించనున్నట్లు బీసీ కమిటీ జిల్లా కన్వీనర్ బుధవరపు బాలాజీ పేర్కొన్నారు. ఈవిషయమై శనివారం నెల్లూరులోని ఓహోటల్‌లో కమిటీ ముఖ్య నాయకులు సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఈనెల 25న జరిగే సమావేశానికి అన్ని కుల సంఘాల కోకన్వీనర్లు, బీసీ కుల సంఘాల నేతలు బాధ్యత తీసుకుని విజయవంతం చేయాలని తెలిపారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బూదాటి రాధయ్య, బీసీ సమన్వయ కమిటీ జిల్లా ఛైర్మన్ బొమ్మి నాగకిషోర్, రాష్ట్ర కన్వీనర్ నాసిన భాస్కర్‌గౌడ్, సోమగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగాయగుంటలో శనివారం వాసన్ ఐ కేర్ ఆసుపత్రి సహకారంతో టీడీపీ నాయకుడు ఉప్పు నారాయణ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ రామకృష్ణ సుమారు 100 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 15 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని నిర్ధారించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ వైద్యశిబిరంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు, వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

కొడవలూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని యల్లాయపాలెం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు, గ్రామంలో వృద్ధులకు బండ్ల బంగారయ్య, కమలమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బండ్ల బంగారయ్య వర్ధంతిని పురస్కరించుకుని వారి కుమారుడు బండ్ల హరిప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోహనరామలింగయ్య, మల్లికాదేవి ట్రస్ట్ సభ్యులు మోహన్‌చంద్ర, పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాటకం తిరుమలయ్య, ఎంపీటీసీ గరికపాటి రాజేంద్రకుమార్, తదితరులు పాల్గొన్నారు.

గండికోటకు సన్మానం


బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు గండికోట సుధీర్‌కుమార్‌ను ఎంఈవోలు దిలీప్‌కుమార్, పీవీ.రత్నం, పాఠశాల ఉపాధ్యాయులు శనివారం ఘనంగా సన్మానించారు. ఆరు రోజులుగా నెల్లూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రావెల్ అండ్ టూరిజం మేనేజ్మెంట్ శిక్షణ కేంద్రంలో నిర్వహించిన పునాది అక్షరాస్యత, గణితం కార్యక్రమంలో ఉపాధ్యాయులకు ఉత్తమ శిక్షణ అందించిన సందర్భంగా గండికోటను పలువురు ఎంఈవోలు, ఉపాధ్యాయులు సత్కరించారు.

అల్లీపురంలో హెల్త్ అసిస్టెంట్ల నిరసన

నెల్లూరురూరల్, డిసెంబరు21,(ఆంధ్రజ్యోతి) : నెల్లూరురూరల్ మండలం అల్లీపురం పీహెచ్‌సీ ఎదుట హెల్త్ అసిస్టెంట్లు శనివారం నిరసన వ్యక్తం చేశారు. టెర్మినేషన్ చేసిన వారందరిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, 20 ఏళ్లగా విధుల్లో ఉన్న తమను తెలంగాణ హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం టెర్మినేషన్ చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో కేవీ సుబ్బారావు, చంద్రయ్య, ఓంకారం శ్రీనివాసులు పాల్గొన్నారు.

టీడీపీ నేత మృతికి ఎమ్మెల్యే సోమిరెడ్డి నివాళి

తోటపల్లిగూడూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని నరుకూరుకు చెందిన తోట బాబురావు(55) శనివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన పార్థీవ దేహాన్ని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట నరుకూరు ఎంపీటీసీ కొణతం రఘుబాబు, మాజీ ఎంపీటీసీ పాకం వెంకయ్య, నాయకులు ఆకుల జయ కుమార్, ఏటూరు రవి, ఇనుమాల చెన్నయ్య, సాదేపల్లి చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.





నారావారిపల్లి


నారావారిపల్లి రూపుమారుతోంది..!

● మొదలైన ఇంటింటి సర్వే...

ప్రత్యేకాధికారిగా డీపీవో

విద్య, నైపుణ్యాలు, వ్యవసాయ, ఉద్యాన, పశుపోషణలకు ప్రాధాన్యం

సొంత ఊరి అభివృద్ధిపై దృష్టి సారించిన సీఎం



నైపుణ్యాల శిక్షణ కోసం సిద్ధమవుతున్న షెడ్లు

తిరుపతి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు స్వగ్రామం నారావారిపల్లి రూపురేఖలు మరో ఆరు నెలల్లో మారనున్నాయి. కుప్పం తరహాలో నారావారిపల్లికి కూడా ఇప్పటికే జిల్లా పంచాయతీ అధికారి ప్రత్యేకాధికారిగా నియమితులయ్యారు. చంద్రబాబు తన సొంత ఊరి అభివృద్ధిపై దృష్టి సారించిన నేపథ్యంలో సీఎంఓ దిశా నిర్దేశంతో జిల్లా యంత్రాంగం వడివడిగా అడుగులేస్తోంది. ఇటీవల సోదరుడి అంత్యక్రియలు, కర్మక్రియల కోసం గ్రామంలో కొన్ని రోజులు గడిపిన నేపథ్యంలో ఆయన తన ఆలోచనలను కలెక్టర్ వెంకటేశ్వర్‌తో పంచుకున్నారు. గతంలో ఆయన ముఖ్యమంత్రిగా ఉండగా రోడ్డు కనెక్టివిటీ, టీటీడీ కల్యాణ మండపం, వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ ఆస్పత్రి వంటివి తెప్పించిన సంగతి తెలిసిందే. తాజాగా ఆయన సొంత ఊరిని సర్వతోముఖాభివృద్ధి దిశగా నడిపించాలని తీర్మానించుకున్నారు. ఈ క్రమంలో ఆ గ్రామంతో ముడిపడివున్న రంగంపేట, కందుల వారిపల్లి, చిన్న రామాపురం సచివాల యాల పరిధిని ఎంచుకున్నారు. ఈ మూడు సచివాలయాల పరిధిలోని కుటుంబాల సమగ్ర వివరాలూ సేకరించనున్నారు. దానికోసం "ఒక కుటుంబం...ఒక వ్యవస్థాపక వ్యాపారవేత్త" (ఒన్ ఫ్యామిలీ - ఒన్ ఎంటర్‌ప్రెన్యూర్) అనే నినాదంతో ఇంటింటి సర్వే మొదలైంది. అవసరాలేమిటన్నది లోతుగా ఆరా తీస్తున్నారు.

ఆధునిక వసతుల కల్పనపైనా దృష్టి

ఇన్‌డోర్ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థలం గుర్తించారు. నిర్మాణానికి టెండర్లు కూడా పిలిచారు. అక్కడే యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా సీడీఎం సదుపాయం ఉన్న ఏటీఎం ఏర్పాటు కానుంది. చిన్న రామాపురం పంచాయతీలో బీఎస్ఎన్ఎల్ ఇంటర్నెట్ క్వాలిటీ పెంచనున్నారు. ఈ-ఆటోలు, ఈ-బస్సు అందుబాటు లోకి రానున్నాయి. ఇవన్నీ ఈ నెలాఖరులోపు అందుబాటులోకి రానున్నాయి. మౌలిక సదుపాయాలకు సంబంధించి రూ.41 లక్షలతో 11 తాగునీటి పథకాలు, రూ.81 లక్షలతో ఐదు సీసీ రోడ్లు మంజూరయ్యాయి. రూ.21 లక్షలతో వీధి దీపాలు ఏర్పాటు చేయనున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి నాటికి పూర్తి కానున్నాయి. ఐతేపల్లి నుంచీ రంగంపేట వరకూ రోడ్డు ఏర్పాటు చేయడం ద్వారా అటు నాయుడుపేట-పూతలపట్టు ఆరు వరుసల జాతీయ రహదారి నుంచీ ఇటు మదనపల్లె-తిరుపతి నాలుగు వరుసల జాతీయ రహదారిని కలపనున్నారు.



ఇంటింటి సర్వేలో భాగంగా కుటుంబాల వివరాలు సేకరిస్తున్న సిబ్బంది

చదువు, నైపుణ్యాల పెంపుపై ప్రధాన దృష్టి

పది ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయనున్నారు. అంగన్‌వాడీ నుంచీ మూడవ తరగతి వరకూ నాణ్యమైన విద్యను ఆపై టెన్త్ వరకూ సమగ్ర విద్యను పిల్లలకు అందించనున్నారు. ఆ ప్రాంతంలోని ఏకైక జడ్పీ హైస్కూలును శ్రీసిటీ దత్తత తీసుకోనుంది. సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ పరంగా ఆ స్కూల్‌ను రాష్ట్ర స్థాయిలో ఆధునిక ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దనుంది. నైపుణ్యాలు అవసరమైన వారికి కొత్తగా శిక్షణ, ఇప్పటికే శిక్షణ పొందిన వారికి ఉన్నత శిక్షణ, శిక్షణ పొంది మరచిపోయిన వారికి తిరిగి శిక్షణ ఇప్పించనున్నారు. అర్హత ఉన్న వారికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. మిగిలిన వారికి స్థానికంగానే వివిధ రకాలైన అంశాల్లో శిక్షణ ఇచ్చి వస్తు ఉత్పత్తికి అవకాశం కల్పిస్తారు. వ్యవసాయ, ఉద్యాన శాఖల ద్వారా రైతులకు అవసరమైన సాయం అందించనున్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు రుణాలు, డీఆర్‌డీఏ ద్వారా స్వయం ఉపాధికి యూనిట్లు వంటివి అందించనున్నారు.

నారావారిపల్లి అభివృద్ధికి వేగంగా చర్యలు: కలెక్టర్

ఇంటింటి సర్వే ఈ నెలాఖరుకు ముగియనుంది. ఇప్పటికే పాఠశాల అభివృద్ధికి రూ.80 లక్షలతో అంచనాలు రూపొందించి శ్రీసిటీకి అందజేశాం. నైపుణ్యాల శిక్షణ పరంగా ప్రస్తుతానికి 1800 చదరపు అడుగుల వైశాల్యం కలిగిన రెండు భవనాలను గుర్తించి సిద్ధం చేశాం. ఎస్సీ ఎస్టీ కుటుంబాల గురించి మరింత ఎక్కువ శ్రద్ధ తీసుకుంటున్నాం. నైపుణ్యాల శిక్షణ పేరిట నామమాత్రపు చర్యలకు పరిమితం కావడం లేదు. అర్హత ఉన్న వారికి ఎలక్ట్రానిక్స్, ఎయిర్ కండిషనింగ్, ఆటోమోటివ్, ఫుడ్ ప్రాసెసింగ్, హాస్పిటాలిటీ, హోటల్ మేనేజ్‌మెంట్ వంటి సాఫ్ట్ స్కిల్స్ పైనా దృష్టి పెడుతున్నాం. నారావారిపల్లి పరిధిలో ప్రతి ఇంటి నుంచీ ఒక వ్యవస్థాపక వ్యాపారవేత్త తయారై మంచి ఆదాయం సంపాదించడమే అంతిమ లక్ష్యంగా పనిచేస్తున్నాం.

కోడి బొచ్చు కథ

ముగియలేదు

● చికెన్ వేస్ట్ మాఫియాలో చొరబడిందెవరు? ● పవన్ చెప్పినా కొనసాగుతున్న దందా



చికెన్ వేస్ట్ సేకరిస్తున్న దృశ్యం

'కోడి బొచ్చును కూడా నెలకు రూ.20లక్షలకు అమ్ముకునే వాళ్లు మనకు ఎమ్మెల్యేలుగా కావాలా?' అని ఎన్నికల ముందు జనసేనాని పవన్ కల్యాణ్ తిరుపతిలో జరిగిన ప్రజాగళం సభలో మాట్లాడారు. ఇంతకీ కోడి బొచ్చు కథేంటి? అంటూ అప్పట్లో పెద్ద చర్చే నడిచింది. కోడి బొచ్చు.. అంటే 'చికెన్ వేస్ట్' మాఫియాతో వైసీపీ నేతల హస్తం ఉందన్న ప్రచారం తెరపైకి వచ్చింది. పవన్ వ్యాఖ్యలను వైసీపీ నేతలు ఖండించకపోవడంతో ఆ ఆరోపణలకు మరింత బలం చేకూరింది. చికెన్ వేస్ట్ కూడా అప్పటి అధికార పార్టీ నేతలకు రూ.లక్షల్లో ఆదాయాన్ని తెచ్చిపెట్టినట్టుగా తేటతెల్లమైంది. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా కోడిబొచ్చు కథ ముగిసిందా.. అంటే లేదనే సమాధానమే వస్తోంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

గతంలో వైసీపీ నేతలకు కాసులు కురిపించిన కోడిబొచ్చు రవాణా ఇప్పుడూ యథేచ్ఛగా సాగుతోంది. దీని వెనుక కూటమి నాయకులున్నారా? లేదా అధికార యంత్రాంగం కాసులకు కక్కుర్తి పడుతోందా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వైసీపీ అధికారంలోకి వచ్చాక చికెన్ వేస్ట్‌ను కూడా క్యాష్ చేసుకోవచ్చని తెలుసుకున్నారు. తమకు తెలియకుండా ఏ ఒక్క షాపు కూడా చికెన్ వేస్ట్ ఇవ్వకూడదని మున్సిపల్ అధికారులను అడ్డుపెట్టుకుని మాఫియాకు తెరలేపారు. వారు చూపిన దారిలోనే ఇప్పటివాళ్లు కూడా నడుస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఇందులో ఎవరి పాత్ర ఎంత ఉందనేది అంతుపట్టడంలేదు.

ఒకప్పుడు అలా... : కొన్నేళ్ల క్రితం మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది వ్యర్థాలను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించేవారు. దీనికోసం చికెన్ స్టాళ్ల యాజమాన్యం సిబ్బందికి కొంత మొత్తం ముట్టజెప్పాల్సి వచ్చేది. డబ్బులు ఇవ్వడం ఇష్టంలేని వారు వ్యర్థాలను నిర్మానుష్య ప్రాంతాల్లో పడేసేవారు. వీటిని తిరుపతితో పాటు సమీప జిల్లాలలోని చేపల చెరువులు, పందులకు ఆహారంగా వినియోగిస్తూ వచ్చేవారు. దీంతో కొందరు రంగంలోకి దిగి చికెన్ స్టాల్స్ యాజమాన్యాన్ని సంప్రదించి మీకు ఎలాంటి శ్రమ లేకుండా ఉచితంగా తామే వేస్ట్‌ను తీసుకెళతామని చెప్పడంతో షాపుల నిర్వాహకులు అంగీకరించి వారికి ఇవ్వడం మొదలుపెట్టారు.

ఇలా సేకరిస్తారు...

కోళ్లను కోసిన అనంతరం వ్యర్థంగా పడేసే భాగాలను ప్రత్యేక వాహనాల ద్వారా ఓ ముఠా చేపల చెరువులు, పందులకు ఆహారంగా తరలిస్తోంది. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ముఠా సభ్యులు ప్రత్యేక వాహనాల్లో చికెన్ షాపుల వద్దకు చేరుకుంటారు. కోళ్లనుంచి తీసిన పేగులు, తల, కాళ్లు, చర్మం, ఈకలను వాహనంలోని భారీ ప్లాస్టిక్ డ్రమ్ముల్లో వేసుకుని తరలిస్తున్నారు. వీటిని తీసుకెళ్లే వారు అధికమొత్తంగా చేపలకు, పందులకు ఆహారంగా వినియోగిస్తారు. వీటిని తిన్న మనుషులకు ప్రమాదకర వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని వైద్యులు అంటున్నారు.

ఇలా చేయొచ్చు..

వాస్తవానికి వ్యర్థాలు నగరపాలక సంస్థకు ఆదాయాన్ని తెచ్చిపెట్టేలా ఉండాలి. టెండర్ ద్వారా ఏదైనా ఏజెన్సీకి అప్పగించి చికెన్ వేస్ట్‌ను తీసుకెళ్లేలా చేయాలి. వారు దాన్ని వెట్ వేస్ట్ ప్రాసెసింగ్ చేసి జంతువులకు ఆహారంగా (మీట్‌మీల్) వినియోగిస్తారు. కొన్ని కార్పొరేషన్లలో ఇలాంటి విధానం జరుగుతోంది కూడా. తిరుపతి నగరపాలక సంస్థ మాత్రం అలాంటి పనిచేయకుండా మాఫియా ముఠాకు సహకరించడమేమిటన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. కిలో కోడి వ్యర్థాల నుంచి 300 గ్రాముల మీట్‌మీల్ వస్తుంది. తిరుపతిలో రోజుకు 2 టన్నుల కోళ్ల వ్యర్థాలు ఉంటాయి. వీటిని కార్పొరేషన్ ద్వారా సేకరిస్తే టన్నుకు రూ.2వేలు చొప్పున రూ.4వేల వరకు సంస్థకు ఆదాయం వస్తుంది. మరోవైపు చేపలు, పందులకు వీటిని ఆహారంగా ఇవ్వడాన్ని నివారించొచ్చు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తీర ప్రాంతాల్లో భద్రత కట్టుదిట్టం

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సముద్ర తీర ప్రాంతాల్లో భద్రత కట్టుదిట్టంగా ఉండాలని కలెక్టర్ వెంకటేశ్వర్ మెరైన్ పోలీసులకు సూచించారు.తూపిలిపాలెం, దుగరాజ పట్నం బీచ్‌లలో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి కోస్టల్ సెక్యూరిటీ కమిటీ తొలి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ దుగరాజపట్నంకు సంబంధించిన కోస్టల్ సెక్యూరిటీ పోలీస్‌స్టేషన్ మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పూడిరాయి దరువు వద్ద జెట్టి నిర్మాణానికి అటవీ, పర్యావరణ అనుమతులు వచ్చిన తర్వాత నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లేటప్పుడు ఆధార్, బయోమెట్రిక్ కార్డు వెంట తీసుకుని వెళ్లేలా చర్యలు చేపట్టాలని జిల్లా మత్స్యశాఖ అధికారి నాగరాజును ఆదేశించారు. కోస్టల్ సెక్యూరిటీలో ఖాళీలను భర్తీ చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలు పంపాలని సూచించారు. సముద్రంపై అక్రమంగా చేపల వేట జరగకుండా జాయింట్ పెట్రోలింగ్ చేయాలన్నారు. సమావేశంలో డీసీఐఓ శిరీష, క్రైం అదనపు ఎస్పీ నాగభూషణరావు, కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ అదనపు ఎస్పీ మధుసూదన్‌రావు, కస్టమ్స్ ప్రివెంటివ్ డివిజన్ తిరుపతి సూపరింటెండెంట్ శ్యాంసుందర్‌రెడ్డి, కోస్ట్‌గార్డ్ అధికారి బేగ్, డీఎస్పీ గిరిధర్, జిల్లా మత్స్యశాఖ అధికారి నాగరాజ, మెరైన్ పోలీస్ అధికారులు మాలకొండయ్య, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వైద్య ఆరోగ్య శాఖలో బదిలీలు

● విశాఖ సీఎస్ఆర్ఎంవోగా డీఎంహెచ్‌వో శ్రీహరి బదిలీ
● ఆయన స్థానంలో బాలకృష్ణ నాయక్ నియామకం



బాలకృష్ణ నాయక్

తిరుపతి(వైద్యం), డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖలో ప్రభుత్వం శనివారం బదిలీలు చేపట్టింది. ఇందులో భాగంగా తిరుపతి డీఎంహెచ్‌వో డాక్టర్ యు.శ్రీహరిని విశాఖపట్నంలోని కేజీహెచ్ ఆస్పత్రి సీఎస్ఆర్ఎంవోగా బదిలీ చేసింది. నగరి ఏరియా ఆస్పత్రి సీఎస్ఆర్ఎంవో డాక్టర్ వి.బాలకృష్ణ నాయక్‌ను తిరుపతి డీఎంహెచ్‌వోగా నియమించింది. చంద్రగిరి డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ డి.టి.సుధారాణిని చిత్తూరు డీఎంహెచ్‌వోగా నియమించింది. రుయాస్పత్రి సీఎస్ఆర్ఎంవోగా శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి సీఎస్ఆర్ఎంవో డాక్టర్ బి.సుబ్బలక్ష్మమ్మను నియమించింది. ఎస్వీ వైద్య కళాశాల ఆర్‌ఎంఓ డాక్టర్ జే.రామాంజనేయులును కడప క్యాన్సర్ సెంటర్ సీఎస్ఆర్ఎంవోగా బదిలీ చేసింది.



ప్రత్యేక కథనం.. 6లో

లెక్కలు లేని బతుకును ఊహించలేం. అన్నింటికీ లెక్కలే ముడిపడి ఉంటాయి. జనాభా లెక్కలు మొదలు కరోనా సమయంలో వ్యాప్తిని సైతం గణాంకాల ద్వారానే గుర్తించాం. అంతేకాదు ఇప్పటి పోటీ ప్రపంచంలో లెక్కల్లో పట్టు సాధించిన వారే వివిధ రంగాల్లో రాణించగలుగుతున్నారు. అకడమిక్ నుంచి ఉద్యోగ పరీక్షల వరకూ లెక్కలే కీలకపాత్ర పోషిస్తున్నాయి. తమిళనాడులో పేదరికంలో పుట్టినా లెక్కల్లో ప్రపంచ పేరుగాంచాడు రామానుజన్. ఈయన జన్మదినాన్ని (డిసెంబరు22వ తేదీ) మ్యాథ్స్ దినంగా నిర్వహించుకుంటున్నాం.

వన చైతన్య రథం మూగబోయింది



టాస్క్‌ఫోర్స్ కార్యాలయం వద్ద మూలనపడ్డ ఎర్రచందనం వన చైతన్య రథం

శేషాచల కొండల్లోని ఎర్రచందనం అక్రమ రవాణాపై ప్రజల్లో చైతన్యం కల్పించడానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎర్రచందనం వన చైతన్య రథం ప్రస్తుతం మూలనపడింది. అక్రమ రవాణా వల్ల కలిగే పరిణామాలపై అవగాహన కల్పించేందుకు 2019 ముందు ఐజీ క్యాడర్‌లో హెడ్ ఆఫ్ టాస్క్‌ఫోర్స్‌గా ఉన్న కాంతారావు దీన్ని ఏర్పాటు చేశారు. అటవీ సమీప గ్రామాలతో పాటు కూలీలుగా వస్తున్న తమిళనాడుకు చెందిన జవాదీ హిల్స్ పరిసర ప్రాంతాల్లోనూ ప్రజలకు అవగాహన కల్పించారు. అంతేగాక టోల్‌ఫ్రీ నంబర్ ప్రచారం చేయడంతో ప్రజలు కూడా అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం అందించేవారు. కాంతారావు బదిలీ తర్వాత ప్రచారానికి అవసరమైన నిధులు సమకూర్చే వారు లేకపోవడంతో ప్రచార రథం మూలనపడింది. ఐదేళ్లుగా నిరుపయోగంగా ఉంటూ తుప్పుపట్టే దశకు చేరింది. పైగా టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇచ్చేవారు కూడా కరువయ్యారు.

- మంగళం, (ఆంధ్రజ్యోతి)




సమ్మేంద్రతీర్థకు శ్రీవారి ప్రసాదాలు అందజేస్తున్న ఆలయ అధికారులు

శ్రీవారిసేవలో కాశీ మఠాధిపతి

తిరుమల, డిసెంబరు21 (ఆంధ్రజ్యోతి): వారణాశి కాశీ మఠాధిపతి సమ్మేంద్రతీర్థ స్వామి శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో శ్రీవారి ఆలయ మహాద్వారం వద్ద టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, అర్చకబృందం ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. అనంతరం మూలవిరాట్టును దర్శించుకున్నారు.

సర్వదర్శనానికి 15 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 22 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.


గురువారం నాటి హుండీ ఆదాయం: రూ.3.75 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 65,299

తలనీలాలు సమర్పించినవారు: 20,297

నేడు జాతీయ గణిత దినోత్సవం

లెక్కలు అందమైన భవితకు రెక్కలు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు). తిరుపతిరూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మనిషి భూమి మీద పడినప్పటి నుంచే లెక్కలు మొదలవుతాయి. ఏ తేదీన పుట్టాడు. ఎన్ని గంటలకు పుట్టాడు లాంటి లెక్కలు ఆ క్షణం నుంచే ప్రారంభమవుతాయి. అందుకే జీవితమంతా లెక్కలతోనే ముడిపడి ఉంటుంది. కానీ విద్యాభ్యాసం ఆరంభంలోనే లెక్కలంటే చాలామంది విద్యార్థులను భయం వెంటాడుతుంది. ఇదో కొరుకుడుపడని అంశంగా భావిస్తారు. భవిష్యత్‌కు ఈ లెక్కలే సోపానాలని అప్పుడు గ్రహించరు. అయితే ఈ లెక్కలను అర్థం చేసుకుంటే దీనంత సులువు మరొకటి ఉండదంటారు గణిత నిపుణులు. లెక్కలను భయంతో కాకుండా ఆసక్తితో నేర్చుకోవాలని హితవు పలుకుతుంటారు. ప్రాథమిక స్థాయి నుంచే లెక్కలంటే ప్రతికూలతను దూరం చేయాలంటారు. మనసుపై ముద్ర పడేలా బోధిస్తే లెక్కలేమంత కష్టం కాదంటున్నారు. ఇప్పుడున్న పోటీ ప్రపంచంలో లెక్కలు రాకపోతే అన్నీచిక్కులే. మ్యాథ్స్ లేని పోటీ పరీక్ష కాని, ఉన్నత చదువుగాని ఉండదంటే అతిశయోక్తి కాదు. పొరుగున ఉన్న తమిళనాడులో పేదరికంలో పుట్టినా లెక్కల్లో ఘనాపాఠిగా పేరుగాంచాడు రామానుజన్. ప్రపంచంలోనే మన దేశానికే ప్రత్యేకగుర్తింపు తెచ్చిపెట్టాడు. ఈయన జన్మదినాన్ని (డిసెంబరు22వ తేదీ) మ్యాథ్స్ దినంగా నిర్వహించుకుంటున్నాం. ఈ సందర్భంగా బాల్యం నుంచే లెక్కల్లో భళా అనిపించుకుంటున్న ఈ చిన్నారులేమంటున్నారో తెలుసుకుందాం.

గణిత విజ్ఞానంతో ముందడుగు



నిత్య జీవితంలో అనేక విషయాల్లో గణితాన్ని చూడవచ్చు. ప్రపంచ జనాభా సైతం గణితంలోనే విశ్లేషించుకోవలసి వస్తుంది. కరోనా వ్యాప్తి గణాంకాలను వివరించింది కూడా గణితమే. దూరాన్ని లెక్కల్లోనే కొలుస్తాం. ఇలా అన్నింటా కీలక పాత్ర పోషిస్తున్నందునే గణితానికి చాలా ప్రాధాన్యముంది. గణితం చదువుకున్న వారికి ఎన్నో ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. గణిత విజ్ఞానానికి కంప్యూటర్ పరిజ్ఞానాన్ని కూడా జోడిస్తే మరిన్ని ఉన్నత అవకాశాలు దక్కే అవకాశం ఉంటుంది. పోటీ పరీక్షల్లోనూ రాణించడానికి గణితం చాలా ఉపయోగపడుతూ ఉంది. కాలానుగుణంగా ఎన్ని మార్పులు వచ్చినా గణిత శాస్త్ర ప్రాముఖ్యత తగ్గకపోగా, పెరుగుతోంది.

- అనుపల్లె సుధాకరయ్య,
ఎస్వీయూనివర్సిటీ గణిత విభాగ ప్రొఫెసర్

చిన్నప్పటి నుంచి లెక్కలంటే ఇష్టం



తిరుపతి జీఎస్ మాడవీధిలోని శ్రీచైతన్యస్కూల్‌లో 8వతరగతి చదివుతున్నాను. ఇంటర్నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్, నాలెడ్జ్ అసైన్‌మెంట్ పరీక్షల్లో బంగారు పతకాలు సాధించాను.

- వి.మోహిత్ వంశీరెడ్డి

గణితం వల్ల ఐఐటీలో సీటు



చిన్నప్పటి నుంచి గణితంపై చాలా మక్కువ. జాతీయస్థాయి సైనిక్ ప్రవేశపరీక్షల్లో గణితంలో 200కి 200మార్కులు వచ్చాయి. జేఈఈ మెయిన్స్ పరీక్షల్లోనూ వంద శాతం పర్సంటైల్ సాధించా. హైదరాబాద్ ఐఐటీలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ చదువుతున్నా. ఇదంతా లెక్కల్లో ఆసక్తి వల్లే సాధ్యమైంది.

- రోహిత్

ఒలింపియాడ్‌లో ఆరు పతకాలు



తిరుపతిలోని డాక్టర్ కిషోర్ రత్నం స్కూల్‌లో 9వతరగతి చదువుతున్నాను. ఇప్పటివరకు అంతర్జాతీయస్థాయి గణిత ఒలింపియాడ్‌లో ఆరుపతకాలు వచ్చాయి. గణితమంటే ఎంతో ఇష్టం. ఏటా గణిత ఒలింపియాడ్ పరీక్షలు రాస్తుంటాను. భవిష్యత్‌తో ఐఐటీ సాధనకు లెక్కలు ఉపయోగపడతాయనుకుంటున్నాను.

- షణ్ముఖప్రియ

అర్థం చేసుకుంటే ఈజీ



తిరుపతి మాతృశ్రీస్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్నాను. రాష్ట్ర, జాతీయస్థాయి పోటీపరీక్షలకు వెళ్తుంటాను. ఇటీవల ఇంటర్నేషనల్ గణిత ఒలింపియాడ్ పరీక్షని రాశాను. అర్థం చేసుకుని చదివితే లెక్కలకిమించిన ఈజీ సబెక్టు మరొక్కటి లేదు.

- ఎన్.గురుదీప్,
7వతరగతి, మాతృశ్రీస్కూల్

అంతర్జాతీయ పతకమొచ్చింది



ఏఐఆర్ బైపాస్‌రోడ్డులోని శ్రీచైతన్య స్కూల్‌లో 9వతరగతి చదువుతున్నాను. అంతర్జాతీయస్థాయి గణిత ఒలింపియాడ్ సెకండ్ లెవల్(ఫైనల్)లో బంగారు పతకాన్ని సాధించాను. నాలెడ్జ్ అసైన్‌మెంట్ పరీక్షలోనూ అత్యుత్తమ ప్రతిభతో పతకాన్ని పొందాను. గణితంపై ఉన్న ఇష్టంతో ఐఐటీలో ఇంజినీరింగ్ చేయాలనుకుంటున్నాను.

-వేదశ్రీ

సంక్రాంతికి 230 ప్రత్యేక బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): భోగి, సంక్రాంతి పండుగలకు ఏపీఎస్ ఆర్టీసీ తిరుపతి కేంద్రంగా 230 ప్రత్యేక బస్సులను నడపనుంది. ఇక్కడి నుంచి హైదరాబాదు, విజయవాడ, బెంగళూరుకు సర్వీసులు నడపనున్నట్లు ఇన్‌చార్జ్ డిప్యూటీ సీటీఎం పి.విశ్వనాథం తెలిపారు. అమరావతి, ఇంద్ర, సూపర్‌లగ్జరి, అల్ట్రాడీలెక్స్, ఎక్స్‌ప్రెస్‌లు అందుబాటులో ఉంచామన్నారు. వచ్చేనెల 9నుంచి 13వ తేదీ వరకు రాను, 15నుంచి 17వ తేదీ వరకు పోను వేర్వేరుగా బస్సులు, వాటి రవాణా సయయాలను ఖరారు చేశామన్నారు. టిక్కెట్స్ రిజర్వేషన్ సౌకర్యం కల్పించామన్నారు. సాధారణ చార్జీలనే వసూలు చేయనున్నట్లు వివరించారు.

22 మెమూ రైళ్ల రద్దు

తిరుపతి(సెంట్రల్), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : 22 మెమూ ప్యాసింజరు రైళ్లను ఈ నెల 26 నుంచి రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీటీఎం కె.మణికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో కాట్పాడి-తిరుపతి మధ్య రాకపోకలు సాగిస్తున్న 6, విశాఖపట్నం నుంచి రాజమండ్రి, పలాస, విజయనగరం మధ్య రాకపోకలు సాగించే 6, కాచిగూడ- మహబూబ్‌నగర్, నడుకుడి మధ్య 8, కాట్పాడి-జోలార్‌పేట మధ్య నడుస్తున్న 2 మెమూ ప్యాసింజర్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఇవి ఈ నెలాఖరు నుంచి ఫిబ్రవరి వరకు వారణాసిలో నిర్వహించే కుంభమేళా భక్తులకు సేవలు అందించనున్నాయని తెలిపారు. అలాగే చెన్నై సమీపంలోని పెరంబూరు ఐసీఎఫ్ కోచ్ ఫ్యాక్టరీ నుంచి 22 రైలు పెట్టెలతో కూడిన 15 రైళ్లను పంపనున్నారని తెలిపారు. తిరుపతి నుంచి వారణాసి, అలహాబాదుకు కొన్ని ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాళహస్తి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది ఫిబ్రవరి 25 నుంచి మార్చి 6వ తేదీ వరకు జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ధూర్జటి కళాప్రాంగణం, స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవంలో పాల్గొనదల్చిన కళాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆలయ ఈవో బాపిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల కళాకారులు దరఖాస్తులను పూర్తి వివరాలతో పాటు ఫొటో, బ్యాంకు పాసుపుస్తకం జిరాక్స్ కాపీని పొందుపరుస్తూ జనవరి 20వ తేదీలోపు దేవస్థానం కార్యాలయంలో కానీ ఆలయ ఈమెయిల్ ద్వారా గానీ పంపాల్సిందిగా కోరారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

10 నుంచి ఫ్లెమింగో ఫెస్టివల్

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 10వ తేదీ నుంచి మూడు రోజుల పాటు ఫ్లెమింగో ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ఎస్పీ సుబ్బరాయుడు, కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ జూ క్యూరేటర్ సెల్వం, పర్యాటక శాఖ రీజనల్ డైరెక్టర్ .రమణ ప్రసాద్‌తో కలిసి ఆయన సమీక్షించారు. సీఎం ఆదేశాల మేరకు ఫ్లెమింగో ఫెస్టివల్‌ను పండుగ వాతావరణంలో నిర్వహించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ ఉత్సవం గురించి దేశ, ప్రపంచ వ్యాప్తంగా పర్యాటకులకు తెలిసేలా విస్తృత ప్రచారం చేయాలని ఆదేశించారు. ఐదు ప్రాంతాల్లో నిర్వహించనున్న ఈ వేడుకలకు ఇన్‌చార్జి అధికారులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పులికాట్ సరస్సులో బోటు ప్రయాణానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి, డీఎఫ్‌వో, జిల్లా పర్యాటకశాఖ అధికారి జనార్దన్‌రెడ్డి, ఏపీటీడీసీ ఈఈ సుబ్రహ్మణ్యం, డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, జిల్లా మత్స్యశాఖ అధికారి నాగరాజు పాల్గొన్నారు.

నీలేష్‌కుమార్‌కు యంగ్ అచీవర్స్ అవార్డు



అవార్డు అందుకుంటున్న నీలేష్‌కుమార్

తిరుపతిరూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): చెన్నై ఎస్ఆర్ఎం యూనివర్సిటీ పూర్వ విద్యార్థి, తిరుపతికి చెందిన కుప్పాల నీలేష్‌కుమార్ యంగ్ అచీవర్స్ అవార్డు అందుకున్నారు. వర్సిటీకీ చెందిన 1991-2024 బ్యాచ్ విద్యార్థులకు వ్యవస్థాపక చాన్సలర్ డాక్టర్ టీఆర్ పారివేందర్, ప్రో చాన్సలర్ డాక్టర్ పి.రవిల నేతృత్వంలో అవార్డులను ప్రదానం చేశారు. ఏపీ నుంచి నీలేష్‌కుమార్ ఈ అవార్డు అందుకున్నారు. ఈయన తిరుపతికి చెందిన కుప్పాల గిరిధర్ కుమారుడు.

ఉత్కంఠగా అరణియార్ సాగునీటి సంఘ ఎన్నికలు

- రవిరెడ్డికి దక్కిన చైర్మన్ గిరి



రవిరెడ్డి - విజయకృష్ణ

పిచ్చాటూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అరణియార్ రిజర్వాయర్‌కు శనివారం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఉత్కంఠ భరితంగా సాగింది. అధిష్టానం జోక్యంతో పిచ్చాటూరు టౌన్‌కు చెందిన రవిరెడ్డికి చైర్మన్ గిరి దక్కింది. వైస్ చైర్మన్‌గా నాగలాపురం మండలం కృష్ణాపురానికి చెందిన విజయకృష్ణ ఎన్నికయ్యారు. వైస్ చైర్మన్‌గా మొదటి నుంచి విజయకృష్ణను అనుకున్నారు. అయితే చైర్మన్‌గా నాగలాపురం పట్టణానికి చెందిన సెల్వకుమార్, పిచ్చాటూరు పట్టణానికి చెందిన రవిరెడ్డి మధ్య హోరాహోరీ పోరు జరిగింది. అధిష్టానం జోక్యంతో చెరి రెండున్నర సంవత్సరాల ఒప్పందంతో మొదటి రెండున్నర సంవత్సరాలు (ప్రస్తుతం) రవిరెడ్డి నియామకం జరిగింది. రవిరెడ్డిని ఏఎంసీ మాజీ చైర్మన్, క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి తన బృందంతో కలసి అభినందనలు తెలిపారు. అరణియార్ ప్రాజెక్టుకు ఐదుగురు ఆయకట్టు అధ్యక్షులు కాగా 60 మంది టీసీ మెంబర్లు ఉన్నారు. ఒక్కో అధ్యక్షుడిని 12 మంది టీసీ మెంబర్లు ఎన్నుకుంటారు. ఐదుగురు అధ్యక్షుల్లో చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకోవడం పరిపాటి. ఎన్నికల అధికారిగా ఇరిగేషన్ ఈఈ రత్నాకర్‌రెడ్డి, డీఎస్పీ రవీంద్ర కుమార్, సీఐ రవీంద్ర, ఎస్ఐ వెంకటేశులు పాల్గొన్నారు.

72 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

- ఒకరి అరెస్టు



స్వాధీనం చేసుకున్న బియ్యం

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తమిళనాడుకు తరలించడానికి సిద్ధంగా ఉంచిన 72 బస్తాల రేషన్ బియ్యాన్ని తిరుపతి రూరల్ పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. రూరల్ సీఐ చిన్నగోవిందు కథనం మేరకు.. తిరుపతి రూరల్ మండలం తనపల్లి ఇందిరమ్మ ఇళ్ల బ్లాక్ నెంబరు 22లో కాపురముంటున్న ఏ.రాజశేఖర్ తిరుపతి, తిరుపతి రూరల్ ప్రాంతాల్లో కార్డుదారుల నుంచి తక్కువ ధరకు రేషన్ బియ్యం కొనుగోలు చేసి, తమిళనాడుకు తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. రూరల్ సీఐ చిన్నగోవిందు పర్యవేక్షణలో ఎస్ఐ రామకృష్ణ సిబ్బందితో కలసి అతని ఇంట్లో తనిఖీలు చేపట్టారు. స్టాకు ఉంచిన 72 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. దీని వెనుక ఇంకెవరైనా ఉన్నారా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు.

స్వర్ణముఖి ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్‌గా దామెర



ప్రసాద్‌నాయుడు, శంకర్‌నాయుడులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎన్నికల అధికారి సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్యే విజయశ్రీ

శ్రీకాళహస్తి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణముఖి ఆనకట్ట సిస్టమ్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్‌గా పెళ్లకూరు మండలం నెలబల్లి పంచాయతీ పరిధిలోని బీమవరం గ్రామానికి చెందిన దామెర ప్రసాద్ నాయుడు ఎన్నికయ్యారు. శ్రీకాళహస్తి ఇరిగేషన్ శాఖ కార్యాలయంలో శనివారం జరిగిన ఎన్నికలో కమిటీ సభ్యులు పెళ్లకూరు మండలానికి చెందిన పాపాడి రాజగోపాల్‌రెడ్డి, వేలూరు హరినాయుడు, మరుపూరు మస్తాన్‌రెడ్డిలతో పాటు బుచ్చినాయుడుకండ్రిగ మండలం ఆలత్తూరు గ్రామానికి చెందిన గురవయ్య కలిసి చైర్మన్‌గా దామెర ప్రసాద్‌నాయుడిని ఎన్నుకున్నారు. తొట్టంబేడు మండలం గుమ్మడిగుంట గ్రామానికి చెందిన శంకర్‌నాయుడు వైస్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరికి నీటిపారుదల శాఖ ఈఈ, ఎన్నికల అధికారి సుబ్రహ్మణ్యం మంజుల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ పెళ్లకూరు మండలాధ్యక్షుడు సంచి కృష్ణయ్య, స్వర్ణముఖి ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ పేరం రమేష్‌నాయుడు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, రాష్ట్ర సర్పంచుల సంఘం నాయకులు కందమూడి శివకుమార్, దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, నేలవల్లి సిద్దులయ్య నాయుడు, మదన్‌మోహన్‌నాయుడు, మురళీనాయుడు, కృష్ణమనాయుడు, మునిరామయ్య, రవినాయుడు వారిని అభినందించారు.

రాక్షసుడితో రాజీ అబద్ధం

- తప్పుడు కథనాలు బాధాకరం
- వైసీపీ అరాచకాలను వదిలే ప్రసక్తే లేదు
- శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



శ్రీకాళహస్తి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): 'ఐదేళ్ల పాటు ఒక నరరూప రాక్షసుడితో పోరాడాను. నాపై అక్రమంగా 19 కేసులు బనాయించాడు.. ఎన్నికైన రోజు నుంచే పాపాత్ముడి అరాచకాలపై అలుపెరగకుండా పోరాడుతున్నాను. వైసీపీ అక్రమాలను వెలికితీస్తున్నా.. తప్పులు చేసిన మాజీ ఎమ్మెల్యేతో సహా పలువురు వైసీపీ నాయకులపై కేసులు నమోదయ్యాయి.. ఇలా వైసీపీ అరాచక, అక్రమాలపై చర్యలు తీసుకుంటుంటే ఆ రాక్షసుడితో రాజీపడినట్లుగా కొందరు కథనాలు రాయడం మనస్సును తీవ్రంగా గాయపరుస్తోంది. రాక్షసుడితో రాజీ అబద్ధం' అని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి స్పష్టం చేశారు. స్థానిక పంచాయతీ రాజ్ అతిథిగృహంలో శనివారం పొద్దుపోయాక రాత్రి మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలిరోజు నుంచే రాజీవ్ నగర్‌లో వైసీపీ అక్రమ కట్టడాలను తొలగింపు చర్యలు చేపట్టామని, శ్రీకాళహస్తీశ్వరాలయంలో వైసీపీ ఆగడాలకు అడ్డుకట్ట వేశామన్నారు. స్వర్ణముఖి నది ఒడ్డున రోడ్డును ఆక్రమించి చేసిన కట్టడాల తొలగింపునకు శ్రీకారం చుడితే మాజీ ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి హంగామా సృష్టించి అధికారులపై వీరంగం సృష్టించడంతో కేసు నమోదు అయినట్లు చెప్పారు. దక్షిణ కైలాసనగర్‌లో మాజీ ఎమ్మెల్యే బావమరిది ఆక్రమించుకున్న భూమిని సంబంధిత వ్యక్తులకు ఇప్పించిన విషయాన్ని తెలియజేశారు. రేణిగుంట మండలంలో వందల అక్రమ కట్టడాలను ఒకే రోజు తొలగించామని చెప్పారు. మున్సిపల్ పరిధిలో పలు అక్రమ కట్టడాలను గుర్తించామని అయితే ఇదివరకు పనిచేసిన కమిషనర్ రమేష్ బాబు వారిని కోర్టుకు వెళ్లేలా చేశారని తెలిపారు. దీనివల్ల ఆ అక్రమ నిర్మాణాల కూల్చివేత ఆగిందన్నారు. వైసీపీ ఆక్రమాలను ఏ ఒక్కటీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. రెవెన్యూ సదస్సులు పూర్తయిన తర్వాత మళ్లీ మీడియా ముందుకొచ్చి నియోజకవర్గ వ్యాప్తంగా వైసీపీ భూఆక్రమణల వివరాలను వెల్లడిస్తానని స్పష్టంచేశారు.

శ్రీసిటీలో టొయామా ప్రతినిధుల బృందం



శ్రీసిటీ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జపాన్‌లోని టొయామా రాష్ట్రానికి చెందిన 16 మంది సభ్యులు, ప్రభుత్వ ఉన్నతాధికారుల బృందం శనివారం శ్రీసిటీని సందర్శించింది. టొయామా అసోసియేషన్ ఆఫ్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్, హొకురికు బ్యాంక్ సీనియర్ సలహాదారు హిడెనోరి మగినో నేతృత్వంలో వచ్చిన బృంద సభ్యులకు శ్రీసిటీ మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆర్.శివశంకర్ స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతి ప్రత్యేకతలు, పారిశ్రామిక అనుకూలతలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. నిర్మాణాత్మక పారిశ్రామిక పార్కును అభివృద్ధి చేయడంలో శ్రీసిటీ యాజమాన్య కృషిని వారు అభినందించారు. భారత్, టొయామా మధ్య వ్యాపార బంధం మరింత బలపడేందుకు ఈ పర్యటన ఉపయోగపడుతుందని శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పల్లె పండుగ పనులు వచ్చే నెలాఖరుకు పూర్తి కావాలి

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పల్లె పండుగలో భాగంగా జిల్లాకు కేటాయించిన పనులు జనవరి చివరి నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం రాత్రి కలెక్టరేట్ నుంచి సంబంధిత అధికారులతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. పల్లె పండుగలో భాగంగా జిల్లాకు రూ.200కోట్ల విలువైన పనులు కేటాయించారని, ఇందులో 70 శాతం సంక్రాంతి నాటికి, మిగిలిన 30 శాతం జనవరి చివరి నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ నెల 31 నాటికి అనిమల్ షెల్టర్స్ 900 పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్, జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారి రామ్మోహన్, ఎంపీడీవోలు, డ్వామా సహాయ ప్రాజెక్ట్ అధికారులు పాల్గొన్నారు.

22.40 కిలోల గంజాయి స్వాధీనం

- ఏడుగురి అరెస్టు

వెంకటగిరి టౌన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి రైల్వేస్టేషన్ వద్ద 22.40 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఏడుగురిని అరెస్టు చేసినట్లు సీఐ ఏవీ రమణ తెలిపారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మీడియాకు వివరాలు వెల్లడించారు. ముందుగా అందిన సమాచారం మేరకు వెంకటగిరి రైల్వేస్టేషన్ సమీపంలోని ముళ్లపొదల వద్ద గంజాయి విక్రయిస్తున్న పట్టణానికి చెందిన పెనుబర్తి గణేష్, యకసిరి చైతన్య, నక్కల నాని, లేబాకు జనార్దన, తంగా పేచిరాజ్, ఇద్దరు మైనర్లను అదుపులోకి తీసుకున్నామని సీఐ తెలిపారు. వీరి వద్ద నుంచి 22.40కిలో గంజాయిని, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ సుమారు రూ.2,46,400 ఉంటుందన్నారు. అలాగే పట్టణంలోని గంజాయి సేవించే 30మందికి కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. అదే విధంగా వివిధ కేసుల్లో నిందితులుగా ఉన్న పెనుబర్తి గణేష్, యకసిరి చైతన్య, నక్కల నాని, లేబాకు జనార్దన్ వద్ద నుంచి 11 మోటార్ సైకిళ్లు, పది పొటేళ్లు, రూ.లక్ష స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

శ్రీనివాస రామానుజన్ సేవలు మరువలేనివి



రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

గూడూరు అర్బన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గణితశాస్త్ర అభివృద్ధికి శ్రీనివాస రామానుజన్ చేసిన సేవలు మరువలేనివని ఎస్‌కేఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివ ప్రసాద్ అన్నారు. శనివారం కళాశాలలో శ్రీనివాస రామాజన్ జయంతి సందర్భంగా జాతీయ గణిత దినోత్సవం నిర్వహించారు. రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గణితశాస్త్రాన్ని అభివృద్ధి చేసేందుకు రామానుజన్ చేసిన సేవలను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకుని విద్యారంగంలో రాణించాలన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో గణితశాస్త్రం యొక్క అవశ్యకతపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కిరణ్మయి, శ్రీనివాసులు, నారాయణరాజు, శ్రీధర్‌వర్మ, పీరకుమార్, విజయమహేష్, రవిరాజు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో గణిత దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో కాంచన, పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, హరిబ్రహ్మ, హరిబాబు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

జాతీయ హ్యాండ్ రైటింగ్ పోటీల్లో గురుకుల విద్యార్థినులకు బంగారు పతకాలు

నాయుడుపేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో హ్యాండ్ రైటింగ్ పరీక్షల్లో నాయుడుపేట మండలం పుదూరు గురుకులానికి చెందిన 14 మంది విద్యార్థులు బంగారు పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ రూత్‌రమోలా తెలిపారు. సెప్టెంబరు 20వ తేదీన నేషనల్ హ్యాండ్ రైటింగ్ ఫోరం ఆఫ్ మహారాష్ట్ర నిర్వహించిన పరీక్షల్లో పుదూరు గురుకుల విద్యార్థినులు 138 మంది పాల్గొన్నారని చెప్పారు. శనివారం వెల్లడించిన ఫలితాల్లో గురుకులానికి చెందిన విద్యార్థినులు జి సౌజన్య, ఐ.నిత్యశ్రీ, పి.మైథిలి, ఆర్.మహేశ్వరి, సీహెచ్ రిహారిక, డి. లోకహర్షిత, డి. రాధిక, కె.మోక్షశ్రీ, ఆర్.ఏంజల్ ప్రియ, జి.గౌతమి, పి.లహరి, యు.అక్షయ, వై.లక్ష్మీఅశ్రిత, వై.సంధ్య బంగారు పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. వీరిని అధ్యాపకులు చంద్రలీల, శశికళ, గీతాసావిత్రి, శ్రీదేవి, లక్ష్మి, భవానీ, జాన్సీ తదితరులు అభినందించారు.

పక్షుల పండుగ నిర్వహించే క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేయండి

సూళ్లూరుపేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పక్షుల పండుగ నిర్వహించనున్న సూళ్లూరుపేట హైస్కూల్ క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేయాలని పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘ నాయకులు శనివారం మున్సిపల్ కమిషనర్ చిన్నయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక హైస్కూల్ క్రీడా ప్రాంగణం చిన్నపాటి వర్షమొచ్చిన నీరు నిలిచి చెరువును తలపిస్తోందన్నారు. అలాగే తాగునీరు వసతి లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పక్షుల పండుగకు కేటాయించిన నిధులతో బాలుర ఉన్నత పాఠశాల మైదానం అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు వరప్రసాద్, నాగరాజు, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు క్రిస్మస్ వేడుకలు



పాస్టర్లకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీవీఆర్ కల్యాణ మండపంలో శనివారం ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను పెంపొందించుకుని ప్రశాంత జీవనాన్ని గడపాలన్నారు. అనంతరం బైబిల్ పాఠశాల విద్యార్థులకు పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. పాస్టర్లకు బహుమతులు, దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో పాశం సంధ్యారాణి, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, ఇశ్రాయిల్‌కుమార్, కిషోర్ నాయుడు, మట్టం శ్రావణి, గుండాల లీలావతి, భారతి, డాక్టర్ రమణయ్య, నిర్మల, పాస్టర్లు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



జ్యోతి ప్రజ్వలనం చేస్తున్న డైరెక్టర్, పూర్వ విద్యార్థులు

కోట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. 1995-99లో ఇంజనీరింగ్ పూర్తిచేసిన విద్యార్థులందరూ శనివారం సమావేశమై సిల్వర్ జూబ్లీ సంబరాలు చేసుకున్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభించారు. అప్పటి గురువులను షీల్డ్‌లు, మెమెంటోలతో అభినందించారు. డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, ప్రాంగణ ఎంపికల అధికారి డాక్టర్ కిషందర్, విభాగాధిపతులు డాక్టర్ రవీంద్రారెడ్డి, డాక్టర్ విక్రమ్‌కుమార్ పాల్గొన్నారు.

సాగు భూములకు పట్టాలివ్వండి

కోట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సాగు భూములకు పట్టాలు ఇవ్వాలని దళితులు, గిరిజనులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. శనివారం మండల పరిధిలోని సిద్ధవరంలో తహసీల్దారు జయజయరావు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు జరిగింది. గ్రామ పొలిమేరల్లో ఉన్న సర్వే నెంబరు 20లోని ప్రభుత్వ భూములను గత 20 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నామని, ఆ భూములకు పట్టాలు ఇవ్వాలని దళితులు, గిరిజనులు కోరారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని తహసీల్దారు చెప్పారు. అలాగే భూ సమస్యలపై రైతులు అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ మధులత, సీడీపీవో మునికుమారి, సర్వేయర్ గోపీరెడ్డి, వీఆర్వో శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి ఎమ్మెల్యే సాయం

గూడూరు అర్బన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణానికి చెందిన రమీజ్ ఫీజుల నిమిత్తం ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ రూ.15వేలు అందజేశారు. ఈ నగదును కోట టీడీపీ నాయకులు శనివారం విద్యార్థికి అందజేశారు. ఎంసీఏ మొదటి సంవత్సరం చదువుతున్న రమీజ్ ఆర్థిక స్థోమత లేక ఫీజులు కట్టేందుకు ఇబ్బందిపడుతుండడంతో టీడీపీ మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్‌ఆహ్మద్, జిల్లా తెలుగు రైతు కార్యదర్శి నెల్లూరు మోహన్‌రెడ్డి, కోట ఎంపీటీసీ షంషుద్దీన్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన రూ. 15వేలు ఇవ్వగా ఆ నగదును టీడీపీ నాయకులు విద్యార్థికి అందజేశారు.

లక్ష్మీనరసింహస్వామికి పూజలు

చిల్లకూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామికి శనివారం ఉదయం అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాత్రి స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పల్లకీసేవ జరిపారు. ఆలయ సమీపంలో స్వామి, అమ్మవార్లను ఊరేగించారు.

అన్నదానం

గూడూరు అర్బన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక గమళ్లపాళెం నిరాశ్రయుల వసతిగృహంలో ఫ్రైండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కిరణ్ కుమార్‌రెడ్డి జయంతి సందర్భంగా వృద్ధులకు అన్నదానం చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు రాహుల్, దినేష్, ప్రశాంత్, కుమార్, రమేష్ పాల్గొన్నారు.

మూగబోయిన బీఎస్ఎన్ఎల్

తడ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తడ మండలంలో బీఎస్ఎన్ఎల్ సేవలు అధ్వానంగా ఉన్నాయి. ముఖ్యంగా సిగ్నల్స్ వినియోగదారులను ముప్పుతిప్పలు పెడుతున్నాయి. గత వారం రోజులుగా బీఎస్ఎన్ఎల్ సిగ్నల్స్ ఎప్పుడు ఉంటాయో.. ఎప్పుడు ఉండవో తెలియని పరిస్థితి నెలకొంది. అర్ధగంట పాటు సిగ్నల్స్ బాగా అంది ఫోన్లు పనిచేస్తే.. రెండు గంటలపాటు మూగబోతున్నాయి. వారం రోజులుగా ఇదే పరిస్థితి. శుక్రవారం సాయంత్రం సిగ్నల్స్ పూర్తిగా నిలిచిపోయి ఫోన్లు పనిచేయకపోగా, శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అదే పరిస్థితి. అసలే సరిహద్దు ప్రాంతం కావడం, సమస్య మరింత తీవ్రంగా ఉంది. బీఎస్ఎన్ఎల్ అధికారులు స్పందించి సిగ్నల్స్ సరిగా అందేలా చూడాలని వినియోగదారులు కోరుతునాన్నరు.

కల్వర్టులకు మరమ్మతులు చేయండి

బాలాయపల్లి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి) మండలంలోని పలుచోట్ల దెబ్బతిన్న కల్వర్టులకు మరమ్మతులు చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నాయుడుపేట - వెంకటగిరి రోడ్డు నుంచి మేల్చూరు మీదుగా జయంపు మార్గంలోని సంగవరం రోడ్డు సమీపాన ఉన్న కల్వర్టు ఇటీవల కురిసిన వర్షాలకు కోతకు గురైంది. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే నాయుడుపేట, వెంకటగిరి పట్టణాలవాసులు తీవ్ర అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఎలాంటి ప్రమాదం జరుగుతుందో అన్న ఆందోళనను ఆయా గ్రామాలలోని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా బంగారుపేట నుంచి నిడిగల్లు మీదుగా జయంపు గ్రామానికి వెళ్లే మార్గంలోని నిడిగల్లు రైల్వేగేటు సమీపాన ఉన్న కల్వర్టు గతంలో వచ్చిన వరదలకు ధ్వంసమైంది. ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులకు నోచుకోకపోవడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి కల్వర్టులకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



మేల్చూరు - జయంపు మార్గంలో సంగవరం వద్ద కోతకు గురైన కల్వర్టు

అసత్య కథనాలను ప్రచురిస్తే పరువునష్టం దావా వేస్తాం: పాశం

గూడూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నిరాధరణ ఆరోపణలు చేస్తూ అసత్య కథనాలను ప్రచురిస్తే పరువునష్టం దావా వేస్తామని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ హెచ్చరించారు. శనివారం స్థానిక ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ అవినీతి డబ్బుతో నడుపుతున్న పత్రికలో టీడీపీ సీనియర్ నాయకుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త గంగాప్రసాద్‌పై అసత్య ఆరోపణలు చేస్తూ కథనాలు ప్రచురించడం దుర్మార్గమన్నారు. గత ప్రభుత్వ హయాంలో సిలికా, క్వార్ట్జ్, ఇసుకను వైసీపీ నాయకులు దోపిడీకి పాల్పడి వేల కోట్ల రూపాయలు దోచుకున్నందుకే ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. వైసీపీ నాయకులు చేసిన తప్పులను తమకు ఆపాదించేందుకు తప్పుడు కథనాలను ప్రచురిస్తూ ప్రజలను మభ్యపెట్టడాన్ని సహించబోమన్నారు. నీతి, నిజాయితీ, నిబద్ధతకు మారుపేరైన చంద్రబాబు నాయుడు ఎవరు తప్పుచేసినా సహించబోరన్నారు. గత ప్రభుత్వంలో అడ్డగోలుగా వైసీపీ నాయకులు సహజ వనరులను కొల్లగొట్టి కోట్ల రూపాయలు దోచుకుంటే ఎందుకు ప్రచురించలేదని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వానికి మచ్చ తేచ్చేవిధంగా గంగాప్రసాద్‌పై అసత్య ఆరోపణలు చేయడం మంచిపద్ధతి కాదన్నారు. చట్టపరంగా అనుమతులు ఉన్నవారు మైనింగ్ నిర్వహించుకుంటే ఎవరూ అడ్డుచెప్పరన్నారు. గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి, సత్యవేడు నియోజకవర్గాలలో టీడీపీ ఎమ్మెల్యేల గెలుపునకు గంగాప్రసాద్ ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. ఆయనపై తప్పుడు కథనాలు ప్రచురిస్తే పరువునష్టం దావా వేయడం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, ఆరికట్ల మస్తాన్ నాయుడు, పట్టాభిరామిరెడ్డి, కిషోర్‌నాయుడు, అబ్దుల్ రహీం, దుద్దా రాఘవరెడ్డి, చంద్రమౌళి, వాటంబేడు శివకుమార్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్, పక్కన భాస్కర్‌రెడ్డి, అబ్దుల్ రహీం, పట్టాభిరామిరెడ్డి, వాటంబేడు శివకుమార్, మస్తాన్ నాయుడు తదితరులు

రైతులకు అండగా ఉండండి: విజయశ్రీ



చైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు, వైస్ చైర్మన్ శంకర్‌నాయుడును సత్కరిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల, సంచి కృష్ణయ్య, రమేష్‌నాయుడు, మురళీకృష్ణారెడ్డి, నాగేంద్రప్రసాద్‌రెడ్డి తదితరులు

పెళ్లకూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్వర్ణముఖి ఆనకట్ట సిస్టమ్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్, సభ్యులుగా ఎన్నికైన వారు రైతులకు అండగా ఉండాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ సూచించారు. శనివారం మండలంలోని బీమవరం గ్రామానికి చెందిన దామెర ప్రసాద్‌నాయుడు స్వర్ణముఖి ఆనకట్ట సిస్టమ్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికవడంతో అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రాజెక్ట్ కమిటీ సభ్యులందరూ రాజకీయాలకు అతీతంగా రైతుల ప్రయోజనాలను కాపాడాలన్నారు. స్వర్ణముఖి ఆనకట్ట పరిధిలో సాగునీటి కాలువల అభివృద్ధికి నిధుల మంజూరుకు కృషి చేస్తానన్నారు. అనంతరం సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో సాగునీటి సంఘాలకు ఎన్నికలే నిర్వహించకుండా ఆ వ్యవస్థనే నిర్వీర్యం చేసిన ఘనత జగన్‌కు దక్కిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నదుల అనుసంధానంతో పాటు అన్ని నీటి వనరులను అందిపుచ్చుకుని రైతులకు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించారని చెప్పారు. సీఎం చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా కమిటీలు పారదర్శకంగా పనిచేసి రైతుల ప్రయోజనాలను కాపాడాలని సూచించారు. అనంతరం కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు, సభ్యులు పాపాడి రాజగోపాల్‌రెడ్డి, వేలూరు హరినాయుడు, మరుపూరు మస్తాన్‌రెడ్డిని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, ఆమె భర్త పార్థసారధి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. అలాగే పెళ్లకూరు మండల టీడీపీ అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, స్వర్ణముఖి ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ పేరం రమేష్ నాయుడు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, రాష్ట్ర సర్పంచుల సంఘం నాయకులు శివకుమార్, నాగేంద్రప్రసాద్‌రెడ్డి, సిద్ధులయ్య నాయుడు, మదన్‌మోహన్ నాయుడు, సుబ్బరామయ్య, మురళీ నాయుడు, కృష్ణమ నాయుడు, మునిరామయ్య, రవినాయుడు, కేవీనాయుడు, నూతలపాటి ప్రసాద్ నాయుడు తదితరులు స్వర్ణముఖి ఆనకట్ట సిస్టమ్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్, సభ్యులను అభినందించారు కాగా, ఆరుగురు సభ్యులు ఉన్న స్వర్ణముఖి ఆనకట్ట సిస్టమ్‌లో పెళ్లకూరు మండలానికి చెందిన నలుగురు, బుచ్చినాయుడుకండ్రిగ, తొట్టంబేడు మండలాల నుంచి ఒక్కొక్కరు ఉన్నారు.

స్మార్ట్ లాక్‌తో చోరీలకు చెక్

నాయుడుపేట టౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌లాక్(సైరన్ లాక్)తో చోరీలకు అడ్డుకట్ట వేయవచ్చని డీఎస్పీ చెంచుబాబు తెలిపారు. శనివారం ఆయన తన కార్యాలయంలో ఆలయాల ధర్మకర్తలు, అర్చకులకు సైరన్ లాక్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యాలయంలో ఉన్న తలుపులకు సైరన్ లాక్ అమర్చి, దానికి తాకినప్పుడు ఏ విధంగా అలారం మోగుతుందో ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రోజురోజుకూ పెరుగుతున్న టెక్నాలజీని ఉపయోగించుకుని దొంగలు ఇళ్లల్లో, ఆలయాల్లో చోరీలు చేస్తున్నారని చెప్పారు. ప్రజలు ఎక్కడికైనా వెళ్లేటప్పుడు ఇంట్లో ఉన్న నగదు, బంగారు ఆభరణాలు భద్రపరుచుకోవడంతో పాటు సైరన్‌లాక్ అమర్చి వెళ్లాలని సూచించారు. ఇళ్లకే కాకుండా దేవాలయాలకు కూడా సైరన్ లాక్ అమర్చుకోవాలని ఆలయాల ధర్మకర్తలు, అర్చకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ బాబి, ఆలయ ధర్మకర్తలు, అర్చకులు, వ్యాపారస్థులు పాల్గొన్నారు.





స్మార్ట్‌లాక్ గురించి వివరిస్తున్న డీఎస్పీ చెంచుబాబు, అర్బన్ సీఐ బాబి - కార్యక్రమంలో పాల్గొన్న ఆలయాల ధర్మకర్తలు, అర్చకులు, వాపారస్తులు

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయండి



సూళ్లూరుపేట ఆర్టీసీ బస్టాండ్ వద్ద విద్యార్థుల నిరసన

సూళ్లూరుపేట, గూడూరు అర్బన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలంటూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సూళ్లూరుపేటలో విద్యార్థులు శనివారం ర్యాలీ చేశారు. అనంతరం స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి లోకేశ్ పాదయాత్ర ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చి 77 జీవోను వెంటనే రద్దు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న బ్లాక్‌లాగ్, ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు ముని శివ, కిరణ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. ● విద్యార్థుల ఫీజు రియంబర్స్‌మెంటు బకాయిలను వెంటనే విడుదల చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు అన్నారు. గూడూరులోని సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ, ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థులకు ఫీజు రియంబర్స్‌మెంట్, వసతిదీవెన నగదు బకాయి ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అదేవిధంగా యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. యువగళం పాదయాత్రలో మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు జీవో నంబరు 77న రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో శశికుమార్, ప్రణయ్, సత్య సాయి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



గూడూరులో కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, విజయ్‌కుమార్‌రెడ్డి, బత్తిని విజయ్‌కుమార్, బొమ్మిడి శ్రీనివాసులు



పెళ్లకూరు మండలం చిల్లకూరులో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి తదితరులు

మాజీ సీఎం జగన్ జన్మదిన వేడుకలు

గూడూరు అర్బన్, పెళ్లకూరు, నాయుడుపేట, ఓజిలి, వాకాడు, సూళ్లూరుపేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. గూడూరు పట్టణంలోని అంబేద్కర్ నగర్ సమీపంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో మల్లు విజయ్‌కుమార్‌రెడ్డి, బత్తిని విజయ్‌కుమార్, బొమ్మిడి శ్రీనివాసులు, మధుసూదన్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, రాధారెడ్డి, సునీల్ తదితరులు పాల్గొన్నారు. ● పెళ్లకూరు మండలంలోని చిల్లకూరులో జగన్ జన్మదిన వేడుకలను ఎస్డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, జడ్పీటీసీ నన్నం ప్రిష్కిల్లా, వైస్ఎంపీపీ ఇలకా సుధారాణి, వైసీపీ మండల కన్వీనర్ వెంకటరత్నం, నాయకులు పెళ్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి, కరణం రఘు నాయుడు, పాలూరు దశరథరామిరెడ్డి, హరిబాబురెడ్డి, ఎల్లు మోహన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే నాయుడుపేట, ఓజిలి, వాకాడు, సూళ్లూరుపేటలో జగన్‌జన్మదిన వేడుకలను నిర్వహించారు.

శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ఠ చర్యలు



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ రమణకుమార్, పక్కన సీఐ శ్రీనివాస్

గూడూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్ఠ చర్యలు చేపడుతున్నామని డీఎస్పీ రమణకుమార్ అన్నారు. శనివారం స్థానిక రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసును త్వరిగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎవరైనా చట్టాను ఉల్లంఘించి నేరాలకు పాల్పడితే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో రెండో పట్టణ సీఐ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్ సర్వీస్ సెంటర్‌లో షార్ట్ సర్క్యూట్



వాటర్ సర్వీస్ సెంటర్‌లో ఎగిసి పడుతున్న మంటలు

నాయుడుపేట టౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - మల్లాం జంక్షన్ వద్ద ఉన్న వాటర్ సర్వీస్ సెంటర్‌లో షార్ట్ సర్క్యూట్ జరగడంతో భారీగా మంటలు చెలరేగాయి. బాధితుడి కథనం మేరకు... పట్టణంలోని రాజగోపాలపురంలో నివాసం ఉంటున్న యాభవరెడ్డి మల్లాం జంక్షన్ వద్ద వాటర్ సర్వీస్ సెంటర్ నడుపుతున్నారు. శుక్రవారం రాత్రి సర్వీస్ సెంటర్‌ను మూసివేసి ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో అకస్మాత్తుగా మంటలు చేలరేగాయి. స్థానికులు గమనించి అగ్నిమాపకశాఖ అధికారులు, పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనాస్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేశారు. వాటర్ సర్వీస్ సెంటర్‌కు కూతవేటు దూరంలో పెట్రోల్ బంకు ఉండటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అగ్నిమాపక సిబ్బంది మంటలు వ్యాప్తి చెందకుండా అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది. అగ్నిప్రమాదంతో రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు యాభవరెడ్డి అధికారులకు ఫిర్యాదు చేశాడు.

సిమెంటు రోడ్డుకు భూమిపూజ



సిమెంటు రోడ్డు భూమిపూజలో పాల్గొన్న టీడీపీ నాయకులు శంకరయ్య, తిరుపాల్, వెంకటేశ్వర్లు తదితరులు

సూళ్లూరుపేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దామరాయి పంచాయతీ తోటకట్ల హరిజనవాడకు రూ.5 లక్షల నిధులతో సిమెంటు రోడ్డు నిర్మాణానికి టీడీపీ మండల అధ్యక్షుడు కొక్కు శంకరయ్య శనివారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో దామరాయి, కడపత్ర సర్పంచులు రమణమ్మ, చెంచమ్మ, టీడీపీ నాయకులు తిరుపాల్, గొంజి వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ ఇంజనీర్ కౌశల్య తదిదతరులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకులపై తప్పుడు కేసులు సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న రాంకుమార్‌రెడ్డి, పక్కన హరికృష్ణ, బాలయ్య, శ్రీనివాసులు

వెంకటగిరి టౌన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులపై తప్పుడు కేసులు మోపడం సరికాదని వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఎన్‌జేఆర్ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసీపీ నాయకుడు తంగా పేచీరాజ్‌ను తెల్లవారుజామున 4గంటలకు పోలీసులు తీసుకెళ్లడం మంచి పద్ధతి కాదన్నారు. అతడిపై అక్రమ వేసులు పెట్టేందుకు ప్రత్నిస్తున్నారని, విచారణ చేయకుండా తప్పుడు కేసులు పెడితే పోలీసులు పూర్తి బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. ఈ విషయంపై జిల్లా ఎస్పీ, డీజీపీ, హ్యూమన్ రైట్స్ కమిషన్‌కు కూడా ఫిర్యాదు చేశామన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు చిట్టేటి హరికృష్ణ, కౌన్సిలర్లు కల్యాణి, వహిదా, సుజాత, శాతరాసి బాలయ్య, ప్రసాద్‌రెడ్డి, రాజారెడ్డి, ధానీబాషా పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు శిక్షణ తరగతులు

కోట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ క్యాడెట్లలో దేశభక్తి, క్రమశిక్షణ, సోదరభావం, పోటీతత్వం పెంపొందించడం కోసమే శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని కమాండెంట్ గణేష్ గొడంగవే అన్నారు. మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో శనివారం ఎన్‌సీసీ వార్షిక శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈనెల 29వరకు శిక్షణ తరగతులు జరుగుతాయని గొడంగవే తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, కోఆర్డినేటర్ రాజ, విద్యార్థులు ఉన్నారు.

'పేద విద్యార్థులను ఆదుకుంటాం'

కోట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): చదువుకోవాలన్న తపన, ప్రతిభా పాటవాలు కలిగిన విద్యార్థులను దాతల సహకారంతో అన్ని విధాలుగా ఆదుకుంటామని శ్రీ షిరిడీసాయి అక్షయ సేవాసమితి కన్వీనర్ అల్లం రమణయ్య భరోసా ఇచ్చారు. కోట పట్టణంలోని అక్షయ సేవాసమితి కార్యాలయంలో శనివారం నెల్లూరు జిల్లా కొత్తఎల్ఎంటి గ్రామానికి చెందిన విద్యార్థి కుప్పల పృధ్వీ అరవింద్ కళాశాల ఫీజుల నిమిత్తం దాతల సహకారంతో రూ.10వేల చెక్కురూపంలో అందజేశారు. కార్యక్రమంలో పెంచల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌కు ప్రింటర్ అందజేత

నాయుడుపేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పోలీస్ స్టేషన్‌కు కేఆర్ చారిటబుల్ ట్రస్టు సహకారంతో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీరెడ్డి శనివారం సీఐ బాబీకి ప్రింటర్ అందజేశారు.